అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 21-11-2024

సంపుటి : 10 సంచిక : 322 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



అదరగొట్టిన అమ్మాయిలు

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ విజేత భారత్, ఫైనల్లో చైనాపై గెలుపు

14లో

అసెంబ్లీకి రా.. సామీ

మీరేం చేశారో మేమేం చేశామో లెక్క తేలుద్దాం : కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్

- కొండపోచమ్మ సాగర్‌లో భూములు గుంజుకున్న చరిత్ర మీది
- కొడంగల్‌లో భూసేకరణ చేస్తే కడుపుమంట దేనికి?
- అభివృద్ధి కోసం ఎవరైనా భూమి కోల్పోవాల్సిందే..
- మూడు రెట్ల పరిహారం ఇచ్చేందుకు నిర్ణయించాం: వేములవాడ ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం



రెండుసార్లు పార్లమెంట్‌కు పంపినా 'బండి' రూపాయి తేలేదంటూ వ్యాఖ్య

రూ.679 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / వేములవాడ / వేములవాడ రూరల్

'మీరెన్ని కుట్రలు చేసినా.. కుతంత్రాలు పన్నినా.. పదేండ్లలో మీరు చేసిన అభివృద్ధికి.. పది నెలల కాలంలో మేము చేసిన అభివృద్ధికి పూర్తి లెక్కలు ఉన్నాయి. వాటన్నింటిపైనా చర్చ పెడదాం. ధైర్యం ఉంటే ఒక్కసారి అసెంబ్లీకి రా.. సామీ' అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ప్రజాపాలన విజయోత్సవ యాత్రలో భాగంగా రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం రూ.679 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం అక్కడే రాజన్న ఆలయ చెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఆనాడు పాదయాత్రలో భాగంగా వేములవాడ రాజన్నను దర్శించుకుని మాట ఇచ్చానని, ఇందిరమ్మ రాజ్యంలో ఇప్పుడీ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. గత సర్కారు పడావు పెట్టిన ప్రాజెక్టులన్నీ పూర్తి చేసుకుంటూ ...13లో

50వేల ఉద్యోగాల్లో ఒక్కటి తగ్గినా క్షమాపణ చెబుతా..

పదేండ్లలో 2లక్షల ఉద్యోగాలు ఇచ్చామని కేసీఆర్ అబద్ధపు లెక్కలు చెప్పారని, తాము అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల కాలంలో ఇచ్చిన 50 వేల ఉద్యోగాలను లెక్క కట్టి చూపిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్క తల తగ్గినా తాను క్షమాపణ చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానంటూ సవాల్ విసిరారు. రూ.11వేల కోట్ల రుణమాఫీకి కేసీఆర్ ఐదేండ్లు తీసుకున్నారని, 25 రోజుల్లో తాము 23 లక్షల కుటుంబాలకు రూ.18వేల కోట్లు రుణమాఫీ చేశామని వివరించారు. ఈ లెక్కలన్నీ బయటకు తీసి చర్చకు పెడతామని, ధైర్యం ఉంటే నిజాన్ని ఎదుర్కొనే సత్తా ఉంటే అసెంబ్లీకి రావాలని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. 'ఏలేశ్వరం పోయినా శనేశ్వరం వదల లేదన్నట్టుగా' బీఆర్ఎస్‌ను ఓడించినా వాళ్ల తీరు మారలేదని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వారి సంగతి తేలుస్తామన్నారు.

5.8 కోట్ల రేషన్ కార్డుల

ఏరివేత



80.9 కోట్లలో 20.4 కోట్ల రేషన్ కార్డులే డిజిటలైజేషన్ : కేంద్ర ఆహార మంత్రిత్వ శాఖ

దేశంలో ఇప్పటికీ కోట్లాది మంది పేదలున్నారని, వారికోసం ఉచితంగా బియ్యం సరఫరా చేస్తున్నట్టు కేంద్రంలోని బీజేపీ సర్కార్ చెబుతోంది. మరోవైపు వారి నోటి కాడి కూడును లాగేసుకునేందుకు నకిలీల పేరుతో భారీసంఖ్యలో రేషన్ కార్డులను తొలగించి రేషన్‌కు కోతపెట్టింది. ఈ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం పేదలంటే గిట్టనట్టుగా చూస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా 5.8 కోట్ల రేషన్ కార్డులను కేంద్ర ప్రభుత్వం ఏరివేసింది. నకిలీ కార్డు పేరుతో వీటిని తొలగించింది. మరోపక్క ఇప్పటికే దేశంలో 20.4 కోట్ల రేషన్ కార్డులను డిజిటలైజేషన్ చేసినట్టు తెలిపింది. ఈ మేరకు బుధవారం కేంద్ర వినియోగ వ్యవహారాలు, ప్రజా పంపిణీ, ఆహార మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది. డిజిటలైజేషన్ వల్ల ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్)లో భారీ స్థాయిలో మార్పులు వచ్చాయని, ప్రపంచవ్యాప్తంగా ఆహార భద్రతా కార్యక్రమాలకు బెంచ్ మార్కును నెలకొల్పినట్టు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ వ్యవస్థ ద్వారా దేశంలో మొత్తం 80.9 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం జరుగుతుందని, ఆధార్ ఆధారిత ధ్రువీకరణ, ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈకెవైసి) వెరిఫికేషన్ వంటి వాటి ద్వారా 5.8 నకిలీ రేషన్ కార్డులను తొలగించినట్టు తెలిపింది.ఇప్పటి వరకు 20.4 కోట్ల రేషన్ కార్డుల డిజిటలీకరణ పూర్తి అయ్యిందని, దేశవ్యాప్తంగా 5.33 లక్షల రేషన్ దుకాణాలకు ఈ-పోస్ పరికరాల ద్వారా ఆహార పంపిణీ జరుగుతోందని పేర్కొంది. పంపిణీ సమయంలో ఆధార్ ఆధారిత ప్రామాణీకరణను ప్రారంభించడంతో లబ్ధిదారుల సరైన లక్ష్యాన్ని ... 5లో



గెలుపెవరిది?

మహారాష్ట్రలో 58.22 శాతం •జార్ఖండ్‌లో 67.59 శాతం

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

మహారాష్ట్రలో పోలింగ్‌కు అంతరాయం, కొన్ని చోట్ల దాడులు

గుండెపోటుతో పోలింగ్ స్టేషన్‌లోనే స్వతంత్ర అభ్యర్థి మృతి

ఎగ్జిట్ పోల్స్‌పై సర్వత్రా ఆసక్తి.. 23న తేలనున్న భవితవ్యం

రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపెవరిదన్న ఉత్కంఠ నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ ఎక్కువగా ఎన్డీయే వైపు మొగ్గినా అసలు ఫలితాలు ఎలా ఉంటాయోనన్న చర్చ నడుస్తుంది. కాగా మహారాష్ట్రలో ఒకే దశలో మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు, జార్ఖండ్‌లో రెండోదశలో 38 స్థానాలకు పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసినట్టు కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొంది. మహారాష్ట్రలో సాయంత్రం 5 గంటల వరకు 58.22 శాతం పోలింగ్ నమోదైంది. మరోవైపు జార్ఖండ్‌లో సాయంత్రం 5 గంటల వరకు ...5లో

'అదానీ' విద్యుత్ ఒప్పందాలు

సమీక్షించండి

బంగ్లాదేశ్ హైకోర్టు ఆదేశం



ఢాకా : అదానీ గ్రూపుతో కుదుర్చుకున్న విద్యుత్ ఎగుమతి ఒప్పందాలను సమీక్షించాలని, అందుకోసం ఉన్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేయాలని బంగ్లాదేశ్ హైకోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఇంధన, న్యాయ నిపుణులతో నెల రోజుల్లో కమిటీని ఏర్పాటు చేయాలని, ...13లో



వికటించిన మధ్యాహ్న భోజనం

25 మంది విద్యార్థులకు అస్వస్థత

మాగనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఘటన

నిర్లక్ష్యంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం

నవతెలంగాణ-మాగనూరు

నారాయణపేట్ జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గమనించిన పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. వారిలో కొంత మందికి ప్రాథమిక చికిత్స అందించి ఇండ్లకు పంపించారు. తొమ్మిది మంది విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం మక్తల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్టు ...6లో

- గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ చట్టాన్ని అమలు చేయలేదు
- కేసీఆర్ అహంకార విధానాలనే అనుసరిస్తున్న రేవంత్ రెడ్డి
- విదేశీ సంస్థలకు భూములప్పగించేందుకే ఫార్మా కంపెనీల ఏర్పాటు
- బీజేపీ మతోన్మాద విధానాలపై నిరంతర పోరాటం
- కలెక్టర్, అధికారులపై దాడి కరెక్ట్ కాదు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

బాధిత రైతులకు అండగా నిలుస్తాం

నేడు లగచర్లకు వామపక్ష నేతలు



నవతెలంగాణ-సూర్యాపేట

బాధిత రైతులకు అండగా నిలిచేందుకు వామపక్ష నేతలతో కలిసి గురువారం లగచర్లకు వెళ్లబోతున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. రైతులకు అండగా నిలబడతామన్నారు. బాధిత కుటుంబాలను పరామర్శిస్తామన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా స్థానిక యంవీఎన్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మాకంపెనీ కోసం రైతులపై నిర్బంధం ప్రయోగించి భూములు సేకరించడం సరికాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అవలంబిస్తోన్న రైతు వ్యతిరేక విధానాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తోందన్నారు. గురువారం సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజాపంథా, ఇతర వామపక్ష పార్టీలతో కలిసి లగచర్లకు వెళ్లి బాధిత రైతులను పరామర్శిస్తామని తెలిపారు. రైతుల సమస్యలు తెలుసుకుని ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడతామని చెప్పారు. గతంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద ఫార్మాసిటీ ఏర్పాటు కోసం భూసేకరణ చేసినప్పుడు కూడా అక్కడి రైతులు వ్యతిరేకించారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా బలవంతంగా భూసేకరణ చేసిందని తెలిపారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా పనిచేసిన పదేండ్లలో చట్టాలను ఉల్లంఘించి భూసేకరణ చేశారని, ఇప్పుడు కేటీఆర్ రైతుల పక్షాన మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండానే భూసేకరణ నోటిఫికేషన్ ఇచ్చారని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయలేదని ...3లో



అమెరికా ఎంబసీ ఖాళీ

రష్యా వైమానిక దాడుల హెచ్చరికలతో అప్రమత్తం

కీవ్ : రష్యా వైమానిక దాడి చేసే అవకాశం వుందని బుధవారం తమకు హెచ్చరిక వచ్చిందని కీవ్‌లోని అమెరికా ఎంబసీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా ఎంబసీని మూసివేస్తున్నట్లు వెల్లడించింది. రాయబార కార్యాలయంలోని ఉద్యోగులందరూ సురక్షిత ప్రాంతాల్లో వుండాల్సిందిగా ఎంబసీ సూచనలు జారీ చేసింది. అప్రమత్తంగా వుండాల్సి వస్తే తక్షణమే షెల్టర్లలో తల దాచుకునేందుకు సంసిద్ధులు కావాల్సిందిగా కీవ్‌లోని అమెరికన్లకు సూచించింది. ఉక్రెయిన్‌లో రష్యా వైమానిక దాడులు నిత్యకృత్యంగా మారిన నేపథ్యంలో ప్రత్యేకించి ఎంబసీకి హెచ్చరిక వచ్చినందున దీనిపై అప్రమత్తం అయ్యారు. రష్యాలోని బ్రియాన్స్క ప్రాంతంలో ఆయుధాల గిడ్డంగిపై అమెరికా తయారీ ...13లో



గిగ్ వర్కర్ల చట్టం పటిష్టంగా ఉండాలి

పనిలో సామాజిక వివక్ష, అమానవీయతను ఎదుర్కొంటున్నారు : సీఎం రేవంత్‌కు రాహుల్ లేఖ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గిగ్ వర్కర్ల చట్టాన్ని పటిష్టంగా తీసుకురావాలని ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సూచించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. గిగ్ వర్కర్ల కోసం తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా చట్టానికి ఆయన సూచనలు చేశారు. చట్టాన్ని మరింత ప్రభావవంతం చేసేందుకు ప్రజా సంప్రదింపులు జరపాలని సూచించారు. గత దశాబ్దంలో లక్షలాది మంది కార్మికులు గిగ్ ఎకానమీలో ఉన్నారని, ముఖ్యంగా తక్కువ నైపుణ్యం కలిగిన వారికి కూడా ఆ రంగం సులభంగా అవకాశాలను అందించిందని తెలిపారు. ప్రారంభ సంవత్సరాల్లో ఉదారమైన ప్రోత్సాహకాలు చాలా మందికి ఆదాయాన్ని సంపాదించే ఆస్తులను సంపాదించడంలో సహాయపడిందని పేర్కొన్నారు. ఈ చాలా పెద్ద మార్కెట్‌లోకి ప్రవేశించడానికి కార్మికులకు ఒక వేదికను కూడా అందించిందని, ముఖ్యంగా ప్రత్యామ్నాయ ఉద్యోగాలు లేనప్పుడు, జీవనోపాధి అవకాశాలను కనుగొన్న కార్మికుల విజయ గాథలతో ఈ రంగం నిండి ఉందని తెలిపారు. కార్మికులు తమ ఉపాధి కారణంగా ఉత్పన్నమయ్యే వారి సమస్యలను పదే పదే ...5లో



అరోరా ఫార్మా కంపెనీలో

అగ్నిప్రమాదం

కార్మికుడు మృతి ముగ్గురికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని జీడిమెట్ల పారిశ్రామిక వాడలో ఉన్న అరోరా ఫార్మా కంపెనీలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఓ కార్మికుడు మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకెల్తే.. అరోరా ఫార్మా కంపెనీలోని బాయిలర్‌ను కార్మికుడు అనిల్(43) శుభ్రం చేస్తున్న క్రమంలో సాల్వెంట్ ఫైర్ అయ్యి మృతి చెందాడు. గోపి, శ్రీనివాస్, బలరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అప్రమత్తమైన ఫార్మా సిబ్బంది వెంటనే వారిని సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రికి తరలించారు. కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఫార్మా కంపెనీ నడుపుతున్న యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబీకులు డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ క్రమంలో ఫార్మా కంపెనీ ముందు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఫైర్ సిబ్బందికి సైతం సమాచారం ఇవ్వలేదని జీడిమెట్ల స్పెషల్ ఫైర్ ఆఫీసర్ శంకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సూరారం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

డీఏపీ కోసం రోడ్డెక్కిన రైతన్న

•నిరసనలో బీజేపీ అనుబంధ బీకేఎస్ •నష్టనివారణ చర్యలు చేపట్టిన మంత్రులు, ఎమ్మెల్యేలు

పంట విత్తుకునే సమయంలో డైఅమ్మోనియం ఫాస్పేట్ (డీఏపీ) ఎరువుకు కొరత ఏర్పడడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉదాశీన వైఖరిని నిరసిస్తూ పలు ప్రాంతాల్లో రోడ్డెక్కారు. ఒక వైపు డీఏపీకి కొరత ఏమీ లేదని చెబుతూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న మోడీ ప్రభుత్వం మరోవైపు నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా మెజిస్ట్రేట్లను (డీఎంలు) రంగంలోకి దింపింది. ఆర్ఎస్ఎస్ అనుబంధ భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) సహా రైతు సంఘాలు నిరసన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రభుత్వం వద్ద తగిన ప్రణాళిక లేకపోవడం, ఎరువుల సబ్సిడీలను సరిగా పెంచకపోవడం ఈ పరిస్థితికి కారణమని నిపుణులు అభిప్రాయపడ్డారు.



రాష్ట్రాల్లో కొరత

న్యూఢిల్లీ : యూరియా తర్వాత రైతులు అధికంగా వినియోగించే ఎరువు డీఏపీయే. అక్టోబర్ 11వ తేదీన దేశంలో రబీ సీజన్ మొదలైంది. అన్నదాతలు పంట వేసుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే సకాలంలో డీఏపీ ఎరువును అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యం వారిలో ఆగ్రహాన్ని రేపుతోంది. హర్యానాలో పోలీస్ స్టేషన్లలో డీఏపీని పంపిణీ చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. మధ్యప్రదేశ్‌లో సమస్యను పరిష్కరించే బాధ్యతను ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మంత్రులకు అప్పగించారు. రాష్ట్రంలోని పదిహేను జిల్లాల్లో డీఏపీ ఎరువుకు కొరత ఏర్పడడంతో బీకేఎస్ ఆందోళన ప్రారంభించింది. సకాలంలో చైనా, రష్యా దేశాల నుండి డీఏపీని కేంద్రం దిగుమతి చేసుకోలేకపోయిందని, దీంతో రాష్ట్ర అవసరాల్లో కేవలం సగం ఎరువు మాత్రమే అందుబాటులో ఉన్నదని తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. రాష్ట్రంలో ...13లో

బీకేఎస్ అసంతృప్తి

రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా సరఫరాల్లో అంతరాయం ఏర్పడిన మాట నిజమే అయినా యుద్ధం హఠాత్తుగా వచ్చి పడిందేమీ కాదని బీకేఎస్ చెప్పింది. ప్రభుత్వం ముందుగానే మేల్కొని ఓ వ్యూహాన్ని రూపొందించుకొని ఉండాల్సిందని అభిప్రాయపడింది. డీఏపీని అధికంగా ఉపయోగించే గోధుమ, ఇతర పంటలకు నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం మాత్రం డీఏపీ ఎరువుకు కొరతే లేదంటూ గణాంకాలను ఏకరువు పెడుతోంది.

డైవర్షన్ పొలి'ట్రిక్స్'

- రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల యుద్ధం
- వ్యక్తిగత విమర్శలతో ప్రజాసమస్యలు గాలికి
- ట్విటర్ టిల్లు, చిట్టినాయుడు అంటూ వంగ్య వాగ్భాణాలు
- సంచలన ప్రకటనలతో కాలం వృధా



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర రాజకీయాల్లో హుందాతనం కొరవడుతున్నది. సద్విమర్శల స్థానే వ్యక్తిగత ఆరోపణలు చోటుచేసుకుంటున్నాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శల యుద్ధం కొనసాగుతుంటే, ప్రజా సమస్యలు గాల్లో దీపాలవుతున్నాయి. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. జనంగోడు ఎజెండా కావాల్సిన తరుణంలో స్వార్థ రాజకీయ ప్రయోజనాలు పరకాయప్రవేశం చేస్తున్నాయి. తాజాగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య చోటుచేసుకుంటున్న పరిణామాలతో ఆశ్చర్యపోవడం ప్రజల వంతవుతున్నది. ఇదే అదనుగా బీజేపీ చోద్యం చూస్తున్నది.

ప్రధానంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు మధ్య జరుగుతున్న విమర్శల పరంపర అందరికీ తెలిసిందే. కేటీఆర్‌ను కాంగ్రెస్ ట్విటర్ టిల్లు అంటే, సీఎం రేవంత్‌ను బీఆర్ఎస్ చిట్టినాయుడు అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యలు చేస్తుండటం చూస్తున్నాం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సాధ్యమైనంతలో హామీలను అమలుచేస్తున్నామని కాంగ్రెస్ అంటుండగా, మీరిచ్చిన వాగ్దానాలు మూసీలో కొట్టుకుపోయాయని బీఆర్ఎస్ చెబుతున్నది. కాంగ్రెస్ నుంచి సీఎంతోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి, సీతక్క, కోమటిరెడ్డి తదితరులు తెలంగాణ భవన్‌పై ఒంటికాలిపై లేస్తున్నారు. అలాగే గాంధీభవన్‌పై కేటీఆర్, హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి తదితరులు గళం వినిపిస్తున్నారు. టిట్ ఫర్ టాట్‌లా ఒకరిపై మరొకరు ఆరోపణలు, విమర్శలు చేసుకుంటూ అసలు విషయాలపై ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారు. రాష్ట్ర రాజకీయాలు జుగుప్సాకరంగా తయారయ్యాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. విధానాల ప్రాతిపదికన కాకుండా వ్యక్తిగత అంశాల ఆధారంగా రాజకీయాలు నడుస్తుండటంతో ప్రజాసమస్యల ఎజెండా పక్కకుపోతున్నదని వామపక్షాలు అభిప్రాయపడుతున్నాయి. రాజకీయాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం కొరవడుతుండటం, హుందాతనం లోపిస్తుండటంతో ఇటు పాలకపక్షం, అటు ప్రతిపక్షం యువతకు, భవిష్యత్ తరాలకు ఎలాంటి విలువలు, ఆదర్శాలు వారసత్వంగా లభిస్తాయనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. విధానాలపై సద్విమర్శలు చేసే బదులు ఇలా వ్యక్తిగత దూషణలకు దిగడం సామాన్యులు, పేదలకు ఎలాంటి ప్రయోజనాలూ చేకూర్చదు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాస్వామ్యయుతంగా లేదనే వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర ఒకట్రెండు హామీలు మినహా మెజార్టీ హామీలు విస్మరించారని ప్రతిపక్షాలు అంటున్నాయి. తొలుత హైడ్రా పేరుతో సర్కారుకు జనంలో క్రేజ్ పెరిగింది. కష్టపడి నాలుగు పైసలు వెనకేసుకుని కొన్న పేదల ఇండ్లను కూలగొట్టేందుకు హైడ్రా ముందుకు రావడంతో కొంత అసంతృప్తి నెలకొంది. అధికారంలో ఉన్న వాళ్లు బాధ్యతతో వ్యవహరించాలి. ప్రతిపక్షంలో ఉన్నవాళ్లు సర్కారుకు నిర్మాణాత్మక సలహాలు, సూచనలు అందించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ రెండూ ప్రశ్నార్థకమవుతున్నాయి. ఇదిలావుంటే సందట్లో సడేమియాలా బీజేపీ లబ్ది పొందాలని చూస్తున్నది. అధికార, ప్రతిపక్షాలను తప్పుబట్టడమే తప్పితే, మోడీ సర్కారు నుంచి నాలుగు రూపాయలు ఎక్కువ తెచ్చి రాష్ట్రాభివృద్ధికి సహకరించే ఆలోచన లేదు. ఎంతసేపూ మోడీ, అమిత్‌షాలకు బాకా ఊదే కేంద్ర మంత్రులు, రాష్ట్ర ఆర్థికస్థితిని మెరుగుచేసే ప్రయత్నమే చేయడం లేదు. సాధారణ నిధుల దగ్గర నుంచి జీఎస్టీ కాసుల వరకు హక్కుగా రావాల్సిన వాటిని మోడీ సర్కారు అడ్డుకుంటున్నది. కొర్రీలు పెడుతూ తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శిస్తున్నది. ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటూ మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నది. వీరు సైతం సంచలన రాజకీయ ప్రకటనలకే పరిమితమవుతున్నారు. రాష్ట్రానికి మంజూరై పనులు ఆలస్యమవుతున్న జాతీయ రహదారులపై ఇద్దరు కేంద్రమంత్రులకు దృష్టి లేదు. భారీ వర్షాలతో నష్టపోయిన రాష్ట్రానికి సాయం చేసే విషయమై పట్టింపు అంతకన్నా లేదు. మూసీ నిద్ర అంటూ కాలం గడపడం తప్ప పటిష్ట కార్యాచరణ అసలే లేదు. రాష్ట్రం అప్పులకుప్పగా మారుతున్న తరుణంలో ఆదుకోవాల్సిన కేంద్రం చోద్యం చూస్తుండగా, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులిద్దరూ, నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు అనే చందాన వ్యవహరిస్తుండటం గమనార్హం.



97వ వసంతంలోకి చుక్కా రామయ్య

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పలువురు ప్రముఖులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య 97వ వసంతంలోకి అడుగుపెట్టారు. 96 వసంతాలు పూర్తయ్యాయి. 1928, నవంబర్ 20న జనగామ జిల్లా గూడూరు గ్రామంలో ఆయన జన్మించారు. ఐఐటీ శిక్షణా కేంద్రాన్ని స్థాపించడం కోసం ఆయన హైదరాబాద్‌కు వచ్చారు. ఐఐటీ శిక్షణలో మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుని ఐఐటీ రామయ్యగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన జన్మదిన వేడుకలు బుధవారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఆయన నివాసంలో జరిగాయి. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, శ్రేయోభిలాషులు ఆయన నివాసానికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ హోంమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి చుక్కా రామయ్య నివాసానికి వచ్చి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. స్వయంగా ఆమె రామయ్యతో కేక్ కట్ చేయించారు. ఎమ్మెల్సీలు కోదండరామ్, అలుగుబెల్లి నర్సిరెడ్డి, రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి సుదర్శన్‌రెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటప్ప, వందన, సీనియర్ నాయకులు మస్తాన్‌రావుతోపాటు సీనియర్ సంపాదకులు కె రామచంద్రమూర్తి, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ పాత్రికేయులు మల్లేపల్లి లక్ష్మయ్య, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్ తదితరులు రామయ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రయివేటు కాలేజీల సమస్యలపై సానుకూలంగా ఉన్నాం

యాజమాన్యాల సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రయివేటు ఇంటర్, డిగ్రీ కాలేజీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో కాలేజీ యాజమాన్యాలతో ఆయన సమావేశమయ్యారు. ఉన్నత విద్యామండలి చైర్మెన్ వి బాలకిష్టారెడ్డి, ప్రయివేటు కాలేజీ యాజమాన్యాల సంఘం అధ్యక్షులు సూర్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి యాద రామకృష్ణ, ఇతర నాయకులు నాగయ్య తదితరులతో వివిధ అంశాలపై చర్చించారు. కాలేజీల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని భట్టి హామీ ఇచ్చారు.

డైట్ కాలేజీల్లో ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానం

- ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే అమలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు డైట్ కాలేజీల్లో ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ విధానం (ఎఫ్ఆర్ఎస్)ను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుత విద్యాసంవత్సరం (2024-25) నుంచే దీన్ని అమలు చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. డైట్ కాలేజీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందితోపాటు విద్యార్థులకు కూడా ఎఫ్ఆర్ఎస్‌ను అమలు చేస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించి ఆర్ఎస్ఐటీ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థకు ఎఫ్ఆర్ఎస్ అమలుకు సంబంధించి సాంకేతిక సహకారాన్ని అందిస్తుందని పేర్కొన్నారు.

78 శాతం సర్వే పూర్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కుల గణన బుధవారంనాటికి 78 శాతం పూర్తయ్యింది. ఇప్పటి వరకు 90,56,383, నివాసాలలో సర్వే పూర్తి అయినట్టు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. ఇప్పటి వరకు సర్వేలో ములుగు జిల్లా ప్రథమస్థానంలో ఉండగా జనగాం, నల్గొండ జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. కామారెడ్డిలో 93.3 శాతం, మంచిర్యాల 93.2 శాతం, యాదాద్రి భువనగిరి 92.3 శాతం, నిజామబాద్ 91 శాతం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 90.9 శాతం జగిత్యాల 90.6 శాతం చొప్పున సర్వే పూర్తి చేశారని వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలో 25,05,517 నివాసాలు సర్వే చేయల్సి వుండగా, ఇప్పటి వరకు 13,91,817 నివాసాల్లో (55.6 శాతం) సర్వే పూర్తయినట్టు తెలిపారు.

నిధుల ఖర్చు పర్యవేక్షణ ఆర్థిక శాఖదే

- ముఖ్యకార్యదర్శికి ఆ భాధ్యత : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు, నిధుల ఖర్చుపై ఇకనుంచి ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యవేక్షిస్తారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధిపై 32 శాఖలతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా కేటాయించిన నిధులు, చేసిన ఖర్చు, గతేడాది వ్యయం చేయకుండా మిగిలిపోయిన నిధులు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్‌ప్లాన్ చట్టం అమలుపై సెస్ సమర్పించిన నివేదికలు అధ్యయనం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్థిక శాఖలో రిసర్చ్ సెంటర్ ఏర్పాటుచేసి ప్రత్యేక పథకాలు రూపకల్పన చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌పై అన్ని శాఖలు 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని కోరారు. గిరిజన తండాలకు త్రీ ఫేస్ విద్యుత్ సరఫరా కావాలన్న డిమాండ్ నేపథ్యంలో అధికారులు ఆ మేరకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరో మూడు నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న క్రమంలో, వచ్చే ఏడాది అమలు చేసేందుకు అన్ని శాఖలు మంచి పథకాలను రూపొందించి నివేదిక సమర్పించాలని సూచించారు. గత ప్రభుత్వ చర్యల మూలంగా పదేండ్లపాటు అర్హులైన వారు లబ్ది పొందలేకపోయారనీ, కాంగ్రెస్ సర్కార్ హయాంలో అలాంటి వాతావరణం పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్థికశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ఎస్టీ సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, ఎస్సీ సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీధర్, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, సీడీఎమ్ఏ కమిషనర్ శ్రీదేవి, ఆర్టీసీ ఎండి సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి తొలిమెట్టు



- బీఆర్ఆర్‌జీహెచ్ఎస్ స్పోర్ట్స్ డేలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి అరుణ బహుగుణ


నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి ఆత్మవిశ్వాసమే తొలి మెట్టుగా ఉండాలని రిటైర్డ్ ఐపీఎస్ అధికారిణి అరుణ బహుగుణ అన్నారు. ముఖ్యంగా విద్యార్థినులు జీవిత లక్ష్యాలను నిర్దేశించుకొని, దానికోసం సక్రమమార్గంలో కఠోర సాధన చేయాల్సి ఉంటుందని దిశానిర్దేశం చేశారు. వారి కలలు సాకారం చేసుకోవడానికి తప్పనిసరిగా తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గనిర్దేశనం అత్యవసరమని చెప్పారు. బర్కత్‌పురాలోని తెలంగాణ యువతి మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాణి జే సరళాదేవి శిశు విహార్ మాంటిస్సోరి స్కూల్, బూర్గుల రామకృష్ణారావు బాలికోన్నత పాఠశాల (బీఆర్ఆర్‌జీహెచ్‌ఎస్) క్రీడా దినోత్సవాలు (స్పోర్ట్స్ డే), వార్షిక బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినుల్లో అంతర్లీనంగా ఉన్న ఔత్సాహిక ప్రత్యేకతలను గుర్తించి, ఆ దిశగా వారిని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. సెల్‌ఫోన్ల మాయలో పడొద్దనీ, చదివే వయసులో ఇష్టంగా కష్టపడుతూ, సవాళ్లను స్వీకరిస్తే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరడం ఏమాత్రం కష్టం కాదని పలు ఉదాహరణలు చెప్పారు. కార్యక్రమానికి తెలంగాణ యువతి మండలి జాయింట్ సెక్రటరీ, కరస్పాండెంట్ కే మంజులాదేవి అధ్యక్షత వహించారు. మండలి అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ పద్మజా మల్లిఖార్జున్, నివేదిత కుమార్, కోశాధికారి ఆనందగౌరి, బీఆర్ఆర్‌జీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు జీటీ జ్యోతి, శిశువిహార్ మాంటిస్సోరి స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు బీ శ్రీవాణి పాల్గొన్నారు. అంతకు ముందు వ్యాయామ, క్రీడా శిక్షకురాలు సంధ్య ఆధ్వర్యంలో విద్యార్థినులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అరుణ బహుగుణ గౌరవ వందనం స్వీకరించారు. పలు పోటీల్లో విజయం సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందచేశారు.

'స్థానికం'లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రయత్నం

- కులగణన తర్వాత నివేదిక : డెడికేటెడ్ కమిషన్ చైర్మెన్ బీ వెంకటేశ్వరరావు వెల్లడి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ కేటాయించేందుకు సమగ్రమైన నివేదిక ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నామని డెడికేటెడ్ కమిషన్ చైర్మెన్ బీ వెంకటేశ్వరరావు చెప్పారు. బుధవారం డెడికేటెడ్ కమిషన్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నుంచి, బీసీ సంఘాలు, బీసీ మేధావుల నుంచి వినతిపత్రాలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన డెడికేటెడ్ కమిషన్ బృందం ఇప్పటివరకు ఐదు ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి అక్కడి ప్రజలు, స్వచ్ఛంధ సంస్థలు, బీసీ కుల సంఘాలు, మేధావుల నుంచి సమాచారం తీసుకున్నామని తెలిపారు. ఈనెల 21న వరంగల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో బహిరంగ విచారణ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వారంతా తమ అభ్యర్థనలను కమిషన్‌కు అందించవచ్చన్నారు. జిల్లాల్లో ప్రజలనుంచి అనూహ్యమైన స్పందన వస్తుందనీ, త్వరలో మిగతా జిల్లాల్లో పర్యటించి వివరాలు తెలుసుకుంటామని చెప్పారు. తాము ఊహించిన దాని కన్నా ఎక్కువగా వినతిపత్రాలు వస్తున్నాయన్నారు. కుల గణన పూర్తి వివరాలు వచ్చిన తర్వాత వాటన్నింటిని పరిగణనలోకి తీసుకుని బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల కోసం ఎలాంటి న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా నివేదికను అందించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. బీజేపీ బీసీ సెల్ నాయకులు, వివిధ కుల సంఘాల నేతలు కమిషన్‌ను కలిసి వినతి పత్రాలు అందించారు. జనాభా లెక్కల ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని కోరారు. డెడికేటెడ్ కమిషన్ కార్యదర్శి బడుగు సైదులు, ఎమ్‌బీసీ చైర్మెన్ అలోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగడి సరుకుగా విద్య...!

ఫీజుల పేరిట ప్రయివేటు పాఠశాలల నిలువు దోపిడీ

- అదనపు సౌకర్యాలు అంటూ బాదుడే బాదుడు
- యూనిఫారం, పుస్తకాలు, బూట్లు కూడా అక్కడ కొనాల్సిందే
- అప్పులతో కుదేలవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు



సర్కారీ బడుల్లో కానరాని నాణ్యత

న్యూఢిల్లీ : దేశంలో నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాలు తమ చిన్నారుల విద్యాభ్యాసం కోసం తలకు మించిన అప్పులు చేయాల్సి వస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే విద్యను అంగడిలో కొనుక్కోవాల్సి వస్తోంది. ఆ కుటుంబాలు తమ బడ్జెట్‌లో పిల్లల విద్య కోసం ప్రతి ఏటా కేటాయింపులు పెంచక తప్పడం లేదు. పలు విద్యా సంస్థలు నాణ్యమైన విద్యను అందించే పేరుతో ఏటా ఫీజులు పెంచుకుంటూ పోతున్నాయి. గురుగ్రామ్‌లోని ఓ సీబీఎస్‌సీ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న కుమారుడికి తండ్రి అక్షరాలా మూడున్నర లక్షల రూపాయల ట్యూషన్ ఫీజు చెల్లించాడంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో అర్థమవుతోంది. తన కుమారుడు 12వ తరగతికి చేరుకునే నాటికి ఫీజు తొమ్మిది లక్షల రూపాయలకు చేరుతుందని ఆయన అంచనా వేశారు.

యథేచ్ఛగా దోపిడీ

ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా, కారణాలు చెప్పకుండా అనేక పాఠశాలలు వార్షిక ట్యూషన్ ఫీజును పెంచేస్తున్నాయి. అయితే ఉపాధ్యాయుల జీతాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న విధంగా ఎదుగూ బొదుగూ లేకుండా ఉంటున్నాయి. పిల్లలను మంచి విద్యావంతులను చేయాలన్న ఏకైక లక్ష్యంతో తల్లిదండ్రులు ఇతర ఖర్చులలో కోత పెట్టి మరీ పాఠశాలల జేబులు నింపుతున్నారు. ఎక్స్‌ట్రా క్లాసులు, ఆటలు, థియేటర్ వంటి పేర్లు చెబుతూ పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నాయి. గత దశాబ్ద కాలంలో నగరాలు, చిన్న చిన్న పట్టణాలలో ప్రాథమిక పాఠశాలల ఫీజులు గణనీయంగా పెరిగాయి.

అసలే చాలీచాలని జీతాలతో బతుకు బండిని నెట్టుకొస్తున్న బడుగు జీవులు పాఠశాలల ధనదాహానికి బలవక తప్పడం లేదు. అధిక వడ్డీలకు అప్పులు చేసి మరీ పిల్లలను చదివించాల్సి వస్తోంది. 'మూడో తరగతి చదువుతున్న నా కుమార్తె స్కూలు ఫీజు కోసం ఇప్పటికే లక్షన్నర రూపాయలు చెల్లిస్తున్నాను. ఈ ఖర్చు రాబోయే మూడు సంవత్సరాలలో రెట్టింపు అవుతుంది. అప్పుడు నా రెండో సంతానం పాఠశాలకు రెడీ అవుతుంది. ఇద్దరికీ ఫీజులు కట్టడం తలకు మించిన భారమే. కారు కొనాలని అనుకున్నాం. ఇప్పుడు బైక్‌తోనే కాలక్షేపం చేస్తున్నాం' అని పానిపట్‌కు చెందిన అజూనా కర్వాల్ నిట్టూర్పు విడిచారు.

ప్రైవేటు యాజమాన్యాలు ఏమంటున్నాయి?

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల వాదన మరోలా ఉంది. ఖర్చులు పెరిగిపోతుంటే ఏటా ట్యూషన్ ఫీజును 10 శాతం మేర పెంచుకోవడాన్ని అవి సమర్థించుకుంటున్నాయి. ఆధునిక సౌకర్యాల కల్పన కోసం నిరంతరం పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని, ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయాలని, సీసీటీవీ కెమేరాలను అమర్చాలని, ఈత కొలనులు, క్రీడా మైదానాలు, వివిధ క్లబ్బులు....ఇలా వీటన్నింటి ఏర్పాటుకు ఖర్చు తప్పదని అవి అంటున్నాయి. అదీకాక అధ్యాపకులకు ఏటా ఇంక్రిమెంట్ ఇవ్వాలని, డీఏ పెంచాలని, శాశ్వత సిబ్బందిని నియమించుకోవాలని కూడా చెబుతున్నాయి. ఫీజును కనీసం 10 శాతమైనా పెంచకుండా అర్హత కలిగిన శాశ్వత ఉపాధ్యాయులను ఎలా నియమించుకోగలమని ప్రశ్నించాయి.

పారదర్శకత ఎక్కడ?

పాఠశాలల ఫీజుల్లో పారదర్శకత లోపిస్తోందని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల మధ్యే కాదు...రాష్ట్రాల మధ్య కూడా ఫీజుల్లో భారీ వ్యత్యాసాలు కన్పిస్తున్నాయని వారు తెలిపారు. కేంబ్రిడ్జ్ వంటి అంతర్జాతీయ పాఠ్యాంశాలను బోధించే పాఠశాలల్లో ఈ వ్యత్యాసాలు మరింత అధికంగా ఉంటున్నాయి. హైదరాబాదులో పదో తరగతి విద్యకు అయ్యే ఖర్చు రూ.20,000 నుండి రూ.12 లక్షల వరకూ ఉంటోందని హైదరాబాద్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి వెంకట్ సాయినాథ్ చెప్పారు. సౌకర్యాలు కల్పించకుండానే అనేక పాఠశాలలు పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని పలువురి ఆరోపణ. ఫీజుల పెంపుదలకు ప్రభుత్వాలు అనుమతి ఇవ్వకపోయినా ప్రైవేటు సంస్థలు ఇష్టానుసారం వాటిని పెంచేస్తున్నాయి. ఫీజులు ఎందుకు పెంచుతున్నారని ప్రశ్నిస్తే యాజమాన్యాల నుండి సమాధానమే ఉండదు.

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య లభించకే...

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడంతో తల్లిదండ్రులు విధిలేని పరిస్థితులలో తమ పిల్లలను ప్రైవేటు ఇంగ్లీషు మీడియం స్కూళ్లలో చేర్చాల్సి వస్తోంది. పిల్లలకు భవిష్యత్తులో మంచి అవకాశాలు లభించాలంటే ఇంగ్లీషు మీడియం ప్రైవేటు పాఠశాలలే శరణ్యమని వారు గట్టిగా విశ్వసిస్తున్నారు. పాఠశాలలు డిమాండ్ చేసినంత సొమ్మును కిమ్మనకుండా చెల్లించి తమ పిల్లలను వాటిలో చేరుస్తున్నారని, సాదాసీదా పాఠశాలలను వారు అసలే ఇష్టపడడం లేదని ఎన్సీఈఆర్టీ మాజీ డైరెక్టర్ కృష్ణకుమార్ చెప్పారు. ప్రైవేటు పాఠశాలల మార్కెట్ పెరిగిపోవడంతో ప్రభుత్వ విద్యా వ్యవస్థ కూనారిల్లిపోతోందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ సమాచారం ప్రకారం 2019-20లో ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య 6.5 శాతం పెరిగింది. అదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 1.3 శాతం పడిపోయింది. ప్రస్తుతం మంచి పాఠశాలలో విద్యాభ్యాసం చేయాలంటే సంవత్సరానికి రూ.20-25 లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఇది అలవికాని పనే. అయినప్పటికీ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం వారు తల తాకట్టు పెట్టి ప్రైవేటు చదువులు చదివిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు అన్ ఎయిడెడ్ సంస్థల మధ్య విద్యా సంబంధమైన ఖర్చులలో అసమానతలు అధికంగా ఉన్నాయని 2019లో విడుదలైన 75వ రౌండ్ జాతీయ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్) తెలిపింది. విద్యార్థి పై తరగతికి వెళుతుంటే ఈ వ్యత్యాసం మరింత పెరిగిపోతోంది.

ఆదాయంలో 20-30 శాతం విద్యకే

పేరున్న పాఠశాలల్లో కిండర్‌గార్టన్, నర్సరీ తరగతుల ఫీజే లక్షల్లో ఉంటోంది. తరగతి పెరుగుతుంటే దానితో పాటు ఫీజూ పెరిగిపోతోంది. దేశ రాజధానిలోని పాఠశాలల్లో ఫీజుల పెంపుదలపై కొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'దేశంలో విద్యపై పెడుతున్న ఖర్చు ఏటా పెరుగుతూనే ఉంది. ఈ పెరుగుదల కుటుంబాలపై ఒత్తిడి కలిగిస్తోంది. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది' అని ఎడ్యుకేషన్ ఫిన్‌టెక్ సంస్థ ప్రొపెల్డ్ సహ వ్యవస్థాపకుడు బిభు ప్రసాద్ తెలిపారు. తల్లిదండ్రులు తమ వార్షిక కుటుంబ ఆదాయంలో 20 నుండి 30 శాతం వరకూ విద్యపై ఖర్చు చేస్తున్నారని ఎడ్‌టెక్ కంపెనీ స్కూల్‌నెట్ ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో తేలిందని ఆయన చెప్పారు. ట్యూషన్ ఫీజుతో పాటు పాఠ్య పుస్తకాలు, రవాణా, పరీక్ష ఫీజులు, ఇతర ఖర్చులు కలిపి తడిసి మోపెడవుతున్నాయని అన్నారు.

అదనపు ఫీజుల మోత

ఫీజుల మోత ఇలా ఉంటే అదనపు ఖర్చులు సరేసరి. ట్యూషన్ ఫీజులు, వార్షిక ఫీజులు, డెవలప్‌మెంట్ ఛార్జీలు, రవాణా ఛార్జీలు...ఇలా ఏదో ఒక పద్దు కింద డబ్బు గుంజుతున్నారు. యూనిఫారం, పుస్తకాలు, బ్యాగులను కూడా పాఠశాలలే విక్రయిస్తున్నాయి. మార్కెట్‌లో కంటే పాఠశాలలో వీటి ఖరీదు అధికంగా ఉంటోంది. ప్రతి సంవత్సరం కొత్త యూనిఫారం కొనుగోలు చేయాల్సిందే. చివరికి బూట్లను కూడా పాఠశాలే విక్రయిస్తుంది. ఇది ఓ రకమైన దోపిడీయేనని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. బెంగళూరులోని ఓ పాఠశాల జూనియర్ కిండర్‌గార్టన్ విద్యార్థి నుండి పేరెంట్ ఓరియంటేషన్ పేరిట రూ.8,400 వసూలు చేసింది. దీనిపై పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ఢిల్లీలోని ఓ పాఠశాల డిజిటల్ యాక్సెస్ కార్డు పేరుతో ప్రతి సంవత్సరం అదనపు ఛార్జీలు వసూలు చేస్తోంది. మార్కెట్‌లో ఐదు వందల రూపాయలకు దొరికే ఈ కార్డును పాఠశాలలో రూ.1,500కు అంటకడుతున్నారు. పాఠ్యేతర కార్యకలాపాల పేరుతో అదనపు ఫీజులు వడ్డిస్తున్నారు.

కఠిన నిబంధనలు అవసరం

నాణ్యమైన విద్య పొందాలంటే ఖర్చు పెరిగిపోతున్న దృష్ట్యా ఇటీవలి సంవత్సరాలలో కొన్ని వ్యాపార సంస్థలు తల్లిదండ్రులకు రుణాలు అందజేస్తున్నాయి. నెలవారీ వాయిదాలు (ఈఎంఐలు) చెల్లించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. కొన్ని ఫిన్‌టెక్ కంపెనీలు పాఠశాలలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకొని రుణాలు ఇస్తున్నాయి. ఏదేమైనా పాఠశాలల ఫీజులను నియంత్రించేందుకు ప్రభుత్వాలు నిబంధనలు రూపొందించాలని పేరెంట్స్ అసోసియేషన్లు డిమాండ్ చేస్తున్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే కొన్ని చట్టాలు ఉన్నప్పటికీ అవి సరిగా అమలుకు నోచుకోవడం లేదు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్
- ముగిసిన సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా మహాసభ



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

పాలకుల ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని, పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు భాస్కర్ అన్నారు. సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్ల జిల్లా మహాసభ బుధవారం ముగిసింది. పట్టణంలోని షాదిఖానాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఎన్నో హామీలను ఇచ్చి గద్దెనెక్కిందని, పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాజకీయ స్వార్థం కోసం కష్టజీవుల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్ బాబు, జిల్లా కార్యదర్శి మూశం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, ఏగమంటి ఎల్లారెడ్డి, గన్నెరపు నరసయ్య, జవ్వాజి విమల, మల్లారపు అరుణ్ కుమార్, ఎర్రవెల్లి నాగరాజు, సూరం పద్మ, అశోక్ మల్లారపు ప్రశాంత్, గురజాల శ్రీధర్, శ్రీరామ్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

24న ఖమ్మంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- ముఖ్య వక్తలుగా ప్రొఫెసర్ నాగేశ్వర్, వి.కృష్ణయ్య
- దేశ ప్రయోజనాల కోసమే పూర్వ విద్యార్థుల వేదిక
- విలేకరుల సమావేశంలో కన్వీనర్లు వి. శ్రీనివాసరావు, ఎం.సుబ్బారావు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో ఈ నెల 24వ తేదీన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్టు కార్యక్రమ కన్వీనర్ వెల్లంపల్లి శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక కన్వీనర్ ఎం.సుబ్బారావు తెలిపారు. ఈ సమ్మేళనానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులు వెయ్యి నుంచి 1500 మంది వరకు హాజరుకానున్నట్టు చెప్పారు. దీనికి ముఖ్య వక్తలుగా ప్రొఫెసర్ కె.నాగేశ్వర్, ఎస్ఎఫ్ఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణయ్య, జేఎన్‌యూ మాజీ అధ్యక్షులు ఐసీ ఘోష్ హాజరవుతారని తెలిపారు. బుధవారం ఖమ్మంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు, సుబ్బారావు మాట్లాడారు. భవిష్యత్తులోనూ దేశ ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. నాటి ఉద్యమ స్ఫూర్తిని మననం చేసుకుంటూ.. సమాజ, దేశ ప్రయోజనాల కోసం నేడు ఏమి చేయగలమనే దిశగా సాగే ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులకు ఈ సమ్మేళనం కో-కన్వీనర్ రాజేశ్వరరావు పిలుపునిచ్చారు.

బాధిత రైతులకు అండగా నిలుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గిరిజన తండాలకు నాయకులు వెళ్లకుండా ముళ్ల కంచెలు వేసి, పోలీసు బందోబస్తు పెట్టి ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు హానికరమని చెప్పారు. ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేయటం కరెక్ట్ కాదని, ప్రభుత్వ విధానాలనే అధికారులు అమలు చేస్తారని, వారిపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. గతంలో ఫార్మాసిటీని వ్యతిరేకించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు లగచర్లలో భూ సేకరణ జరపడం ఏమిటని ప్రశ్నించారు.గతంలో రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ కోసం 15 వేల ఎకరాలు సేకరించారని గుర్తు చేశారు.

దాన్ని రద్దు చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. లగచర్లలో ఫోర్త్‌సిటీ పేరుతో రైతుల నుంచి భూములను బలవంతంగా తీసుకోవడం తగదని చెప్పారు. విదేశీ కంపెనీల ద్వారా ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తామని చెప్పడం అంటే విదేశీ కంపెనీలకు భూములు అప్పగించడమేనని అన్నారు. ఫార్మా కంపెనీ ఏర్పాటుకు తమ భూములను తీసుకుంటే జీవనోపాధి కోల్పోతామన్న ఆవేదనతో ఉన్న రైతులను నిర్బంధాలతో గ్రామాన్ని జైలుగా మార్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నిర్బంధాలు విధించిన వాళ్లు రాజకీయంగా ఏమయ్యారో గుర్తు పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు.

విష పదార్థాలను మూసీలో కలపొద్దు

ఫార్మా కంపెనీల నుంచి వచ్చే విషపదార్థాలు మూసీ నదిలో కలుస్తున్నాయని, ఆ వ్యర్థాలు మూసీలో కలవకుండా చర్యలు చేపట్టాలని తమ్మినేని డిమాండ్ చేశారు.

హైడ్రా, మూసీ ప్రక్షాళన, దామగుండం రాడార్ స్టేషన్ ఏర్పాటు, గ్రూప్-1 వివాదం, ఫార్మాసిటీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపక్షాల అభిప్రాయాలను తీసుకోవడం లేదని విమర్శించారు.

కేసీఆర్ అహంకార పూరిత, ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఓటేశారని, కాబట్టి కాంగ్రెస్ పార్టీ విధానాలు ప్రజాస్వామ్యబద్ధంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజయోత్సవాలకు సిద్ధపడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ అనుసరించిన అహంకార విధానాన్నే రేవంత్ రెడ్డి అనుసరిస్తున్నారని, ఇలాగే ఉంటే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. లౌకిక వాదాన్ని బలోపేతం చేయడానికి, బీజేపీ మతోన్మాద విధానాలపై తమ పార్టీ నిరంతరం పోరాటం చేస్తోందని చెప్పారు.

ఈ సమావేశంలో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, మట్టిపల్లి సైదులు, నాగారపు పాండు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి ఉన్నారు.

ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

ప్రజాసమస్యలపై నుంచి ప్రజల దృష్టి మళ్లించే విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ ప్రవర్తిస్తున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. తెలంగాణకు నిధులు రాబట్టడంలో ముఖ్యమంత్రితో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కూడా విఫలమయ్యారన్నారు. రాష్ట్రానికి మణిహారంగా ఉన్న సింగరేణి బొగ్గు గనుల వేలంపాటలకు కేంద్రం సిద్ధపడుతోందని, దాన్ని అడ్డుకోవాల్సిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. లౌకిక పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాన్ని ఎందుకు ఎండగట్టలేక పోతుందని ప్రశ్నించారు. ప్రస్తుతం మూడు, నాలుగు జిల్లాల్లో ఏర్పడిన ఇతర సమస్యలను హిందూ, ముస్లింల మధ్య జరిగిన సంఘటనలుగా చిత్రీకరిస్తూ బీజేపీ నేతలు మత విద్వేషాలకు ఉసిగొల్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.



మహారాష్ట్ర, జార్ఖండ్‌ల్లో మళ్ళీ ఎన్‌డీఏకే పగ్గాలు

- యూపీ ఉప ఎన్నికల్లోనూ బీజేపీకే మొగ్గు
- పలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు

న్యూఢిల్లీ : మహారాష్ట్ర, జార్ఖండ్‌ల్లో పోలింగ్ ముగియడంతో వెంటనే ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడ్డాయి. రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ నేతృత్వంలోని కూటములే అధికార పగ్గాలు చేపట్టే అవకాశం వుందని పలు ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి విజయం సాధిస్తుందని అంచనా వేయగా, జార్ఖండ్‌లో ఎన్‌డీఏకే తిరిగి అధికారమని ఈ సర్వేలు వెల్లడించాయి. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమిదే మహారాష్ట్రలో అధికారమని మరికొన్ని పోల్స్ పేర్కొన్నాయి. మహాయుతి కూటమికి పీపుల్స్ పల్స్, చాణక్య, మ్యాట్రిజ్ సర్వేలు స్పష్టమైన మెజారిటీని కట్టబెట్టాయి. అదే సమయంలో లోక్‌సాహి మరాఠీ, దైనిక్ భాస్కర్ సంస్థలు మాత్రం ప్రతిపక్ష ఎంవీఏ కూటమికే మొగ్గు చూపాయి.

288సీట్లు గల మహారాష్ట్రలో మెజారిటీ రావాలంటే 145సీట్లు రావాలి. 81 సీట్లు గల జార్ఖండ్‌లో మెజారిటీకి 41సీట్లు అవసరం. 23న ఓట్ల లెక్కింపు జరగనుంది. జార్ఖండ్‌లో 81 సీట్లకు గానూ కాంగ్రెస్-జెఎంఎం కూటమికి 53సీట్లు వస్తాయని ఆక్సిస్ మై ఇండియా అంచనా వేసింది. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏకు కేవలం 25సీట్లే వస్తాయని ఇతరులకు మూడు సీట్లు వస్తాయని పేర్కొంది. పలు వార్తా సంస్థలతో కలిసి మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్స్ నిర్వహించింది. మహారాష్ట్రలో బీజేపీకి 150 నుంచి 170 సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. 48శాతం ఓట్లు లభిస్తాయని పేర్కొంది. కాంగ్రెస్, ఇతర మిత్రపక్షాలకు కేవలం 110 నుంచి 130 సీట్లు వస్తాయని పేర్కొంది. ఈ కూటమికి 42శాతమే ఓట్లు లభిస్తాయని తెలిపింది. పది శాతం ఓట్లతో ఇతరలకు 8 నుండి 10సీట్లు ఇచ్చింది.

ఇక జార్ఖండ్‌లో ఎన్‌డీఏకు 42 నుంచి 47సీట్లు వస్తాయని మ్యాట్రిజ్ ఎగ్జిట్ పోల్స్ పేర్కొన్నాయి. ఇండియా బ్లాక్‌కు కేవలం 25 నుంచి 30 సీట్లు మాత్రమే వస్తాయని పేర్కొంది. మహాయుతికి 175 నుంచి 195సీట్లు వస్తాయని పీపుల్స్ పల్స్ సర్వే అంచనా వేసింది. ఎంవీఏకు కేవలం 85 నుండి 112 సీట్లు వస్తాయని, ఇతరులకు 7-12 సీట్లు వస్తాయని చెప్పింది. జార్ఖండ్‌లో ఎన్‌డీఏకు 44-53 సీట్లు, ఇండియా బ్లాక్‌కు 25-37సీట్లు, ఇతరులకు 5-9సీట్లు వస్తాయని అంచనా వేసింది.

ఇండియా బ్లాక్‌కు 45శాతం ఓటు వాటా రాగా, ఎన్‌డీఏకు 37శాతం ఓటు వాటా లభిస్తుందని ఆక్సిస్ మై ఇండియా జోస్యం చెప్పింది.

పి-ఎంఎఆర్‌క్యు అనే మరో సంస్థ మహారాష్ట్రలో ఎన్‌డీఏకు 137-157సీట్లు వస్తాయని అంచనా వేసింది. అదే సమయంలో ఇండియా బ్లాక్‌కు చెందిన ఎంవిఎకు 126-146సీట్లు, ఇతరులకు 2-8సీట్లు వస్తాయని అంచనా వేసింది.

ఎలక్టోరల్ ఎడ్జ్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్ ఎంవీఏకు 150 స్థానాలు కట్టబెట్టింది. మహాయుతికి 121 సీట్లు, ఇతరులకు 20సీట్లు వస్తాయని పేర్కొంది.

పోల్ డైరీ అంచనాల ప్రకారం మహారాష్ట్రలో ఎన్‌డీఏకు 122-186, ఎంవిఎకు 69-121, ఇతరులకు 12-29 సీట్లు వస్తాయి.

చాణక్య స్ట్రాటజీస్ సర్వే ప్రకారం, మహాయుతికి 152-160, ఎంవీఏకు 130-138, ఇతరులకు 6-8 సీట్లు వస్తాయి.

మహారాష్ట్రలో మహాయుతి, ఎంవిఎ మధ్య హోరాహోరీ పోరు వుంటుందని లోక్‌షాహి రుద్ర సర్వే పేర్కొంది. వరుసగా 128-142సీట్లు, 125-140 సీట్లు లభిస్తాయని పేర్కొంది. ఇతరులకు 18నుండి 23వరకు సీట్లు రావచ్చని అంచనా వేసింది.

లోక్‌పోల్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్ ప్రకారం 37-40శాతం ఓట్ల వాటాతో మహాయుతి 115-128 స్థానాలు గెలుస్తుందని అంచనా వేసింది.

43 నుండి 46శాతం ఓట్ల వాటాతో 151 నుండి 162 మధ్య సీట్లు గెలిచి ఎంవిఎ విజయం సాధిస్తుందని పేర్కొంది. 16 నుంచి 19శాతం ఓట్ల వాటాతో ఇతరులు ఐదు నుంచి 14సీట్లు గెలుపొందుతారని అంచనా వేసింది.

ఉత్తరప్రదేశ్‌లోని 9 అసెంబ్లీ స్థానాలకు నిర్వహించిన ఉప ఎన్నికల్లో బీజేపీ ఐదు నుంచి ఏడు స్థానాలు గెలుచుకుంటుందని కొన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ గ్లోబల్ స్టడీస్ (సీజీఎస్) నిర్వహించిన సర్వే మహారాష్ట్రలో మహాయుతి అలయన్స్‌కు, జార్ఖండ్‌లో ఎన్‌డీఏకు విజయం కట్టబెట్టింది.

బస్వాపురం రిజర్వాయర్‌కు రూ. 500 కోట్లు కేటాయించాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

భువనగిరిలో సామూహిక నిరసన దీక్ష



నవతెలంగాణ-భువనగిరి

బస్వాపురం రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని, నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో రైతుబజార్ దగ్గర బుధవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సామూహిక నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం ప్రారంభించి 15 ఏండ్లవుతున్నా పూర్తి కాలేదన్నారు. రిజర్వాయర్ పూర్తయితే జిల్లాకు సాగునీరు, తాగు నీరు అందుతుందన్నారు.రిజర్వాయర్ పూర్తి నిర్మాణం కోసం రూ.500 కోట్లు అవసరం ఉంటే రూ.50 కోట్లు ప్రకటించి ఆర్భాటాలు చేస్తున్నారని విమర్శించారు. వాటితో రిజర్వాయర్ ఎలా పూర్తవుతుందని ప్రశ్నించారు. రిజర్వాయర్ పరిధిలో ఇండ్లు, భూములు కోల్పోయిన ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, నష్టపరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.బాధితులకు వెంటనే పూర్తిస్థాయిలో నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్‌ను పూర్తి చేయడంతో గోదావరి జలాలను అందించొచ్చన్నారు.ఈ సామూహిక నిరసన దీక్షకు బీఎస్పీ రాష్ట్ర నాయకులు బట్టు రామచంద్రయ్య సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నర్సింహులు, మాటూరి బాలరాజు,కల్లూరి మల్లేశం, దాసరి పాండు, నాయకులు మాయకృష్ణ, దయ్యాల నర్సింహ, సిరిపంగి స్వామి, బబ్బూరి పోశెట్టి, పల్లెర్ల అంజయ్య, గాడి శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు పాల్గొన్నారు.

సంపాదకీయం

శత్రువుకి అవకాశమిస్తే ఎలా..?



'ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజలే ఎన్నుకునే ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య ప్రభుత్వమంటారు...' అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ చెప్పిన మాటలివి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటివరకు ఎన్ని సవాళ్లెదురైనా ప్రతి సందర్భంలోనూ ప్రజాస్వామ్యం తనేంటో చూపుతూ వస్తోంది. మన రాష్ట్రంలోనూ అదే పునరావృతమైంది. సంక్షేమం, అభివృద్ధి ఫలాల మాట అటుంచితే, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తే సహించబోం, నియంతృత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమనే బలమైన సంకేతాలను ఇచ్చింది ఇక్కడి ప్రజానీకం.

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్బంధం, నిరంకుశత్వం అడుగడుగునా రాజ్యమేలాయి. ప్రశ్నించే గొంతుకలకు వేదికైన హైదరాబాద్ ధర్నాచౌక్‌ను ఎత్తేయజూసింది నాటి కేసీఆర్ ప్రభుత్వం. హక్కుల కోసం నినదించిన కారణంగా ఖమ్మంలో అన్నదాతలను ఆనాడు బేడీలేసి మరీ జైలుకు పంపింది. ఇసుక దందాను అడ్డుకున్నందుకు నేరేళ్ల జనాన్ని ఇసుక మాఫియా చావగొట్టింది. అక్కడి బాధితులు నేటికీ మనుషులు కాలేకపోతున్నారు. ఇక కార్మికుల గోస సరేసరి. ఆర్టీసీ కార్మికుల సమ్మెను నిర్దాక్షిణ్యంగా అణచివేసింది. పంచాయతీ కార్మికులు, మున్సిపల్ వర్కర్లు, అంగన్‌వాడీలు, ఆశాలు... ఇలా ఒకటేమిటి, అనేక యూనియన్లు, సంఘాల ఆందోళనలను అణగదొక్కింది 'కారు..సారు' సర్కారు.

ఈ క్రమంలో పదేండ్ల తర్వాత తెలంగాణ ప్రజానీకం...ఈ నియంత పోకడలను భరించ లేమంటూ నిక్కచ్చిగా తేల్చిచెప్పింది. ఫలితంగా గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో కారు ఫల్టీల మీద ఫల్టీలు కొట్టిన వైనం మనకెరుకే. ఆ తర్వాత రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రజా పాలన'ను అందిస్తామంటూ అధికారాన్ని చేపట్టింది. ఈ క్రమంలో పదకొండు నెలలు గడిచాయి. గత 'గులాబీ' జమానాతో పోలిస్తే కొన్ని అంశాల్లో మౌలికమైన మార్పులొచ్చాయనే విషయాన్ని కాదనలేం. ముఖ్యంగా ప్రజా ప్రతినిధులు, ప్రజల్ని నేరుగా కలవటం, సమస్యలపై జనం ఇచ్చే వినతిపత్రాలను స్వీకరించటం, సామాన్యుడు సైతం సచివాలయంలోకి అడుగు పెట్టేందుకు అవకాశమివ్వటం, రైతు, బీసీ కమిషన్లు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం తదితరాంశాలు మెచ్చుకోదగ్గవే.

ఇదే సమయంలో కొన్ని అవగాహనా రాహిత్యపు ఆలోచనలు, తొందరపాటు నిర్ణయాలు తనకు చిక్కులు తెచ్చిపెడుతున్నాయనే విషయాన్ని కాంగ్రెస్ సర్కారు గుర్తెరగాలి. ఇటీవల కొడంగల్‌లో కొనసాగిన ఫార్మా రగడ ఆ కోవలోనిదే. ఆ సంఘటన వెనకున్న 'కోణాల' నిగ్గు తేల్చాల్సిందే. అయితే రైతుల పక్షాన పోరాడుతున్న వామపక్షాలు, ప్రజాస్వామికవాదులను అడ్డుకోవటం ఆక్షేపణీయం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం...తమ హక్కులు అడిగిన నేరానికి ఆర్టీసీలోని కార్మిక సంఘాలపై ఆంక్షలు విధించింది, అంతేకాదు గుర్తింపు సంఘం ఎన్నికలను సైతం రద్దుచేసి, తన అహంభావాన్ని చాటుకుంది. ఇప్పుడు అవే కార్మిక సంఘాలు... తమపై ఆంక్షలను ఎత్తేయాలంటూ రేవంత్ సర్కారును అడుగుతున్నాయి. వీటితోపాటు పరీక్షలు వాయిదా వేయాలంటూ గ్రూప్-1 అభ్యర్థులు, బిల్లులు చెల్లించాలంటూ సర్పంచులు, ఊపిరి సలపని డ్యూటీలతో సతమత మవుతున్నామంటూ తెలంగాణ స్పెషల్ పోలీసులు తమ నిరసనలను వ్యక్తం చేశారు. ఇవన్నీ కొన్ని రాజకీయ ప్రేరేపిత శక్తుల వల్ల జరిగాయన్నది ప్రభుత్వ ఆరోపణ. ఆ నిజానిజాలన్నీ మున్ముందు తేలతాయి. ఈ సమస్యల పట్ల ప్రధాన ప్రతిపక్షానికి చిత్తశుద్ధి ఎంతుందన్న సంగతి పక్కన పెడితే... అది అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించుకుని, తన ఉనికిని చాటుకునేందుకు తాపత్రయపడుతోంది. అందుకు సామాజిక మాధ్యమాలను వేదికగా వాడుకుంటోంది.

ఆ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌పైనా, ఆయన మంత్రివర్గ సహచరుల పైనా బీఆర్ఎస్ అగ్రనేతల నుంచి చోటామోటా నాయకుల దాకా అవాకులు చెవాకులు పేలుతున్నారు. ప్రతిగా సీఎం, అయన క్యాబినెట్ సహచరులు ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. ఇలా ఈ రెండుపక్షాలు ఒకరిపై మరొకరు కత్తులు దూసుకుంటుంటే... 'మూడోవాడు' తనపని తాను కానిచ్చేస్తున్నాడు. గ్రూప్-1 అభ్యర్థులు, హైడ్రా, మూసీ బాధితుల ఆందోళనలను ఇప్పటికే తనకు అనుకూలంగా మార్చుకున్న ఆ మూడోవాడే బీజేపీ. ఇప్పుడు అధికారపక్షం బాధ్యతరాహిత్యం, ప్రతిపక్షం సంకుచితత్వం... వెరసి కమలం పార్టీ ఎదుగుదలకు దోహదపడతాయేమోన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. గోతికాడ నక్కలా కాసుక్కూర్చున్న దానికి అలాంటి అవకాశాన్ని, ఆయుధాన్ని స్వయంగా కాంగ్రెస్సే ఇస్తే ఎలా? అందుకే ఆ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇప్పటికైనా తన నిష్క్రియాపరత్వాన్ని వీడి, బాధ్యతను గుర్తెరగాలి. గత బీఆర్ఎస్ నిర్బంధాలు, నియంతృత్వాన్ని భరించలేని ప్రజలు, దాన్ని ఇంటికి సాగ నంపారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కార్ కూడా అదే పోకడలు పోతే... మున్ముందు ప్రజల కోపానికి గురికాక తప్పదనే విషయాన్ని గుర్తించాలి.

> **ఇలా ఈ రెండుపక్షాలు ఒకరిపై మరొకరు కత్తులు దూసుకుంటుంటే... 'మూడోవాడు' తన పని తాను కానిచ్చేస్తున్నాడు. గ్రూప్-1 అభ్యర్థులు, హైడ్రా, మూసీ బాధితుల ఆందోళనలను ఇప్పటికే తనకు అనుకూలంగా మార్చుకున్న ఆ మూడోవాడే బీజేపీ. ఇప్పుడు అధికారపక్షం బాధ్యతరాహిత్యం, ప్రతిపక్షం సంకు చితత్వం... వెరసి కమలం పార్టీ ఎదుగుదలకు దోహదపడతాయేమోన్న ఆందోళన సర్వత్రా నెలకొంది. గోతికాడ నక్కలా కాసుక్కూర్చున్న దానికి అలాంటి అవకాశాన్ని, ఆయుధాన్ని స్వయంగా కాంగ్రెస్సే ఇస్తే ఎలా?**

ప్రాణాంతక సమస్యగా ఆంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్

అతి ప్రధానమైన పది ప్రజారోగ్య సమస్యల్లో "ఆంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఏఎంఆర్)" లేదా "ఆంటీ-మైక్రోబియల్ నిరోధకత"ను ఒకటిగా గుర్తించడంతో 2005 నుంచి ఐరాస ప్రతియేటా 18-24 నవంబర్ రోజుల్లో "వరల్డ్ ఆంటీ-మైక్రోబియల్ అవేర్‌నెస్ వీక్ లేదా "ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ అవగాహన వారం" పాటిం చుట ఆనవాయితీగా మారింది. బాక్టీరియా, వైరస్, ఫంగీ, పరాన్నజీవులు లాంటి సూక్ష్మజీవులు కలిగించే సాంక్రమిక వ్యాధులను త్వరగా, సమర్థవంతంగా నయం చేయడానికి ఆంటీ-మైక్రోబియల్ ఔషధాలను వాడుట అలవాటైంది. కాలానుగుణంగా సూక్ష్మజీవుల్లో వస్తున్న మార్పులతో ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ పట్ల సూక్ష్మజీవులు నిరోధకతను పెంచుకొని, ఆ ఔషధాలకు రోగ కారక సూక్ష్మజీవులు లొంగకుండా మొండికేయడంతో అంటువ్యాధుల చికిత్సలకు అవాంతరాలు ఏర్పడి ప్రాణాంతక స్థితులకు చేరడంతో పాటు మరో "నిశ్శబ్ద విపత్తు" ఏర్పడుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదకర విపత్తు వల్ల ఏడాదికి 70 లక్షల మంది ప్రాణాలు కోల్పోవడం, ఈ సంఖ్య 2050 వరకు పది మిలియన్లకు చేరవచ్చని హెచ్చరిస్తున్నారు. ప్రపంచ



ఏఎంఆర్ సమస్య ఆసియా, ఆఫ్రికా దేశాల్లోనే 90 శాతం వరకు విస్తరించిందని నిర్ధారణ అవుతున్నది. ఏఎంఆర్ పెరగడానికి ప్రధాన కారణాలుగా విచక్షణా రహితంగా అధిక మోతాదులో ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ వాడడం, సురక్షిత నీటి కొరత, పారిశుద్ధ్యం సమస్యలు, వ్యక్తిగత పరిశుభ్రత లాంటి అవలక్షణాలతో మానవాళే కాకుండా జంతువులు, వ్యవసాయ పంటలు ప్రమాదంలో పడుతున్నాయి. 2000-15 మధ్య కాలంలో ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ వాడకం 65 శాతం వరకు పెరగ్గా, 2030 నాటికి 200 శాతం పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. అలాగే 2017-30 మధ్య జంతు చికిత్సలకు వాడే ఆంటీబయోటిక్స్ 12 శాతం పెరగవచ్చనే వార్తలు కూడా వింటున్నాం.

2024 థీమ్

ప్రపంచ ఆంటీ-మైక్రోబియల్ అవగాహన వారం-2024 థీమ్‌గా "ఎడ్యుకేట్, అడ్వకేట్, ఆక్ట్ నౌ" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నారు. ఏఎంఆర్ పట్ల అవగాహన కల్పించడానికి పౌరసమాజం, ప్రభుత్వ యంత్రాంగం, వెటర్నరీ విభాగం, రైతులు, ఫార్మసిస్టులు, విద్యావేత్తలు, యువజన సంఘాలు, సీనియర్ సిటిజెన్స్, వ్యవసాయ శాఖల సమన్వయంతో కృషి చేయాల్సి ఉంది. కరోనా విపత్తు సమయంలో అధిక శాతం రోగులకు ఆంటీబయాటిక్ ఔషధాలను విచక్షణా రహితంగా, అధిక మోతాదులో వాడడంతో నేడు దాని దుష్ప్రభావాలు నేడు తీవ్రరూపం దాల్చడం, తీవ్ర అనారోగ్యాలు కలగడంతో పాటు ప్రాణాలు సహితం పోవడం చూస్తున్నాం. గత ఎనిమిది దశాబ్దాలుగా ఆంటీ-మైక్రోబియల్ ఔషధాలను విరివిగా వాడి రోగాలను నయం చేసే ప్రయత్నాలు చేయడంతో ఆ డ్రగ్స్ పట్ల నిరోధకత పెరిగి వాటి ప్రభావం పూర్తిగా తగ్గడం గమనిస్తున్నాం. ఏఎంఆర్ ఫలితంగా సూక్ష్మజీవుల కారణ సాంక్రమిక వ్యాధులకు చికిత్స కష్టమవుతున్నది.

ఏఎంఆర్ కట్టడి మార్గాలు


రానున్న రోజుల్లో ఆంటీ-బాక్టీరియల్, ఆంటీబయాటిక్, ఆంటీవైరల్, ఆంటీఫంగల్, ఆంటీపారాసైటిక్స్ లాంటి ఔషధాలు పని చేయకపోవడంతో, వ్యాధుల కట్టడి వైద్యులకు కష్టం కావడంతో మరో ప్రమాదకర సంక్షోభానికి లేదా విపత్తుకు తలుపులు తెరుచుకుంటున్నాయి. ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ పనిచేయని యెడల రోగులు/జంతువులు/పంటలు కూడా ప్రభావితం కావడం, పలు సంబంధిత సమస్యలకు దారి తీస్తున్నాయి. వైద్యుల సలహాలు తీసుకోకుండా ఆంటీ-మైక్రోబియల్ డ్రగ్స్ వాడరాదు. ఆంటీ-మైక్రోబియల్ రెసిస్టెన్స్‌ను అదుపు చేయడానికి చేతులు శుభ్రంగా కడుక్కోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించడం, సురక్షిత నీరు తాగడం, మంచి ఆహారం, టీకాలు తీసుకోవడం, పరిసరాల పరిశుభ్రత, వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండడం, సురక్షిత లైంగిక సంబంధాలు కలిగి ఉండడం లాంటి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

ఏఎంఆర్ ప్రతికూల ప్రభావంతో ప్రజలు, పశుసంపద, మత్స్యసంపద, పాడి పరిశ్రమ, ఆక్వాకల్చర్, హార్టికల్చర్, పండ్ల తోటలు, పర్యావరణ వ్యవస్థలు దెబ్బతినే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. ఆంటీ-మైక్రోబియల్ ఔషధాలను వైద్యులు సూచించినట్లుగా విచక్షణతో వాడడం, మోతాదు మించకపోవడం, ఇతర జాగ్రత్తలను తూచా తప్పకుండా పాటించాలని దానివల్ల ఏఎంఆర్ అదుపు చేయబడి మానవాళి, జంతువులు, పంటల ఆరోగ్యాలు వర్ధిల్లుతాయి.

- మధుపాళి, 9949700037

శ్రామికలోకపు ఊహాచిత్రం!

(చిన్నా పెద్దా పెట్టుబడిదారుల సంభాషణ)



రంగనాయకమ్మ

పెద్ద పెట్టుబడిదారుడు సూరయ్య. చిన్న పెట్టుబడిదారుడు చంద్రన్న.వీళ్లిద్దరూ కొంతకాలం క్రితం, ఈ అడవిలోకి వచ్చి, కూర్చున్నారు. ఎందుకంటే, వీళ్లు ఇచ్చే లంచాలు తింటూ, అనుకూలంగా ప్రవర్తించే పోలీసులు, 'శ్రామిక వర్గ రాజకీయ పార్టీలో' సభ్యులైపోయి, పాత జీవితాలు వదిలేసి, సమాజంలో కొత్త కొత్త పనులు చేస్తున్నారు! పోలీసులే కాదు, సుప్రీంకోర్టు జడ్జీలు కూడా, తమని తాము జీతాలతో పనిచేసిన శ్రామికులుగా గుర్తించుకుని, శ్రామికవర్గ కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా వున్నారు!

పెద్ద పెట్టుబడిదారుడైతే, ఆ కమ్యూనిస్టు పార్టీని ధ్వంసం చేయాలని, కొందరు సైనికుల్ని అయినా పిలవాలని చాలా ప్రయత్నాలు చేస్తే, ఆ సైనికులు కూడా "మేము కార్మికులం! మాతో ఇంకా యుద్ధాలు చేయిస్తారా?" అంటూ కమ్యూనిస్టు పార్టీ సభ్యులైపోయినట్టు తెలిసి తెల్లబోయాడు! అంతేకాదు, ఈ ఇద్దరు బూర్జువాల పిల్లలు కూడా కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ప్రకారమే నడుస్తున్నారు మరి!

ఈ ఇద్దరు పెద్దా చిన్నా పెట్టుబడుల బూర్జువాలకూ మతులు పోయాయి! ఊరు నించి వినబడే 'లాభం ధ్వంసం! లాభం ధ్వంసం' అనే నినాదాల గురించి తెల్లబోయారు! "ఇది సాధ్యమా, వీళ్లకి సాధ్యమా!" అనుకుంటూ, ఇంకా పోలీసుల కోసం ప్రయత్నిస్తూ ఇళ్లల్లో వుండిపోయారు, కొన్నాళ్లు, ఇక, సాధ్యం కాదనీ, అయినా రేపటి భవిష్యత్తు మళ్లీ తమదే - అనే నమ్మకంతోటీ అప్పుడు త్వరలోనే వెనక్కి వచ్చేయాలని లేచారు, ఊరూ, ఇల్లూ, తాళాలు పెట్టేసి వదిలేసి పోయి, తిరిగి రావాలని! సూరయ్యకి 4 పరిశ్రమలు ఉండేవి. బ్యాంకుల్లో డబ్బూ, వెండి బంగారాలూ ఎన్నో కూడా! చంద్రన్న, సరుకుల్ని అమ్మించే వ్యాపారి. అతని కార్మికులు పూర్తిగా, ఆ కార్మిక వర్గ పార్టీలో కలిసిపోయారు. సమాజాన్ని కొత్తగా మారుస్తారట, ఆ పనులు చేస్తున్నారు.


సూరయ్య, చంద్రన్నని పిలిచి, "ఏమిటీ ఘోరం?" అన్నాడు, మొదట."అవును, ఘోరమే! మా ఆవిడే ఆ పార్టీ పనుల్లోనే వుంటాందండీ! చీకట్లోనే లేచి వంటలు చేసేసి! అన్నీ నా కోసం బల్లమీద పడేసి పోతాంది. ఇప్పుడు పట్టుచీరా లేదు, జరీ చీరా లేదు ఇంట్లో! నేత చీరలూ, వాయిల్ చీరలూ మాత్రమే కడతాంది. చాలా గుడ్డలు పేదవాళ్లకంట, ఇచ్చేసింది. వీళ్లు ఇలా ఎలా మారారో అర్థం కావడంలేదు సారూ! కోర్టుకి పోదామా అంటే, ఇంకేం కోర్టులు? సుప్రీంకోర్టు వాళ్లే ఇప్పుడు వీధుల్లో జయహో, లాభాలు నాశనాలు హో హో హో అంటూ నినాదాలతో ఊరేగింపులు చేస్తున్నారు!"

సూరయ్య, "వీళ్లకి బాగా లక్షలకొద్దీ డబ్బు పడేసిందా ఆ కార్మికోళ్ల పార్టీ? అదేదో చేసి వుంటారు!" అన్నాడు ఆగ్రహంగా.

"అబ్బబ్బే! అలా అనుకుంటే, కాదండీ! నేను మొన్నటిదాకా అలాగే అనుకున్నాను. మా ఆవిడ మాటలు వింటేనే, 'అమ్మో! ఈ ఆడోళ్లు, ఇప్పుడసలు ఆడోళ్లు కారయ్యా! మా ఆవిడా, ఆడపిల్లలూ, జుట్టులన్నీ భూతాల్లాగ నెత్తినిండా డబ్బుపోసి కొన్న సవరాల్ని కూడా అంటించుకుని, జుట్టంతా వీపు మీద కాదు, భుజాలమీదే, మొహాలమీదే మోస్తూ వుండేవారు, అందాల కోసం అంట, మొన్నటిదాకా. ఇప్పుడైతేనా? మా ఆవిణ్ణే నేను పోల్చలేకపోయాను మొన్న. నిక్షేపంగా తల దువ్వుకుని, చక్కని జారుముడి వేసుకుంది. ఎంత అందం వచ్చిందోనండీ. నిజంగా ఇప్పుడు! మా పెద్దమ్మాయి అయితే, క్రాపు చేసేసుకుంది. తనే చేసుకుంది! అయ్యయ్యో! ఇదేం గోరం సార్?"

"సరే, సరే, ఈ మాటలకేం గానీ, రేపు వాళ్లే వెనక్కి పరిగెత్తుకొస్తారు గానీ, అది కాదు, ఇప్పుడెలాగ? ఎలాగ?"

"ఇంకెలాగండీ? కొన్నాళ్లు అడివి వేపు పోదాం. నిన్న సాయంత్రం, ఒక జడ్జి, ఇప్పుడు జడ్జి కాదు, ఒక 'లీడర్' అంట! నాయకుడు! ఊరేగింపులో ఏం చెప్పాడంటే, 'ధనవంతులు అందరూ లేచి అడవికి పోతారా, మాకేం అభ్యంతరం లేదు! అడవులు, మా శక్తులతో తయారైనవి కావు. ఈ వూళ్లూ, ఈ రోడ్లూ, ఈ ఇళ్లూ, అయితే, అన్నీ మనుషుల శ్రమలవి! ఈ రోడ్లూ, మీ ధనిక భవనాలూ, ఈ కరెంట్లూ, ఈ కంప్యూటర్లూ, ఇవీ అవీ, అన్నీ మా



వర్గం శ్రమలతో తయారై నడుస్తున్నవే! మీరు ఏదైనా పని చేస్తేనే ఇక్కడ ఉండండి! లేకపోతే, అలాంటివాళ్లకి, ఈ ఇళ్లల్లో వుండే హక్కుల్లేవు! రోడ్డుమీద నడిచే హక్కులేదు! నీళ్లు ముట్టుకునే హక్కులేదు! అవి అన్నీ నిత్యం మా శ్రమలవల్లే తయారై, పరిశుభ్రంగా అందుతున్నాయి!" అని పెద్ద ఉపన్యాసం ఇచ్చుకుంటూ, ఆ నాయకుడితో గుంపంతా అరుస్తూ, చప్పట్లతో, గంతులతో తిరిగిందండీ!..."

"వెంటనే నువ్వు పోలీసుల్ని పిలవొద్దూ?"

"అయ్యయ్యో! వాళ్లు కూడా కమ్యూనిస్టు పార్టీ ప్రకారం నడుస్తున్నారండీ బాబూ!"

"ఎందుకూ? వాళ్లు జీతాలు బాగా పెంచేసి ఇస్తున్నారా!?"

"అబ్బబ్బే! అలా కాదు, అసలు జీతాల పద్ధతేమీ ఇంకా ప్రారంభం కాలేదు. అవి, ఉండాలా - పోవాలా - అని చర్చలు చేస్తున్నారంట! మీ పెద్దబ్బాయే వాళ్లల్లో ఒకడండీ!"

"ఆ, ఛ! మా అబ్బాయి అయితేనా? ఆఫీసుకి పోతున్నాడు. వాడు, నన్ను అడక్కుండా ఎటూ వెళ్లడయ్యా! ఆస్తి అంతా పోతదంటే వాడికి ఏడుపు కాదూ?"

"అయ్యయ్యో! ఎలాగ? మనం కళ్లు మూసుకుని కూర్చుంటే ఎలాగ? ఆస్తులన్నీ మనవే అంటారా? వాళ్లు అలాగే అంటున్నారు. పనులకు దిగనివాళ్లు, వాళ్ల ఇష్టంతో వాళ్లు దిగకపోతే, ఎటో పోకపోతే, అలాంటి వాళ్లకి అరెస్టులంట! అసలు, జైళ్లన్నీ ఖాళీ చేసేశారండీ! అక్కడవున్న వాళ్లల్లో చాలామందిని మనం, జైళ్లల్లో అన్యాయంగా పెట్టించామంట! జైళ్లన్నీ ఖాళీ! ఖాళీ! బూర్జువాలందర్నీ అక్కడ పెడతారంట! బూర్జువాలం అంట మనం! సూరయ్యగారూ! మీ సరుకులన్నీ అమ్మిస్తూ నేను బాగా సంపాదించాను గానీ, అదెక్కడుంది? బ్యాంకుల్ని మూసేశారు! ఇంకా ఇక్కడే వుండి, జైళ్లకే పోదామంటారా? నేనలా వెళ్లనండీ. అడివికి పోతేనే మంచిది. రేపు మళ్లీ మన రోజు మంచిదవుతుందా! నా జాతకం అలాగే వుంది, మీరు కూడా.... ఏమో, ఏం జాతకాలో! నమ్మాలనిపించడంలేదు! వెనక్కి వచ్చేస్తాం! ఇంటికి రాగానే నా పెళ్లాన్ని చావగొట్టాలి, చచ్చినా సరే! రెండోది దొరకదా? అంతా చేస్తాను. నేను పోతానండీ అడవికి."

"అక్కడ ఎలా వుంటాం? ఏం తింటాం?"

"ఏదో తింటాం లెండి! చాలా గడ్డి వుంటుంది లెండి అడివి నిండా. మా వాళ్లు అదీ చెప్పారు. వాళ్లే భోజనాలు పంపిస్తారంట కొన్నాళ్లు. ఎన్నాళ్లో! మనం అన్నాళ్లు అక్కడే వుండిపోతామా? ఆర్నెలల్లో రామా? నేను వెళ్తానండీ!" అంటూ లేచాడు చంద్రన్న.

"ఉండు! ఆగు! ఆగు! తప్పదంటే, ఇక్కడే జైల్లో వుంటానా? పోదాం గానీ, ఏం తీసుకుపోవాలి? బ్యాంకు ఎక్కౌంట్లు పట్టుకుందాం."

"ఇంకేం ఎక్కౌంట్లు? అవన్నీ వాళ్ల శ్రమలంట! అదీ నిజమేలెండి! అన్నీ వాళ్లు స్వాధీనం చేసుకున్నారు! ఇక, నేను వెళ్తానండీ! మనం వడ్డీలతో, లాభాలతో సంపాదించిందంతా శ్రామిక వర్గపు శ్రమల వల్లేనంట! అంటున్నారు వాళ్లు! నేను జైల్లోకి వెళ్లలేనండీ! సిగ్గుచేటు! ఏదో పనిచెయ్యాలంట ఇక్కడే వుంటే! ఏం పని చేస్తాను? నేనిక చెప్పలేను. ఇంకా ఈ ఊళ్లోనా! అడివిలోకే పోతా, రెండు జతల గుడ్డలు పట్టుకుని! ఫోను వుందిలెండి" అంటూ చంద్రన్న లేచిపోయి చకచకా ఎటో పరిగెత్తాడు.

సూరయ్యకి, నించోవాలో, కూర్చువాలో, ఏం చెయ్యాలో తోచలేదు!

"ఒరేయ్!" అని పనివాణ్ణి పిలిచాడుగానీ, ఒక్కడూ లేరు, మాయం! పెళ్లమూ రాదే! ఎక్కడ చచ్చింది?

***

కాలం గడుస్తోంది! కాలం! కాలం! కాలమే సూరయ్యని కూడా మార్చినట్టుంది! చంద్రన్నని వెతుక్కుంటూ తను కూడా రెండు గుడ్డల సంచితో, అడవి వేపే భారంగా అడుగులేస్తూ నడిచాడు!

***

అక్కడ చంద్రన్న, ఒక చెట్టు కింద చిన్న గుడిసెలో, గుడిసో, పందిరో, ఉన్నాడు అక్కడే! రెండు రోజులకోసారి క్యారేజీతో భోజనాలు వస్తున్నాయంట!

తర్వాత, సూరయ్యకి కూడా అలాగే మొదలై సాగుతోంది భోజనం.

రెండే రెండు రోజుల్లోనే చంద్రన్న లేచాడు. "నేనిక వుండలేను ఇక్కడ. ఊళ్లోకే పోతానండీ!"

"ఊళ్లోకా! అక్కడ పని చెయ్యాలన్నావు?"

"అదే, చేస్తా! లేకపోతే, జైల్లో వుంటానా? జైల్లో కూడా పనులు చెయ్యాలంటండి! ఊళ్లోనే వ్యవసాయం పనే. ఫర్వాలేదు. మీరూ వచ్చేస్తారా?"

సూరయ్యకి కోపం! ఆగ్రహం! "ఏంటి, నన్ను, నీలాంటి సరుకులు అమ్మించేవాళ్లే అనుకుంటున్నావా? నా కమీషన్లతో బలికావు నువ్వు! నన్ను కూడా పిరికివందని అనుకుంటున్నావు? నీ పెట్టుబడి, ఎంత? సింగినాదం అంత! యాభైలక్షలన్నా వుంటదా? నా పెట్టుబడి యాభైకోట్లు! నీతో నన్ను పోల్చుకుంటూ మాట్లాడకు!"

"క్షమించండి! ఒక కోటి దాకా అన్నా సంపాదించాలను కున్నాను. కానీ, జరగలేదులే! నా వర్కర్లు మంచివాళ్లే. అయినా జరగలేదు! అయ్యో, పోయి, ఏదో పని మొదలుపెడతా!" అంటూ చంద్రన్న లేచాడో లేదో, అటు పరిగెత్తాడు.

***

ఆ మర్నాడు గొడవయ్యింది సూరయ్యకి, క్యారేజీ తెచ్చిన చిన్న కొడుకుతో! రెండడుగుల ఎత్తు క్యారేజీ కాదు. ఒక్క చిట్టి గిన్ని క్యారేజీ అది! బుజ్జి గిన్ని! దాన్ని చూడగానే, "ఇదేమిటి?"అని, కెవ్వున అరిచాడు, కొడుకు మీద, సూరయ్య. "నా ఆస్తి అంతా నీకే రాద్దామనుకున్నాను?" అన్నాడు.

కొడుకు ధీమాగా ఆ గిన్ని అక్కడ పారేసి, మన ఆస్తి అంతా పార్టీ ఎప్పుడో తీసేసింది. "ఇక రోజూ రాను. రానూపోనూ గంటలు గంటలవుతోంది. ఇక రాను" అనేసి వెనక్కి తిరిగాడు. తిరక్కముందే మాయం!

కొడుకు అలా చెయ్యడనే సూరయ్య అనుకున్నాడు. కానీ చేశాడు, కుమారుడు!

"కమ్యూనిస్టు జబ్బా?" అనుకున్నాడు పెట్టుబడిదారీ తండ్రి!

***

సూరయ్యకి గడ్డం, మీసం అంతా పెరిగిపోయింది. తల జుట్టుని ముడేసుకోవలిసి వచ్చింది. అలా చెయ్యకపోతే, చెట్లకొమ్మలు జుట్టుని లాగుతున్నాయి. ఇక, భోజనం? దూరంగా చిన్న గుడిసె! ఆ వృద్ధురాలెవరో రోజుకి ఒక్క చేప ముక్క కాల్చి ఇస్తోంది. అతడు ధనవంతుడని తెలుసు. అయినా, ఎందుకో జాలిపడింది! పార్టీవాళ్లు తిడతారని కూడా తెలుసు!

సూరయ్య, చెట్లకింద ఎప్పుడెప్పుడో రాలి ఎండిపోయిన పళ్లు ఏరుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు. కాస్త దూరంగా నీళ్లమడుగు లాంటిది. అందులో చేపలున్నాయి... ఆ ముసలమ్మ ఒక బుట్ట ఇస్తే, దాన్ని నీళ్లలోకి ముంచితే నాలుగు చేపలు దొరుకుతాయి. అడవిలో ముసలమ్మ ఆ చేపలు తీసుకుని అన్నం కూడా తెస్తుంది.

గడిచింది, ఎన్నాళ్లో! తెలియడం లేదు! ఊళ్లో అయితే, రోజూ వర్కర్లు వచ్చారో లేదో అన్నీ తెలిసేది! లాభం లెక్కలైతే, వేలల్లో, లక్షల్లో, తెలిసేవి!

(మిగతా రేపటి సంచికలో)

> **నిన్న సాయంత్రం, ఒక జడ్జి, ఇప్పుడు జడ్జి కాదు, ఒక 'లీడర్' అంట! నాయకుడు! ఊరేగింపులో ఏం చెప్పాడంటే, 'ధనవంతులు అందరూ లేచి అడవికి పోతారా, మాకేం అభ్యంతరం లేదు! అడవులు, మా శక్తులతో తయారైనవి కావు. ఈ వూళ్లూ, ఈ రోడ్లూ, ఈ ఇళ్లూ, అయితే, అన్నీ మనుషుల శ్రమలవి! ఈ రోడ్లూ, మీ ధనిక భవనాలూ, ఈ కరెంట్లూ, ఈ కంప్యూటర్లూ, ఇవీ అవీ, అన్నీ మా వర్గం శ్రమలతో తయారై నడుస్తున్నవే! మీరు ఏదైనా పని చేస్తేనే ఇక్కడ ఉండండి! లేకపోతే, అలాంటివాళ్లకి, ఈ ఇళ్లల్లో వుండే హక్కుల్లేవు! రోడ్డుమీద నడిచే హక్కులేదు! నీళ్లు ముట్టుకునే హక్కులేదు! అవి అన్నీ నిత్యం మా శ్రమలవల్లే తయారై, పరిశుభ్రంగా అందుతున్నాయి!" అని పెద్ద ఉపన్యాసం ఇచ్చుకుంటూ, ఆ నాయకుడితో గుంపంతా అరుస్తూ, చప్పట్లతో, గంతులతో తిరిగిందండీ!..."**

ఉన్నత న్యాయ వ్యవస్థ-హిందూత్వ

భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) డి.వై.చంద్రచూడ్ పదవీ విరమణ సందర్భంగా అనేక విమర్శనాత్మక అంచనాలు, వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. ఇటీవలి కాలంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పనిచేసిన వారిలో అత్యంత ప్రభావశీలమైన వారిలో జస్టిస్ చంద్రచూడ్ ఒకరుగా పరిగణించబడ్డారు గనక ఇది సహజమే. పైగా గత రెండు దశాబ్దాలలో మరే సిజెఐ చేయని విధంగా ఆయన రెండు సంవత్సరాల పాటు బాధ్యతలు నిర్వహించారు. రాజ్యాంగాన్ని, పౌరుల హక్కులను కాపాడే బాధ్యత గల న్యాయ వ్యవస్థ అధిపతిగా ఆయన నిర్వహించిన పాత్రను సరిగ్గా అంచనా వేయాలంటే తను చేసిన మొత్తం కృషిని పరిశీలించవలసి వుంటుంది. ఈ పనిచేసే సందర్భంలో సిజెఐ చంద్రచూడ్ ఏ నేపథ్యంలో తన న్యాయ పాలనా బాధ్యతలు నిర్వహించారో కూడా గమనంలో పెట్టుకోవడం అవసరం.రెండవ దఫా అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం తన హిందూత్వ ఎజెండాను ముందుకు నెట్టేందుకై దూకుడుగా ప్రయత్నిస్తున్న కాలం. రాజ్యాంగాన్ని పౌరుల ప్రాథమిక హక్కులను వమ్ము చేసే ఎజెండా అది. ఈ సందర్భంలోనే జస్టిస్ చంద్రచూడ్ రాజ్యాంగ సమస్యలపైన, మెజార్టీ మతతత్వ దాడిపైన ఇచ్చిన తీర్పులను చూడవలసి వుంటుంది.

రెండు తీర్పులు

ఈ కోణంలో రెండు తీర్పులు ఒకటి ఆయన న్యాయమూర్తిగా వుండగా ఇచ్చింది, మరోటి సిజెఐగా ఇచ్చింది కీలక పరీక్షకు వస్తాయి. అయోధ్య వివాదంపై తీర్పునిచ్చిన అయిదుగురు సభ్యుల ధర్మాసనంలో జస్టిస్ చంద్రచూడ్ ఒక సభ్యుడు. ఆయన రచించిన తీర్పు బాబ్రీ మసీదు వుండిన వివాద స్థలం మొత్తాన్ని రామమందిర నిర్మాణానికై హిందువులకు అప్పగించింది. సాక్ష్యాలు, క్షేత స్థాయి వాస్తవాల కన్నా ఎక్కువగా మతభావనలు, విశ్వాసాలపై ఆధారపడి ఆ తీర్పు రూపొందింది. బాబ్రీ మసీదు విధ్వంసం రాజ్యాంగ విరుద్ధమైన దిగ్భ్రాంతికర చర్య అని ఒప్పుకుంటూనే ఆ తీర్పు అలా రూపొందింది. ఆర్ఎస్ఎస్ బీజేపీ-విశ్వహిందూ పరిషత్‌ల వాదనను చట్టబద్ధం చేస్తూ ఆ విధంగా బీజేపీ మూల ఎజెండాలో ఒకదాన్ని నెరవేర్చిన న్యాయవ్యవస్థ తీర్పు అది. తర్వాతి కాలంలో సిజెఐ చంద్రచూడ్ వారణాసిలోని గ్యాన్‌వాపి మసీదు కేసును కూడా తిరగదోడడానికి అనుమతించడాన్నిబట్టి ఈ తీర్పు ఏదో ఒకసారి వ్యవహారం కాదని తేలిపోయింది. 1991 ప్రార్థనా స్థలాల పరిరక్షణ చట్టం అలాంటి కేసులు పునఃప్రారంభించడాన్ని నిషేధిస్తున్నప్పటికీ హిందువులు గ్యాన్‌వాపి మసీదు స్వభావాన్ని మార్చాలని కోరడం లేదనీ కేవలం దాని మత మూలాలను తెలుసుకోవాలని మాత్రమే కోరుతున్నారని ఒక సందేహాస్పద వాదనతో సిజెఐ చంద్రచూడ్ ఈ కేసులను అనుమతినిచ్చారు. దానివల్ల హిందూత్వ శక్తులు వారణాసి, మధుర వివాదాలను మళ్లీ రగిలించేందుకు లైసెన్సు లభించినట్టయింది.

సిజెఐ చంద్రచూడ్ ఇచ్చిన మరో ప్రధానమైన తీర్పు జమ్ముకాశ్మీర్ 370 అధికరణాన్ని రద్దు చేయడం, ఆ రాష్ట్రాన్ని విచ్ఛిన్నం చేయడం సంబంధించి. జమ్ము కాశ్మీర్ రాజ్యాంగ పరిషత్తు ఇంకేమాత్రం ఉనికిలో లేదు గనక కార్యనిర్వాహక వర్గం 370 అధికరణాన్ని ఏకపక్షంగా సవరించే అధికారం కలిగివుంటుందని ఆ తీర్పు ఆమోదం తెలిపింది. రాజ్యాంగం మూడవ అధికరణంలోని ప్రక్రియను ఉల్లంఘించి జమ్ము కాశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా తగ్గించివేయడంపై తీర్పు నిస్తూ భవిష్యత్తులో ఒకనాటికి మళ్లీ రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరిస్తామనే హామీని ఆమోదిస్తున్నట్టు చెప్పింది. 370వ అధికరణాన్ని రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వ చర్యను ఏదో విధంగా ఆమోదించాలని మాత్రమే ఆ తీర్పు ఉద్దేశమని తప్ప మరో విధంగా అర్థం చేసుకోవడం కుదరదు. ఆర్ఎస్ఎస్, బీజేపీ మూల ఎజెండాలో మరోటని గుర్తించడం ఇక్కడ చాలా ముఖ్యం.



PEOPLE'S DEMOCRACY

కొలీజియం, ధర్మాసనాల తీరు

సిజెఐ చంద్రచూడ్ హయాంలో ధర్మాసనాలకు జడ్జిల నియామకం చేసే బాధ్యత (మాస్టర్ ఆఫ్ ద రోస్టర్) నిర్వహణలోనూ, కొలీజియం వ్యవస్థ పనితీరులోనూ ఇంకా ఇతర అంశాలున్నాయి. ఈ విషయంలోనూ ఒక స్పష్టమైన పద్ధతి పాటించినట్టు స్పష్టంగా కనిపిస్తుంది. పౌరుల వ్యక్తి స్వేచ్ఛకు సంబంధించిన కేసులు అంటే దీర్ఘకాలం నిర్బంధం సాగిన భీమా కోరెగావ్, ఈశాన్య ఢిల్లీ మత ఘర్షణల కేసుల వంటివి ఒక పథకం ప్రకారం నిర్దిష్ట ధర్మాసనానికే పంపినట్టు కనిపిస్తుంది. ఆ పౌర హక్కులు బెయిల్ మంజూరు వంటి విషయాల్లో మితవాద దృక్పథంతో గల న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికే వాటిని పంపించారు. ఇక కొలీజియం పని విషయానికి వస్తే హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తుల నియామకం నియంత్రణ ప్రభుత్వానికే వదలివేయడం ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది.

అయితే ఇవన్నీగాక మరో విషయం కూడా కొట్టొచ్చినట్టు కనిపించింది. ఈ జ్ఞానవంతుడైన జడ్జి వ్యక్తిగత స్వేచ్ఛలను రాజ్యాంగ సూత్రాలను దృఢంగా సమర్థిస్తారనే భావన వుండగా ఆయన చివరకు రాజ్యాంగం, దాని విలువల పట్ల విధేయత కన్నా తన వ్యక్తిగత నమ్మ కాన్నే అధికంగా చూడటమే. తన పదవీ విరమణకు ముందు ఆఖరి ఘట్టంలో చంద్రచూడ్ అయోధ్య కేసు పరిష్కారం కోసం తాను దైవాన్ని ప్రార్థించానని చెప్పడం అనేక మందిని దిగ్భ్రాంతికి గురి చేసింది. రాజ్యాంగ చట్టం ప్రకారం గాక దైవ ప్రేరణతో ఆ తీర్పు రాశానని ఒప్పుకున్న దాన్ని రాసిన వ్యక్తి చెబుతున్నాడన్న మాట. మరో సందర్భంలో జస్టిస్ చంద్రచూడ్ గుజరాత్‌లోని ద్వారక ఆలయ సందర్శన తర్వాత అక్కడ వున్న లాయర్ల బృందంతో మాట్లాడుతూ ఆ ఆలయ శిఖరంపై వున్న కాషాయ ధ్వజం న్యాయ పతాకగా వెలుగొందుతుందని ప్రవచించారు.

ఆరెస్సెస్ భావనల చొరబాటు

వీటన్నిటినీ బట్టి వెల్లడయ్యేది ఒకటే. కేవలం సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒక్కరే గాక మొత్తం ఉన్నత న్యాయ వ్యవస్థలో మత భావనలు పెరుగుతున్నాయనే వాస్తవం. మోడీ దశాబ్ది పాలన ప్రభావంతో ఇటీవలి కాలంలో బహిరంగంగానే హిందూత్వ భావనలు ఉన్నత న్యాయ వ్యవస్థ దొంతరలో, న్యాయ వర్గాల్లో విస్తరించాయి. కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి ఒకరు తన పదవీ విరమణ సమయంలో ఆరెస్సెస్‌తో తన యావజ్జీవిత బంధాన్ని, ఆ సంస్థకు తన రుణపడి వుండటాన్ని గురించి ప్రకటించారు. మరో హైకోర్టు జడ్జి అభిజిత్ గంగోపాధ్యాయ ఎన్నికలకు కొన్ని వారాల ముందు రాజీనామా చేసి కొద్ది రోజుల్లోనే బీజేపీ అభ్యర్థిగా లోక్‌సభకు పోటీ చేసి గెలుపొందారు. కొంతమంది న్యాయమూర్తుల ప్రాపంచిక దృక్పథం హిందూత్వతో రూపుదిద్దుకుంటున్నదని మధ్యప్రదేశ్ హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇటీవల చేసిన వ్యాఖ్యలు వెల్లడించాయి. రక్షణోద్యోగులు ఆరెస్సెస్‌లో చేరడంపై పదవీ విరమణ చేసిన ఒక ప్రభుత్వోద్యోగి వేసిన పిటిషన్‌ను ఆ హైకోర్టు పరిష్కరిస్తూ హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. ఆరెస్సెస్‌పై నిషేధాన్ని కేంద్రం ఉపసంహరించిన తర్వాత వెలువడిన ఆ ఉత్తర్వులో హైకోర్టు ఆర్ఎస్ఎస్ వంటి ఒక గౌరవనీయ సంస్థను దేశంలోని నిషిద్ధ సంస్థల జాబితాలో తప్పుగా చేర్చినట్టు పేర్కొంది. "కేంద్ర ప్రభుత్వం చేసిన ఆ తప్పు వల్ల అయిదు దశాబ్దాల పాటు దేశానికి సేవ చేయాలనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్షలు అనేక విధాల క్షీణించిపోయాయి"అని పేర్కొంది. అంటే విజ్ఞానవంతులైన ఈ జడ్జిలు చెప్పే ప్రకారం దేశానికి సేవ చేయాలంటే ఆర్ఎస్ఎస్‌లో చేరాలన్నమాట.

కారవాన్ పత్రిక 2024 అక్టోబర్ సంచికలో ఆరెస్సెస్ లీగల్ విభాగం ఉన్నత న్యాయ వ్యవస్థలో తన పట్టు ఏ విధంగా పెంచు కుంటున్నదీ కళ్లు తెరిపించేలా వ్యాసం ప్రచురించింది. అఖిల భారతీయ అధివక్త పరిషత్ ఆరెస్సెస్ న్యాయవాదుల వేదికగా పని చేస్తున్నది. దాని శ్రేణుల నుంచే అంతకంతకూ ఎక్కువగా లీగల్ అధికారులు, అడ్వకేట్ జనరల్స్ వంటి వారు, జడ్జిలు నియమితులవుతున్నారు. 33 మంది ప్రస్తుత న్యాయ మూర్తులలో కనీసం తొమ్మిది మంది బహుళ సంఖ్యలో ఆ పరిషత్ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారని కారవాన్‌లో వెలువడిన ఆ వ్యాసం చెబుతున్నది. అత్యున్నత స్థాయిలో వెలువడే న్యాయ నిర్ణయాల్లో మెజారిటీ మతతత్వ మనోభావాలు ప్రతిబింబించుతున్నాయనడానికి సిజెఐ చంద్రచూడ్ పదవీ కాలపు అనుభవం ఒక ముందస్తు హెచ్చరిక లాంటిది. మొత్తంపైన ఉన్నత న్యాయ వ్యవస్థలో ఆరెస్సెస్ చొరబాటుకు మోడీ ప్రభుత్వం ఎలా సహాయపడిందో చెప్పే హెచ్చరిక ఇది.

(నవంబరు 13 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు

దశలవారీ పోరాటం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేజీబీవీ, యూఆర్‌ఎస్ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు కె.జంగయ్య అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో కేజీబీవీ, యుఆర్‌ఎస్ ఉద్యోగుల టైమ్ స్కేల్ సాధన కోసం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సులో రాష్ట్ర, జిల్లా బాధ్యులు పాల్గొని సమస్యల పరిష్కారం కోసం పోరాటమే శరణ్యమని నిర్ణయానికి వచ్చారు. దశలవారీగా పోరాటంలో భాగంగా ఈ నెల 27 నుంచి ఫిబ్రవరిలో శాసనసభ బడ్జెట్ సమావేశాల వరకు పోరాటం కొనసాగించనున్నట్టు తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో లంచ్ అవర్ డిమాన్‌స్ట్రేషన్స్, డిసెంబర్ 9 నుంచి 13 వరకు సీఎం వినతిపత్రాలు (ప్రతి కేజీబీవీ, యూఆర్‌ఎస్ నుంచి మెయిల్ ద్వారా) సమర్పణ, డిసెంబర్ 22 నుంచి 25 వరకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాల సమర్పణ, జనవరి 7న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద సామూహిక నిరాహారదీక్షలు, జనవరి 28న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. అప్పటికీ ప్రభుత్వం డిమాండ్ల సాధనకు ముందుకు రాకుంటే ఫిబ్రవరిలో జరిగే శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ నిర్వహించాలని నిర్ణయించారు.

అంతకు ముందు రాష్ట్ర సదస్సును ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఒక కుటుంబంగా ఐక్యంగా ఉండి ఉద్యోగులు సాధించుకున్న విజయాలను గుర్తుచేశారు. టీచర్‌గా గుర్తింపు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు, 12 నెలల వేతనం, ప్రసూతి సెలవులు డిమాండ్లు సాధించుకోగా, మినిమం టైం స్కేల్‌తో పాటు మరి కొన్ని డిమాండ్లను సాధించుకోవాల్సి ఉందన్నారు. తాను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా శాసనమండలిలోకి వెళ్లిన తర్వాత పలు మార్లు వారి సమస్యల పరిష్కారం కోసం ప్రస్తావించిన, నిలదీసిన విషయాలను గమనంలో పెట్టుకోవాలని కోరారు. శాసనమండలి బయట జరిగిన పోరాటాల్లోనూ తాను వెన్నంటి ఉన్నట్టు చెప్పారు. డిమాండ్ల సాధనకు చట్టసభల్లోనూ, బయట పోరాడే నాయకులు అవసరమనీ, నికరంగా నిలబడే సంఘం ఉండాలని గతానుభవాలే నిదర్శనమని తెలిపారు. శాసనమండలిలో మిగిలిన ఇద్దరు టీచర్ ఎమ్మెల్సీలు, బయట ఇతర సంఘాలు ఇంతకాలం కేజీబీవీ, యుఆర్‌ఎస్ ఉద్యోగుల హక్కుల గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గతంలో డిమాండ్లను కలిసి సాధించుకున్నట్టే ఎంటీఎస్ వచ్చేంత వరకు పోరాటం చేద్దామని సూచించారు. మండలిలో హామీల అమలు కోసం నిలదీస్తూ భవిష్యత్తులోనూ అండగా ఉంటానని భరోసానిచ్చారు. కేజీబీవీ, యుఆర్‌ఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు.

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక పోరాటాలతో ఎస్సెస్సీ ఫలితాలతో సంబంధం లేకుండా 12 నెలల వేతనం సాధించుకున్నారని గుర్తుచేశారు. టైంస్కేల్ సాధించుకోవడం ప్రస్తుతం కీలకంగా ఉందని తెలిపారు. వర్కర్ నుంచి స్పెషల్ ఆఫీసర్ల వరకు అందరూ ఐక్యంగా నిలబడి పోరాటంలో ముందుకెళ్దామని సూచించారు. కె.జంగయ్య మాట్లాడుతూ యుటిఎఫ్‌తో డిమాండ్ల సాధన అవుతుందా? అని కొంత మంది చేసే విమర్శలకు మోసపోవద్దని కోరారు. వారు పెట్టే ఆశలకు లొంగొద్దని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును యుటిఎఫ్ సాధించిన తర్వాత ఆ ఓట్ల కోసం మాత్రమే వచ్చే వారి మాయలో పడొద్దని సూచించారు. ఎంత మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీలున్నా...ఒక్క అలుగుబెల్లి నర్సిరెడ్డి మాత్రమే డిమాండ్ల సాధన కోసం పాఠశాల విద్య సంచాలకుల కార్యాలయంలో ఉద్యోగులతో పాటు మెట్లపై కూర్చున్నారని తెలిపారు. మిగతా ఉపాధ్యాయ ఎమ్మెల్సీలకు, అలుగుబెల్లి నర్సిరెడ్డికి ఉన్న తేడా గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈ సదస్సులో ఫెడరేషన్ కోశాధికారి లక్ష్మారెడ్డి, కార్యదర్శి నాగమణి, కేజీబీవీ, యుఆర్‌ఎస్ విభాగం అధ్యక్షులు కె.విశాలక్షి, ప్రధాన కార్యదర్శి సీహెచ్.లక్ష్మి, కోశాధికారి యం.మంజుల తదితరులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో లంచ్ అవర్ డిమాన్‌స్ట్రేషన్స్

- డిసెంబర్ 9 నుంచి 13 వరకు సీఎంకు వినతిపత్రాలు
- డిసెంబర్ 22 నుంచి 25 వరకు స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతులు
- జనవరి 7న జిల్లా కలెక్టరేట్ల వద్ద సామూహిక నిరాహార దీక్షలు
- జనవరి 28న హైదరాబాద్‌లో మహాధర్నా

శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా చలో అసెంబ్లీ : టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర సదస్సు తీర్మానం

సమగ్ర శిక్ష ఎస్పీడీకి నోటీసు

అనంతరం పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్పీడీ) ఈ.వీ.నరసింహారెడ్డిని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి, నాయకులు హేమంత్, లక్ష్మారెడ్డి, లక్ష్మి, విశాలక్షి, మంజుల, గోపీలత, రేణుక, దుర్గ కలిసి నోటీసును అందజేశారు. కేజీబీవీ, యుఆర్‌ఎస్, సమగ్ర శిక్ష ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలనీ, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గిగ్ వర్కర్ల చట్టం పటిష్టంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎత్తిచూపుతున్నారని గుర్తు చేశారు. దీనికి సంబంధించి నిబంధనలు లేకపోవడంతో చర్చలు జరపడం, లేదా న్యాయమైన పని నిబంధనలను డిమాండ్ చేసే వారి సామర్థ్యాన్ని మరింత తగ్గించిందని తెలిపారు. దోపిడీ పని పరిస్థితులు, శ్రమ దోపిడీ, సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం లేకపోవడం వంటి వాటిని ఈ చట్టంలో పరిష్కరించాలని సూచన చేశారు. కార్మికులు తమ రోజువారీ పనిలో సామాజిక వివక్ష, అమానవీయ ప్రవర్తనతో పోరాడుతున్నారని తెలిపారు.

కాంగ్రెస్ కార్మికుల శ్రేయస్సు కోసం నిలుస్తుందన్నారు. మ్యానిఫెస్టోలో గిగ్ కార్మికులను రక్షించడానికి, సామాజిక భద్రతను పెంచడానికి ఒక చట్టాన్ని రూపొందించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలో ఉండే రాష్ట్రాలు ఈ దిశలో అనేక చర్యలు తీసుకున్నాయని, రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం గిగ్ కార్మికుల సంక్షేమానికి చట్టం చేసిన మొదటి రాష్ట్రంగా అవతరించిందని గుర్తు చేశారు.

తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీని గౌర విస్తూ ఒక ముసాయిదా చట్టంతో ముందుకు సాగుతున్నందుకు, దానికి సూచ నను అందించడానికి తాను సంతోషిస్తున్నాని రాహుల్ గాంధీ తెలిపారు. తాను ఇటీవల హైదరాబాద్‌లో పర్యటించినప్పుడు, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులాల సర్వే కోసం శక్తివంతమైన ప్రజా సంప్రదింపు ప్రక్రియ తనను ఆకట్టుకుందన్నారు. చట్టాన్ని రూపొందించేవారు ప్రజల నుం డి నేరుగా వినడానికి ఇది విలువైన నమూనాను అందిస్తుందని తెలిపారు.

గిగ్ వర్కర్ల ముసాయిదా చట్టం కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సంప్రదింపులు జరపాలని తాను అభ్యర్థిస్తున్నానని అన్నారు. అన్ని పక్షాల నుండి సూచనలు, సలహాలతో చట్టం పటిష్టంగా, ప్రభావవంతంగా, అర్థవంతంగా ఉండాలని సూచన చేశారు. ఈ రంగం కోసం భవిష్యత్తు నిబంధనలను రూపొందించడంలో కూడా ఈ ప్రక్రియ సహాయపడుతుందని తెలిపారు. ఈ సంప్రదింపు ప్రక్రియలో భాగమైనందుకు తాను సంతోషిస్తానని, భవిష్యత్తు కోసం సుస్థిరమైన గిగ్ ఎకానమీని నిర్మించడంలో తెలంగాణ ముందుంటుందని నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు.

5.8 కోట్ల రేషన్ కార్డులు ఏరివేత

(మొదటిపేజీ తరువాయి)

నిర్ధారిస్తుందని తెలిపింది. ఈ-పోస్ పరికరాల సాయంతో 99.8 శాతం రేషన్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేయగా, 98.7 శాతం లబ్దిదారుల ధ్రువీకరణ బయోమెట్రిక్ పూర్తైందని తెలిపింది. మరోవైపు ఈకేవైసీ ప్రక్రియతో ఇప్పటి వరకు 64 శాతం లబ్దిదారుల వెరిఫికేషన్ పూర్తైందని తెలిపింది. ఈ ప్రయత్నాలు లీకేజీలను గణనీయం గా తగ్గించాయని, లక్ష్యాన్ని మెరుగుపరిచాయని స్పష్టం చేసింది. ఆహార పదార్థాల సరఫరా విషయంలోనూ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) పకడ్బందీగా వ్యవహరిస్తోందని పేర్కొంది. సరకు రవాణాను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా వెహికల్ లోకేషన్ ట్రాకింగ్ సిస్టమ్ (విఎల్‌టిఎస్)నూ రైల్వేలతో అనుసంధానించినట్లు చెప్పింది. ఎంఎస్‌పీ కార్యకలాపాల కోసం సెంట్రల్ ఫుడ్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (సీఎఫ్‌పీపీ) వ్యవస్థ అభివృద్ధి, వేర్‌హౌస్ ఇన్వెంటరీ నెట్‌వర్క్ అండ్ గవర్నింగ్ సిస్టమ్ (వింగ్స్) అప్లికేషన్‌ని అమలు చేస్తుందని తెలిపింది. వన్ నేషన్-వన్ రేషన్ కార్డు పథకంతో లబ్దిదారులు దేశంలో ఎక్కడైనా సరకులు తీసుకునే అవకాశం కలిగించిందని పేర్కొంది.

ప్రమాదంలో పిల్లల భవితవ్యం

- పర్యావరణ ముప్పు నీడలో వంద కోట్ల మంది చిన్నారులు
- హెచ్చరించిన యూనిసెఫ్ నివేదిక



న్యూఢిల్లీ : మరే ఇతర తరాల్లోనూ అనుభవించనటువంటి అత్యంత ప్రమాదకరమైన, అనూహ్యమైన పర్యావరణాన్ని నేటి తరం పిల్లలు ఎదుర్కోనున్నారని యూనిసెఫ్ హెచ్చరించింది. వాతావరణ మార్పులు అత్యంత తీవ్రంగా వున్న పర్యావరణ ప్రమాదాలు జరిగే ముప్పు వున్న దేశాల్లో దాదాపు వంద కోట్ల మంది పిల్లలు నివసిస్తున్నారని పేర్కొంది. బుధవారం ఈ నివేదికను విడుదల చేశారు.

జనాభా మార్పులు, వాతావరణ, పర్యావరణ సంక్షోభాలు, అత్యంత కీలకమైన సాంకేతికతలు ఈ మూడు కీలకమైన శక్తుల ప్రభావాన్ని ఈ నివేదిక సవివరింగా పరిశీలించింది. ఇప్పటి నుంచి 2050 మధ్య కా లంలో పిల్లల జీవితాలపై ఈ మూడు అంశాలు తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తాయని పేర్కొంది. అంతర్జాతీయంగా అస్థిర వాతావరణం, జీవ వైవిధ్యత కుప్పకూలడం, విస్తృత స్థాయిలో కాలుష్యం పెచ్చరిల్లుతున్నాయని హెచ్చరించింది. గతంలో మరే తరం పిల్లలు కూడా ఇటువంటి పరిస్థితులను, ముప్పులను ఎదుర్కొనలేదని, కానీ నేటి తరం పిల్లలకు ఇదే ప్రధాన సమస్యగా మారనుందని హెచ్చరించింది. ఎదుగుతున్న పిల్లల శరీరాలు ప్రత్యేకంగా ఈ ప్రమాదాలకు గురవుతాయని తెలిపింది.

భూమిపై పడిన మొదటి క్షణం నుండి పిల్లల మెదళ్ళు, ఊపిరితిత్తులు, రోగ నిరోధక వ్యవస్థలు ఇలా అన్నీ తీవ్రంగా కలుషితమవుతాయని పేర్కొంది. ముఖ్యంగా పీల్చే గాలిలోని కాలుష్యం వారిని బాగా దెబ్బతీస్తుందని నివేదిక హెచ్చరించింది. వారి శ్వాసకోశ ఆరోగ్యంపై పడే ప్రభావం జీవిత కాలమూ వుంటుందని పేర్కొంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల దోమల ఉత్పత్తి పెరుగుతుంది. మలేరియా, డెంగ్యూ, జికా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. వరదలతో నీరు కలుషితమవుతుంది.

దాంతో నీటిలో బ్యాక్టీరియా వృద్ధి చెంది వ్యాధులు సంక్రమిస్తాయి. ఐదేండ్లలోపు పిల్లల్లో ఇవే ప్రధాన ముప్పు కానుందని నివేదిక హెచ్చరించింది. పైగా వాతావరణ సంబంధిత విపత్తులు పిల్లల్లో ఆందోళన, కుంగుబాటు, నిస్సహాయత వంటి లక్షణాలను పెంచుతాయని పేర్కొంది.

నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

కోటి దీపోత్సవం, లోక్‌మంథన్‌లో పాల్గొననున్న ప్రథమ మహిళ

డ్రోన్ల ఎగరవేతపై నిషేధం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్ర పర్యటన ఖరారైంది. రెండు రోజులపాటు హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఈనెల 21 గురువారం సాయంత్రం ఆరు గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు రాష్ట్రపతి చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా రాజ్‌భవన్‌కు వెళతారు. అనంతరం 6:20 గంటల నుంచి 7.10 గంటల వరకు రాజ్‌భవన్‌లో ఉంటారు. రాత్రి 7.:20 గంటలకు ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొననున్నారు. రాత్రి రాజ్‌భవన్‌లోనే రాష్ట్రపతి బసచేస్తారు. అలాగే ఈనెల 22 శుక్రవారం హైటెక్‌సిటీ శిల్పకళావేదికలో లోక్‌మంతన్-2024 కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:05 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి తిరిగి ఢిల్లీకి వెళతారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. రాష్ట్రపతి పర్యటనను దృష్టిలో పెట్టుకుని మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్లు ఎగరవేయడంపై నిషేధం విధించారు. ఈ ఆదేశాలను మరుసటి రోజు శుక్రవారం వరకు అమల్లో ఉంటాయని పోలీసులు తెలిపారు. ఎవరైనా ఆదేశాలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పోలీస్‌శాఖ ప్రకటించింది.

గెలుపెవరిది?

(మొదటిపేజీ తరువాయి)

67.59 శాతం ఓటింగ్ నమోదైంది. ఓటింగ్ పెంపునకు ఎన్నికల సంఘం అనేక చర్యలు తీసుకున్నప్పటికీ మహారాష్ట్ర రాష్ట్రంలోని పట్టణ ఓటర్లు ముంబయి, పూణే, థానే వంటి నగరాల్లో తక్కువ శాతం ఓటింగ్ జరిగింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. 15 రాష్ట్రాల్లోని 15 అసెంబ్లీ నియోజక వర్గాలు, ఒక లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికలూ బుధవారం జరిగాయి. దీంతో రెండు దశల్లో 15 రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక జరిగింది. మహారాష్ట్రలోని గర్చిరోలి, జార్ఖండ్ లోని గిరిదిహ్‌తో సహా రెండు రాష్ట్రాల్లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ సజావుగానే సాగింది. మొదటి సారి ఓటర్లు, వృద్ధ, గిరిజన, వికలాంగ ఓటర్లు, బాలింతలు, థర్డ్ జెండర్స్, సెలబ్రిటీ ఓటర్లతో సహా సమాజంలోని వివిధ వర్గాల ఓటర్లు పెద్ద ఎత్తున ఓటేసేందుకు క్యూ కట్టారు.

కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్‌తో పాటు ఎన్నికల కమిషనర్లు జ్ఞానేష్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు ఎన్నికల ప్రక్రియలోని ప్రతి అంశాన్ని నిశితంగా గమనిస్తూ ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లో కొన్ని అసెంబ్లీ స్థానాల్లో ఓటర్లను ఏకపక్షంగా తనిఖీ చేయడం, ఓటు వేయకుండా నిరోధించడంపై వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకున్న కమిషన్, సమగ్ర విచారణ తరువాత ఓటర్ల తనిఖీకి సంబంధించి నిబంధనలు, మార్గదర్శకాలను ఉల్లంఘించినందుకు మొరాదాబాద్, కాన్పూర్, ముజఫర్‌నగర్‌లోని పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేయాలని ఆదేశించినట్టు పేర్కొంది.

కొన్ని చోట్ల దాడులు

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పలు చోట్ల పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద దాడులు జరిగాయి. బీడ్ జిల్లాలోని పర్లి నియోజకవర్గంలో పోలింగ్ బూత్ ధ్వంసమైంది. పోలింగ్ బూత్‌లోని ఈవీఎం మిషన్లు, టేబుల్స్, ఇతర సామగ్రి నేలపై పడ్డాయి. దీంతో అక్కడ కొంతసేపు ఓటింగ్ నిలిచిపోయింది. ఘట్నందూరు గ్రామంలో ఈ ఘటన జరిగింది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీకి చెందిన స్థానిక నేత మాధవ్ జాదవ్‌పై పర్లీ టౌన్‌లోని బ్యాంక్ కాలనీ ప్రాంతంలో దాడి జరిగింది. ఈ నేపథ్యంలో ఘట్నందూరు గ్రామంలోని పోలింగ్ బూత్‌ను కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. మరోవైపు ఈ పోలింగ్ బూత్‌లో ధ్వంసమైన ఈవీఎంల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహించారు. నందుర్‌బార్ నియోజక వర్గంలో ఈవీఎంలలో సాంకేతిక సమస్యల కారణంగా ఓటింగ్‌ను తాత్కాలికంగా నిలిపేశారు. వాటి స్థానంలో కొత్త వి ఏర్పాటు చేసిన తరువాత పోలింగ్ తిరిగి కొనసాగింది.

మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) వర్గానికి చెందిన ఛగన్ భుజబల్‌ను శరద్ పవార్ వర్గం కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించకుండా ఆయనను నిలువరించారు. నాసిక్‌లోని యెవ్లా నియోజకవర్గం నుంచి ఛగన్ భుజబల్ పోటీ చేస్తున్నారు. బుధవారం పోలింగ్ సందర్భంగా ఆ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లను ఆయన సందర్శించారు. ఒక పోలింగ్ బూత్‌లోకి ఎక్కువసార్లు వెళ్లేందుకు ఆయనకు ఎలా అనుమతి ఇస్తారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో పోలింగ్ స్టేషన్‌లోనే అభ్యర్థి మృతి

మహారాష్ట్ర అసెంబ్లీ పోలింగ్ వేళ విషాద ఘటన చోటుచేసుకుంది. ఓటేసేందుకు క్యూలైన్‌లో నిల్చొని ఉన్న స్వతంత్ర అభ్యర్థి గుండెపోటుతో మరణించాడు. ఈ ఘటన బీడ్ నియోజక వర్గంలో జరిగింది. బీడ్‌కు చెందిన బాలాసాహెబ్ షిండే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నాడు. ఆయన ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఛత్రపతి షాహూ విద్యాలయం లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లాడు. లైన్‌లో నిల్చొన్న అతడు ఉన్నట్టుండి నేలపై పడిపోయాడు. వెంటనే ఆయనను తొలుత స్థానిక ఆస్పత్రికి, ఆ తరువాత ఛత్రపతి శంభాజీ నగర్ ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందినట్టు ధృవీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. గవర్నర్ సీపీ రాధాకష్ణన్, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, డిప్యూటీ సీఎం, ఎన్‌సీపీ అభ్యర్థి అజిత్ పవార్, బీజేపీ నేత దేవేంద్ర ఫడ్నవిస్, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ తన కుమారులు ఆకాశ్ అంబానీ, అనంత్ అంబానీ, కోడలు శ్లోకా మెహతాతో కలిసి ఓటు వేశారు. శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్, ఎంపీ సుప్రియా సూలే తదితరులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముంబయిలో సెలబ్రిటీలు పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటేశారు. క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తన కుటుంబంతో సహా ఓటేశారు. బయటకు వచ్చి ఓటు వేయాలని ఇతరులకు పిలుపునిచ్చారు. బాలీవుడ్ దర్శకుడు కబీర్ ఖాన్, సినీ నటుడు రాజ్ కుమార్ రావ్, నటి గౌతమీ కపూర్, నటులు అక్షయ్ కుమార్, అలీఫజల్, దర్శకుడు ఫర్హాన్ అకర్త్, జోయా అక్తర్, రష్మీ నిగమ్, సోను సూద్, సీనియర్ నటి సుభా ఖోటే కూతురుతో వచ్చి ఓటు వేశారు. అనంతరం సిరా గుర్తును మీడియాకు చూపించారు. నటులు మాధురీ దీక్షిత్, రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ, అర్జున్ కపూర్, ప్రేమ్ చోప్రా, సింగర్ కైలాశ్ ఖేర్, సునీల్ శెట్టి, రితేశ్ దేశ్‌ముఖ్, జెనీలియా, సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్ ఖాన్, పూనమ్ దిల్లాన్, జునైద్ ఖాన్, జావెద్ అక్తర్, మనీశ్ మల్హోత్రా, సింగర్ శంకర్ మహదేవన్, డైరెక్టర్ రోహిత్ శెట్టి తదితరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.





యూపీ ఉప ఎన్నికల్లో ఓటేసేందుకు వెళ్తున్న మహిళలపై ఖాకీల అరాచకం



నరేందర్‌రెడ్డిని తీవ్రవాదిగా భావించారా?

- పోలీసులను ప్రశ్నించిన హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్‌ఎస్ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన విధానాన్ని హైకోర్టు తప్పు పట్టింది. పట్నం పరారీలో లేనప్పుడు, హైదరాబాద్ కేబీఆర్ పార్కులో వాకింగ్ చేసే సమయంలో అరెస్టు చేయాల్సిన అవసరమేముందని ప్రశ్నించింది. ఉగ్రవాదిగా భావించి ఆవిధంగా చేశారా అంటూ నిలదీసింది. ఇంటి దగ్గరే అరెస్టు చేశామని పీపీ చెప్పడాన్ని తప్పుపట్టింది. నిజంగానే పట్నాన్ని ఇంటి దగ్గరే అరెస్టు చేసుంటే, సమాచారాన్ని ఇంట్లోని భార్య లేదా ఇతర కుటుంబ సభ్యులకు ఇవ్వాలి కదాని ప్రశ్నించింది. మూడో వ్యక్తి సలీమ్ అనే వ్యక్తికి సమాచారాన్ని ఎలా ఇస్తారని పేర్కొంది. కాల్‌డేటాను పరిశీలిస్తే ఒకటి రెండు ఫోన్ కాల్స్‌తో కుట్ర నేరాన్ని ఎలా ఆపాదిస్తారంది. రైతుల దాడిలో అధికారుల గాయాలకు సంబంధించి డాక్టర్లు ఇచ్చిన నివేదికలోనూ ఎన్నో అనుమానాలు ఉన్నాయంది. దీనిపై పూర్తి వివరాలను అందజేయాలని జస్టిస్ లక్ష్మణ్ బుధవారం ఆదేశించారు. విచారణ గురువారం కొనసాగిస్తామన్నారు. వికారాబాద్ జిల్లా. లగచర్లలో అధికారులపై రైతుల దాడి సంఘటనలో ప్రథమ నిందితుడిగా ఉన్న పట్నం నరేందర్‌రెడ్డిని రిమాండ్‌కు పంపాలని కొడంగల్ కోర్టు ఆదేశించడాన్ని ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. ఒక దశలో తీర్పును వాయిదా వేస్తున్నట్టు న్యాయమూర్తి ప్రకటించారు. అయితే, పీపీ కల్పించుకుని పలు ఆధారాలతో అఫిడవిట్ వేస్తామని చెప్పడంతో విచారణ గురువారానికి వాయిదా పడింది.

పోలీసులపై ధిక్కరణ పిటిషన్

పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేసేటప్పుడు డీకే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను అమలు చేయలేదంటూ ఆయన భార్య పట్నం శ్రుతి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. ప్రతివాదులుగా ఐజీపీ వి.సత్య నారాయణ, వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి, బొమ్మరాస్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్‌లను చేర్చారు. వీరిపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. నరేందర్‌ను అరెస్టు చేసే ముందుకు తనకు సమాచారం కూడా ఇవ్వలేదన్నారు.

రైతుల కోసం వందసార్లైనా జైలుకెళ్తా

రైతుల కోసం వందసార్లు అయిన జైలుకెళ్తానని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 11న వికారాబాద్ జిల్లా దుద్యాల మండల పరిధిలోని లగచర్లలో జరిగిన దాడి కేసులో 14 రోజుల పాటు రిమాండులో ఉన్న పట్నం నరేందర్‌రెడ్డిని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరుతూ బుధవారం కొడంగల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కొడంగల్ కోర్టులో నరేందర్‌రెడ్డి తరపు న్యాయవాదులు, పోలీసుల మధ్య వాదనలు విన్న న్యాయస్థానం కస్టడీ పిటిషన్‌ను ఈ నెల 22కు వాయిదా వేసింది.

పర్మిషన్ లేకుండానే నిర్మించిన గచ్చిబౌలిలో ఒరిగిన భవనం

- బయటపడిన టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం
- ఆ చుట్టుపక్కల ఉన్న భవనాలన్నీ పర్మిషన్ లేనివే



నవతెలంగాణ-మియాపూర్

రంగారెడ్డి జిల్లా కొండాపూర్ డివిజన్ సిద్దిక్‌నగర్‌లో కుంగిన భవనం వెనుక టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యం బయటపడింది. ప్రస్తుతం ఒరిగిన భవనంతో పాటు.. ఆ చుట్టు పక్కల ఉన్న భవనాలు అన్నింటినీ పర్మిషన్ లేకుం డా నిర్మించినవే అని తేలింది. 50 నుంచి 100 గజాల్లోపు ఉన్న చిన్న స్థలా ల్లో భవన యజమాను లు 4,5 అంతస్తుల నిర్మాణం చేపట్టారు. నిర్మాణ సమయంలో ముడుపులు అందుకుని సైలెంట్ అయినట్టు తెలుస్తోంది. భవన యజమానులు ఒక్కో అంతస్తుకు అనుమతి తీసుకుని నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఒరిగిన భవనం సమీపంలో ఇదే తరహాలో మరి కొన్ని భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. సంబంధిత అధికారులు ఈ అంశాలపై స్పందించడానికి మొహం చాటేస్తున్నారు.

మరోవైపు మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో గచ్చిబౌలి జోనల్ మున్సిపల్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. సిద్ధిక్ నగర్‌లో 150 గజాల స్థలంలో పిల్లర్లు తవ్విన యజమాని, బిల్డర్‌పై మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. 50 గజాల స్థలంలో 5అంతస్తుల భవనం నిర్మించిన యజమానిపై పూర్తి దర్యాప్తు చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, గచ్చిబౌలి, మాదాపూర్ సిద్ధిక్‌నగర్‌లో 5 అంతస్తుల భవనం ఓవైపునకు ఒరిగిన విషయం తెలిసిందే.

ఈ భవనాన్ని కూల్చివేశారు. మంగళవారం రాత్రి 8:10 నిమిషాలకు పెద్ద శబ్దంతో 60 గజాల స్థలంలో ఒరిగింది. సరైన నిర్మాణ ప్రమాణాలు పాటించకుండా ఇంటి నిర్మాణ కోసం పక్కకే 150 గజాల స్థలంలో పిల్లర్ పుట్టింగ్ కోసం పెద్ద గుంత తవ్వడంతో ఈ భవనం కుంగినట్టు అధికారులు చెబుతున్నారు. హైడ్రా అధికారులు. కుంగిన భవనం చుట్టుపక్కల ఉన్న ఇండ్లలోని నివాసితులను ఖాళీ చేయించారు. జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ ట్రాఫిక్, విద్యుత్, అంబులెన్స్, లా అండ్ ఆర్డర్ పోలీసులు ఘటనా స్థలంలో పరిస్థితులను పర్యవేక్షిస్తూ భవనం కూల్చే పనిలో నిమగ్నమయ్యారు.

వేగంగా హైదరాబాద్ రియాల్టీ వృద్ధి

- క్రెడాయ్ వెల్లడి





నవతెలంగాణ - బిజినెస్ బ్యూరో

తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఒక్క ఏడాదిలోనే పెట్టుబడులను ఆకర్షించడం, ఉద్యోగాల కల్పన, మౌలిక సదుపాయాల విస్తరణ, వేగంగా అభివృద్ధిని సాధిస్తోందని క్రెడాయ్ తెలిపింది. రియల్ ఎస్టేట్ డెవలపర్ల సంస్థ కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) హైదరాబాద్ అధ్యక్షులు వి రాజశేఖర్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బి జగన్నాథ రావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గడిచిన పండుగల సీజన్‌లోనూ కొనుగోళ్ల ఎంక్వైరీలు పెరిగాయని వారు తెలిపారు. ఇటీవలి మెర్సర్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ సర్వే ప్రకారం.. దేశంలోనే హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ఒకటిగా కొనసాగుతోందన్నారు. ఈ నగరం అత్యంత నివాసయోగ్యమైందన్నారు. 'బ్రాండ్ హైదరాబాద్'ను ప్రోత్సహించడానికి రాష్ట్రంలోని ప్రభుత్వాలు దశాబ్దాలుగా చేసిన ప్రయత్నాల ఫలితంగా ఈ గుర్తింపు లభించిందన్నారు. దీంతో ఐటీ, ఫార్మా తయారీ, సేవల రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా నిలిచిందన్నారు. యువత నైపుణ్యాభివృద్ధికి క్రమబద్ధమైన విధానాన్ని రూపొందించడంలో ఇది సహాయపడిందన్నారు. కొత్త ప్రభుత్వం ప్రకటించిన ఫ్యూచర్ సిటీ వల్ల భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందనుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం 'బ్రాండ్ హైదరాబాద్'ను మరింత ఉన్నతీకరించడానికి చురుకుగా పని చేస్తోందని ప్రశంసించారు. ప్రపంచంలోనే మోడల్ సిటీగా మారడానికి తాము ప్రభుత్వంతో కలిసి పని చేస్తామన్నారు.

బీఆర్ఎస్ జాడలోనే కాంగ్రెస్..!

- 2013 భూ సేకరణ చట్ట సవరణతో నష్టపోతున్న రైతులు
- ఎన్నికల ముందు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేస్తామన్న కాంగ్రెస్
- కొడంగల్‌లో 2017 సవరణ చట్టాన్నే అమలు చేస్తున్న వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వాలు చట్టాలను తమకు అనుకులంగా మార్చుకుంటూ సామాన్యుల పొట్టగొట్టడం పరిపాటుగా మారింది. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టానికి సవరణ చేస్తూ 2017 భూ సేకరణ చట్టాన్ని తీసుకువచ్చింది. భూ సేకరణ విషయంలో రైతుల భాగస్వామ్యాన్ని తగ్గిస్తూ సవరణ చేసింది. 2013 భూ సేకరణ చట్టంలోని జీవనాడి అయిన సెక్షన్లకు మినహాయింపు ఇస్తూ భూ సేకరణ చేపట్టడాన్ని ఆనాడు రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. ఉద్యమించారు. రైతులకు సీపీఐ(ఎం), వామపక్షపార్టీలు అండగా నిలిచాయి. ఆందోళనలకు మద్దతు ఇచ్చాయి. మల్లన్నసాగర్, తదితర ప్రాజెక్టులకు గత ప్రభుత్వం బలవంతంగా భూములను సేకరించిన విషయం తెలిసిందే. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ గత ప్రభుత్వ తీరును తీవ్రంగా వ్యతిరేకించింది. తాము అధికారంలోకి వస్తే 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తరువాత బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొడంగల్‌లో ఫార్మా విలేజ్‌కి భూ సేకరణ కోసం హామీని విస్మరించిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

మా భూములు బలవంతంగా లాక్కోవాలని చూస్తుండ్రు..

ఫార్మా విలేజ్ కోసం గుర్తించిన భూములకు సంబంధిన రైతులకు ఏడాది పంట రుణాలు ఇవ్వలేదు. రోటిబండతండా, పులిచింతకుంట తండా, హకీంపేట, పోలేపల్లి, లగచర్ల రైతులకు పంట రుణాలు ఇవ్వొద్దు అని అధికారులు బ్యాంక్ అధికారులు ఆదేశాలిచ్చినట్టు తెలిసింది. 'మా భూములకు పంట రుణాలు ఇవ్వకుండా ప్రభుత్వం అడ్డుకుంది. మా జాగాలు మా దగ్గరనే ఉన్నాయి. ప్రభుత్వానికి ఇస్తామని కూడా చెప్పలేదు. ప్రభుత్వం మాకు ఎలాంటి సహకారం అందకుండా అడ్డుకుంటుంది. మా తోటి ఎలాంటి చర్చలు జరపకుండనే బ్యాంక్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి పంట రుణాలు ఇవ్వకుండా చేశారు.' అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యధికంగా భూ సేకరణ చేపట్టింది ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే. ఫార్మాసిటీ పేరుతో గత ప్రభుత్వం యాచారం, కందుకూరు మండలాల్లో సుమారు 19,333 ఎకరాల భూమిని సేకరించింది. ఇందులో సుమారు 13,500 ఎకరాలకు పరిహారం చెల్లింపులు పూర్తి చేసింది. ఆ భూములను ప్రభుత్వం అధీనంలోకి తీసుకోగా.. మరో 5,833 ఎకరాల భూములకు సంబంధించిన కేసు కోర్టులో ఉంది. ఇదిలా ఉండగా వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలంలో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు 1,340 ఎకరాల భూ సేకరణకు ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా భూ సేకరణ చేపడుతున్నట్టు ప్రభుత్వం తెలిపింది. అయితే ఈ క్రమంలో ఆ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులు, రైతు కూలీలు, సబ్బడ వర్గాలకు పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఇందులో భాగంగానే నాటి యూపీఏ ప్రభుత్వం 2013లో భూ సేకరణ చట్టం తీసుకువచ్చింది. ఈ చట్టంలో భూ సేకరణ విధివిధానాలు స్పష్టం చేసింది. బహుళ పంటలు సాగు అయ్యే భూములను రైతుల నుంచి స్వాధీనం చేసుకోవద్దని చట్టంలో పేర్కొంది. ఆ భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రతి కుటుంబానికీ పునరావాసం కల్పించాలని చెప్పింది. పరిహారం విషయంలో కూడా మార్కెట్ ధరకు మూడింతలు ఇవ్వాలని 2013 భూ సేకరణ చట్టం స్పష్టంగా చెబుతోంది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2013 భూ సేకరణ చట్టాన్ని సవరణ చేస్తూ 2017 భూ సేకరణ చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టాన్ని తమకు అనుకులంగా మార్చుకుని రాష్ట్రంలో భూ సేకరణ చేపట్టింది. ప్రభుత్వ నిర్ణయంతో పెద్ద ఎత్తున రైతులు నష్టపోయారు.

అటకెక్కిన హామీ..

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలో ఉన్న ప్రభుత్వం చేసిన చట్టాన్ని వ్యతిరేకించి కాంగ్రెస్ నాయకులు.. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ చట్టాన్ని కొనసాగించడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రయోజనలు ఏమైనా పర్వాలేదు.. తమ పాలనకు ఆటంకాలు లేకుంటే సరి అన్నట్టుగా ప్రభుత్వాలు వ్యవహరించడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో 2017 చట్టాన్ని రద్దు చేస్తామని చెప్పి.. ఇప్పుడు అదే చట్టాన్ని అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వికారాబాద్ జిల్లాలోని దుద్యాల మండలంలో ఫార్మాసిటీకి భూ సేకరణ విషయంలో రైతులకు 2017 భూ సేకరణ చట్టం ప్రకారం నోటీసులు జారీ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద వైఖరికి నిదర్శనం. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేసి 2013 చట్టాన్ని అమలు చేయాలని రైతుల, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఒత్తిడి తెస్తున్నారు..

ఆరు నెలలుగా మా భూములు తీసుకోవొద్దు అని అధికారుల చుట్టూ, రాజకీయ నాయకులు చుట్టూ తిరిగినాం. అయిన ఎవరూ పట్టించుకోవడం లేదు. మీ భూములు ఇవ్వాల్సిందేనని మాపై ఒత్తిడి పెంచుతున్నారు. బ్యాంకుల నుంచి లోన్లు ఇవ్వకుండా చేసింద్రు. రాత్రికి రాత్రే పెద్ద మనుషులు వచ్చి ఏదేదో చెబుతున్నారు. ఎట్లాగైనా మమ్మల్ని ఇక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు సర్కారు కంకణం కట్టుకుంది.



- బాల్యా నాయక్, రొటిబండ తండా రైతు



మత్స్యకార్మికుల వృత్తికి రక్షణ కల్పించాలి

- టీఎమ్‌కేఎమ్‌కేఎస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మత్స్యకార్మికుల వృత్తికి రక్షణ, జీవిత భద్రత కల్పించాలనే డిమాండ్‌తో చేపట్టబోతున్న లక్ష సంతకాల సేకరణ ఉద్యమాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. బుధవారం హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో గల మత్స్య శాఖ రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొరెంకల నరసింహ, లెల్లెల బాలకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా అఖిల భారత మత్స్యకారులు, మత్స్య కార్మిక సమాఖ్య పిలుపు మేరకు గురువారం తెలంగాణలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మత్స్యకారుల వృత్తి రక్షణకు చట్టాలు ఏర్పాటు చేయాలనీ, వారి జీవిత భద్రతకు రూ.10 లక్షలు, సహజ మరణాలకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ స్థలాలు, అడవులు, కంటోన్మెంట్ ఏరియాల్లోని జలవనరుల్లో చేపల వేట హక్కు మత్స్యకారుల సొసైటీలకు ఇవ్వాలని కోరారు. నాబార్డు, ఎన్సీడీసీ, ఎన్ఎఫ్డీపీల ద్వారా మత్స్య సొసైటీలకు ఇచ్చే రుణాలను పునరుద్ధరించి, సహకార సంఘాలను బలోపేతం చేయాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి కొప్పు పద్మ మాట్లాడుతూ ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రసాద్ ఐమాక్స్ వద్ద ఫిష్ ఫుడ్ కోర్టును నాలుగు రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. నగర ప్రజలు ఆ కోర్టును సందర్శించి మత్స్యకారులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గాండ్ల అమరావతి, రాష్ట్ర నాయకులు కాడబోయిన అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీ కాదు.. ఇండస్ట్రియల్ ఫార్మా

- లగచర్ల ఘటనకు దర్శకుడు కేటీఆర్
- రైతుల ముసుగులో ప్రయివేటు గుండాలు :

విలేకరుల సమావేశంలో ఎంపీ మల్లు రవి, తెలంగాణ గిరిజన డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) తేజావత్ బెల్లయ్య నాయక్, వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మెన్లు కోదండ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



నవతెలంగాణ-కొడంగల్

ఫార్మా కాదు ఇండస్ట్రియల్ ఫార్మా ఏర్పాటు చేస్తారని, లగచర్ల ఘటనకు దర్శకుడు మాజీ మంత్రి కేటీఆర్ అని ఎంపీ మల్లు రవి, తెలంగాణ గిరిజన డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) తేజావత్ బెల్లయ్య నాయక్, వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కొడంగల్‌లోని రేవంత్‌రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లగచర్ల ఘటనలో బీఆర్ఎస్ నాయకులు ప్రణాళిక బద్ధంగా రైతుల ముసుగులో ప్రయివేటు గుండాలు కలెక్టర్‌తో పాటు అధికార యంత్రాంగంపై దాడి చేశారని ఆరోపించారు. లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటి బాండతాండ, పులిచర్లకుంట తండా గ్రామాలకు అందుబాటులో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం నిర్వహిస్తే సభకు రైతులను రాకుండా బీఆర్ఎస్ నాయకులు అడ్డుకుని సురేష్ అనే వ్యక్తిని అక్కడికి పంపారని అన్నారు. రైతులందరూ లగచర్ల గ్రామంలోనే ఉన్నారని కలెక్టర్‌కు సురేష్ తెలపడంతో అక్కడికి అధికారులు వెళ్లిన వెంటనే దాడి చేశారంటే బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, నరేందర్ రెడ్డి ప్రణాళికతోనే జరిగిందన్నారు. భూ సేకరణ ప్రాథమిక స్థాయిలోనే ఉండగా బీఆర్ఎస్ నాయకులు ఫార్మాసిటీ పెడుతున్నారని ప్రచారం చేసి అక్కడ రైతులను గందరగోళానికి గురి చేశారని తెలిపారు. రెడ్ ఫార్మా కాదని.. గ్రీన్ ఫార్మా ఏర్పాటు చేస్తామని, దానివల్ల ఎలాంటి నష్టం ఉండదని అన్నారు. అవసరం ఉన్న దగ్గర ప్రజలకు అవసరమైన పరిశ్రమలు నెలకొల్పాలనే ఉద్దేశంతోనే ఇండస్ట్రియల్ కారిడార్‌గా కొడంగల్ ఎదిగేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఆయా గ్రామాల్లో అసైన్డ్ భూమి ఎక్కువ ఉందని, పట్టా భూమి తక్కువ తీసుకుంటున్నారని అన్నారు. రైతులు అధికారులపై దాడి చేయరని, రైతుల ముసుగులో బీఆర్ఎస్ ప్రయివేటు వ్యక్తులను ఉసిగొల్పిందన్నారు. కలెక్టర్‌ను చంపేందుకు కుట్రపన్నారని, దాంతో ఫైరింగ్ జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతే దేశవ్యాప్తంగా ఆందోళన కొనసాగించి రేవంత్‌రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలన్న ఆలోచనతో బీఆర్ఎస్ కుట్ర పన్నిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుంచి బలవంతంగా భూములు తీసుకోవద్దని, రైతుల ఇష్టంతోనే తీసుకోవాలని సీఎం అధికారులకు చెప్పారని తెలపారు. కొడంగల్ ప్రజలు కేసీఆర్, కేటీఆర్ ట్రాప్‌లో పడొద్దని అన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ చైర్మెన్ వర్ల విజయ్ కుమార్. కాంగ్రెస్ మండల అధ్యక్షులు ప్రశాంత్, దౌల్తాబాద్ మండల అధ్యక్షులు వెంకట్ రావు, బోంరాస్‌పేట్ మండల అధ్యక్షులు నర్సింలు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ అంబయ్య గౌడ్. సింగిల్ విండో చైర్మెన్ జయకృష్ణ, కొడంగల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచులు సంజీవరెడ్డి, బాల్ రెడ్డి, శంకర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు సోమశేఖర్, దాము, రాము, రామచంద్ర రెడ్డి, వెంకట్రాములు గౌడ్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

వికటించిన మధ్యాహ్న భోజనం

(మొదటిపేజీ తరువాయి)

వైద్యులు తెలిపారు. మరికొంత మందికి పాఠశాల వద్దే వైద్యుల సమక్షంలో చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రులకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన జరిగిన తీరుపై పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులను వివరాలడిగి తెలుసుకున్నారు.

నిర్లక్ష్యంపై సీఎం ఆగ్రహం

విద్యార్థులు అస్వస్థతకు గురి కావడం పట్ల పాఠశాల నిర్వాహకులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ద్వారా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఆయన అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ ఘటనకు బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి నట్టు తేలితే సంబంధిత అధికారులను సస్పెండ్ చేయాలని సీఎం స్పష్టం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన తేల్చి చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే మరింత కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని నారాయణపేట జిల్లా కలెక్టర్, సీఎంవో అధికారులను ఆదేశించారు.

పరిశ్రమలకు పేదల భూములే ఎందుకు ?

టీజీఎస్ ప్రశ్న

- నాయకుల నిర్బంధం, అరెస్ట్‌కు ఖండన

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఫార్మా కంపెనీల పేరుతో దళితులు, గిరిజనులు, పేదల భూములనే ఎందుకు సేకరించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ ప్రశ్నించింది. బలవంతపు భూసేకరణను వ్యతిరేకిస్తూ లగచర్లలో మంగళవారం ఆందోళన నిర్వహించిన తెలంగాణ గిరిజన సంఘం నాయకులు, కార్యకర్తలపై పోలీసులు నిర్బంధం ప్రయోగించడాన్ని ఖండించింది.

అలాగే బుధవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో నాయకులను అర్ధరాత్రి నుంచి అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడాన్ని టీజీఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మనాయక్, ఆర్ శ్రీరాంనాయక్ తీవ్రంగా ఖండించారు. అరెస్టయిన వారిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అభివృద్ధి కొరకు పరిశ్రమలకు భూముల కోసం తప్పనిసరిగా భూసేకరణ చేయాల్సి ఉంటుందనీ, ఇందులో ఎవరో ఒకరు నష్టపోవాల్సి వస్తుందని సీఎం మాట్లాడటాన్ని గుర్తు చేశారు. కానీ అభివృద్ధి పేరుతో కేవలం దళితులు, గిరిజనులు, పేదల భూములనే గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వమూ ఎందుకు సేకరిస్తున్నదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూస్వాములు, ధనవంతులకు వేలాది ఎకరాలు ఉన్నా, వారి భూములను సేకరించకుండా కేవలం అరెకరం, ఎకరం భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్న పేదల భూములను తీసుకోవడాన్ని తప్పుబట్టారు. ఎక్కడ ప్రాజెక్టులు కట్టినా, కాలువలు తవ్వినా, పరిశ్రమలకు భూములు ఇచ్చినా పేదలే సమిధలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొడంగల్‌లో ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీల కారిడార్‌కు గిరిజనులు, దళితులు, పేదల భూములనే సేకరించడాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు.

లగచర్ల చుట్టు పక్కల ఎనిమిది తండాలు, గ్రామాల్లో తరతరాలుగా దళితులు, గిరిజనులు అసైన్డ్ భూములను సాగు చేస్తూ జీవిస్తున్నారని గుర్తుచేశారు. ఆ భూముల ను ప్రభుత్వ భూములనే పేరుతో బలవంతంగా లాక్కోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఫార్మా బాధితులకు సామాజిక, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం భూసేకరణకు పూనుకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తా మని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

'కురుమూర్తి'పై ఒట్టు పెట్టి మాట తప్పిండు



నవతెలంగాణ-మదనాపురం

సగం మందికి రుణమాఫీ కాలేదు :మాజీమంత్రి హరీశ్‌రావు

హామీల అమలుపై కురుమూర్తి దేవునిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒట్టు పెట్టి మాట తప్పారని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లాలోని కురుమూర్తి ఆలయాన్ని సందర్శించిన ఆయన స్వామివారి దర్శనం చేసుకున్నారు. అనంతరం మదనాపురం మండలం నెల్విడి గ్రామ సమీపంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో హామీలిచ్చి ఆ తర్వాత పథకాలను ఎక్కడికక్కడా పడుకోబెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని విమర్శించారు. వరంగల్ మీటింగ్‌లో తిట్ల పురాణం తప్ప ప్రజలకు, మహిళలకు పనికొచ్చే ఒక్కమాట కూడా సీఎం రేవంత్‌రెడ్డి చెప్పలేదని అన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులతో విసిగిపోయిన రైతులు సన్నవడ్లను కూడా బయట వ్యాపారులకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రైతులు తల్లడిల్లుతూ ఉంటే వడ్లను ఎండబెట్టి.. క్లీన్ చేయాలని చెప్పడం సరికాదన్నారు. సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని చెప్పారు. మాజీ సీఎం కేసీఆర్‌కు.. రేవంత్‌రెడ్డికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ వేద రజిని సాయిచంద్, మాజీ జెడ్పీటీసీ కృష్ణయ్య యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శ్రావణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

జాతీయ రహదారుల నిర్మాణంలో వేగం పెంచండి

సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో జాతీయ రహదారుల నిర్మాణాల గురించి పట్టించుకోక పోవడంతో అభివృద్ధి కుంటుపడిందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీశాఖామాత్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయంలో రహదారులపై ఎన్‌హెచ్ఏఐ, ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష చేశారు. విజయవాడ- నాగ్‌పూర్ సెక్షన్ (ఎన్.హెచ్.-163జీ) కి సంబంధించి నాలుగు వరుసలుగా నిర్మిస్తున్న ఎన్.హెచ్.-163జీ గ్రీన్ ఫీల్డ్ రహదారికి సంబంధించి 8 ప్యాకేజీలు అవార్డు అయ్యాయని మంత్రి చెప్పారు. 300 కిలోమీటర్లున్న ఈ రహదారిని మెగా ఇంజినీరింగ్ సంస్థ నిర్మిస్తున్నదన్నారు. భూసేకరణలో ఎదురవుతున్న ఇబ్బందుల దష్ట్యా నిర్మాణ సంస్థ పనులు చేయడంలో జాప్యం జరుగుతోందని ఎన్‌హెచ్ఏఐ ఆర్ఓ శివశంకర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు మంత్రి దష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మంత్రి మెగా సంస్థ యాజమాన్యంతో మాట్లాడి భూసేకరణకు ఇబ్బందులు లేనిచోట, ఇప్పటికే భూసేకరణ చేసిన ప్రాంతాల్లో పనులు మొదలు పెట్టాలని చెప్పారు. త్వరలోనే మంచిర్యాల, వరంగల్, ఖమ్మం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి భూసేకరణను వేగవంతం చేసేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ - డిండి (ఎన్.హెచ్. 765) కి సంబంధించి 85 కిలోమీటర్లున్న రహదారి పనుల అలైన్‌మెంట్ కాపీని అధికారులు మంత్రికి సమర్పించారు. రెండు వరుసల నుంచి నాలుగు వరుసలకు అప్‌గ్రేడ్ చేస్తున్న ఈ బ్రౌన్ ఫీల్డ్ రహదారిపై ఒకటి రెండ్రోజుల్లో ముఖ్యమంత్రితో సమావేశం ఏర్పాటు చేసి అలైన్‌మెంట్‌ను ఖరారు చేస్తామన్నారు. వెంటనే డీపీఆర్ సిద్ధం చేసి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఖమ్మం - దేవరపల్లి (ఎన్.హెచ్.365జీజీ) గ్రీన్ ఫీల్డ్ రహదారికి సంబంధించి నాలుగు వరుసలుగా నిర్మిస్తున్న రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను ప్రతీరోజు పరీక్షించాలని చెప్పారు. ఏదైనా నాణ్యతాలోపం ఉంటే సంబంధిత సంస్థపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. 90 కిలోమీటర్లున్న ఈ రహదారి పనులు ఇప్పటికే 60 శాతం నుంచి 70 శాతం పూర్తయ్యాయని మంత్రికి వివరించిన అధికారులు.. అందుకు సంబంధించిన ఫొటోలనూ చూపించారు. 2025 మే లేదా జూన్ కల్లా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులకు తేల్చిచెప్పారు. ఆరు వరుసలుగా నిర్మిస్తున్న.. కర్నూల్ - రాయచూర్ (ఎన్.హెచ్-150సీ) గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులు రెండు ప్యాకేజీలుగా జరుగుతున్నాయన్నారు. ఇందులో ఒక ప్యాకేజీ 38 కిలోమీటర్లు కాగా మరో ప్యాకేజీ 38 కిలోమీటర్లుగా ఉందని చెప్పారు. మొదటి ప్యాకేజీ పనులు వచ్చే టన్నెల్ల వంటి నిర్మాణాలు ఉన్నాయనీ, ఈ పనులు 2025 డిసెంబర్ కల్లా పూర్తవుతాయని వివరించారు. ఇక హైదరాబాద్ మన్నెగూడ జాతీయ రహదారి పనులకు సంబంధించిన రివ్యూలో.. కొంత బ్రౌన్ ఫీల్డ్, మరికొంత గ్రీన్‌ఫీల్డ్‌గా 45 కిలోమీటర్ల పొడవుతో నిర్మిస్తున్న హైదరాబాద్ - మన్నెగూడ (ఎన్.హెచ్-163) రహదారి పనులు అవార్డు అయ్యాయనీ, 15 రోజుల క్రితం పనులు ప్రారంభించిన విషయం మంత్రి దష్టికి తీసుకువచ్చారు. రెండు వరుసల నుంచి నాలుగు వరుసలుగా అప్‌గ్రేడ్ చేస్తున్న ఈ రహదారిపై అనేక ప్రమాదాలు జరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనీ, పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్- నాగ్‌పూర్ (ఎన్.హెచ్ 44)కు సంబంధించిన పనుల పురోగతిపై అధికారులను ఆరా తీసిన మంత్రి 17 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లున్న రెండు ప్యాకేజీల గురించి, హైదరాబాద్-బెంగళూర్ (ఎన్.హెచ్ 44) జాతీయ రహదారి పరిధిలో 12 కిలోమీటర్లున్న మూడో ప్యాకేజీ పనులు ఎక్కడి వరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ - విజయవాడ (ఎన్.హెచ్-65) పై బ్లాక్ స్పాట్ల పనులు జరుగుతున్నాయనీ, వాటిని పూర్తి చేయడానికి ఇంకా రెండు సంవత్సరాల కాలపరిమితి ఉందని అధికారులు మంత్రి దష్టికి తీసుకురాగా రోజు పదుల సంఖ్యలో ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు.



పెండింగ్ గౌరవ వేతనాలు విడుదల చేయాలి

- గుడ్ల బిల్లులు ఇప్పించేలా చూడండి
- ఎన్నికల హామీ మేరకు రూ.10 వేలివ్వాలి :

విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్యకు తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ వినతి


నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలనీ, గుడ్ల బిల్లులు చెల్లించేలా చూడాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం ఈ మేరకు హైదరాబాద్‌లోని పాఠశాల విద్యా శాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ లింగయ్యకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వై.స్వప్న, ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ, ఉపాధ్యక్షులు జి.పద్మ, కార్యదర్శి సత్య నారాయణ, రాష్ట్ర కమిటీ సభ్యులు రాణి, సీహెచ్ లక్ష్మి వినతిపత్రం అందజేశారు. నెలల తరబడి మధ్యాహ్న భోజన పథకం బిల్లులు రాకపోవడంతో కార్మికులు అప్పులు చేసి మరీ పిల్లలకు వండిపెడుతున్న విషయాన్ని అడిషనల్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పెరిగిన వేతనం కొన్ని జిల్లాల్లో, కొన్ని మండలాల్లో మాత్రమే ఇచ్చారని ప్రస్తావించారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు రెండు గుడ్లకే సరిపోవడం లేదు మూడో గుడ్డు ఎలా పెట్టాలి? రాగిజావా ఎలా పోయాలి? అని ప్రశ్నించారు. గుడ్లకు అదనపు బడ్జెట్ కేటాయించాలనీ, లేనిపక్షంలో అంగన్‌వాడీ కేంద్రాలకు చేస్తున్నట్టుగానే పాఠశాలలకు గుడ్లను సరఫరా చేయాలని కోరారు. లేకుంటే డిసెంబర్ ఒకటో తేదీ నుంచి గుడ్లను బంద్ పెడతామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీకి ఇవ్వాలని విన్నవించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు పదివేల రూపాయల గౌరవ వేతనాన్ని వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెరిగిన ధరలకనుగుణంగా పిల్లలికిచ్చే మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కాటన్ బట్టల యూనిఫామ్ ఇవ్వాలనీ, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వరాదని విజ్ఞప్తి చేశారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలనీ, షరతుల్లేకుండా బ్యాంక్ ద్వారా రుణాలివ్వాలని కోరారు. పబ్లిక్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (పిఎఫ్ఎంఎస్) ద్వారా బిల్లులు, జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అడిషనల్ డైరెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ గుడ్ల బిల్లులు పెంచడానికి ప్రభుత్వానికి ప్రపోజల్ పంపామని, 1-5 క్లాసుల బిల్లులు క్లియర్ చేశామని తెలిపారని చెప్పారు. మిగతా వాటిని కూడా వీలైనంత త్వరగా పరిష్కారం చేస్తామని హామీనిచ్చారన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- రైతులు సన్న రకం వరి సాగు చేయాలి :

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్.చౌహన్



నవతెలంగాణ - చిగురుమామిడి / చొప్పదండి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డిఎస్.చౌహాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కేంద్రంలో, చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. వరి ధాన్యం కుప్పల మ్యాచర్ శాతాన్ని పరిశీలించి, రైతులు పూర్తిగా ఎండిన తర్వాతే పంటను కోస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. సన్న వడ్లు పండించే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని చెప్పారు. సన్నాలను సాగు చేయడం ద్వారా రైతులు అధిక లబ్ది పొందుతారని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సమర్థవంతంగా నడుపుతున్న చిగురుమామిడి కొనుగోలు కేంద్రం కమిటీ సభ్యులను కమిషనర్ అభినందించి వారిని శాలువాలతో సత్కరించారు. ఆయన వెంట కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్, జిల్లా సహకార అధికారి రామానుజాచార్యులు, డీఎస్ఓ నర్సింగరావు, డీఎం సివిల్ సప్లై రజనీకాంత్ తదితరులు ఉన్నారు.

షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-మలక్‌పేట్

మలక్‌పేట్ నియోజకవర్గంలోని 75 మంది లబ్ధిదారులకు షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే అబ్దుల్ బలాల పంపిణీ చేశారు. చార్మినార్ పంజేషాలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే.. సైదాబాద్ మండలం మలక్‌పేట్ పరిధిలోని 50 మందికి షాదీముబారక్, 20 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అర్హులైన పేదలు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'హయత్ నగర్ 1 డిపోకు అవార్డుల పంట'



నవతెలంగాణ-హయత్‌నగర్

హైదరాబాద్ రీజినల్ ఉత్తమ ఉద్యోగుల అభినందనలో హయత్ నగర్1 డిపోకు చెందిన 4గురు ఉద్యోగులకు త్రైమాసిక ప్రగతి చక్ర అవార్డ్స్ వచ్చాయని డిపో మేనేజర్ విజయ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ ఇందన పొదుపు విభాగంలో డ్రైవర్ యాదయ్య, సర్వీస్ కంటే అత్యధిక ఆదాయం సంపాదించినదుకు గాను కండక్టర్లు నాగుర్వాలి, సురేందర్, సైదా చారీలకు రీజినల్ మేనేజర్ వర ప్రసాద్ చేతుల మీదుగా నగదు పురస్కారం, ప్రశాంస పత్రాలు అందజేశారని తెలిపారు.

శివారు ప్రాంతాల్లో

తాగునీటి సౌకర్యం కల్పించే దిశగా పనిచేయాలి



• ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ -ఎల్బీనగర్

శివారు ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్క ఇంటికీ తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థను కల్పించే దిశగా పనిచేయాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో వాటర్ వర్క్స్ అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే 30 సంవత్సరాల వరకు ఎవరికి ఇబ్బందులు లేకుండా ట్రంక్ లైన్ నిర్మాణ పనులు అనుసంధానం చేయాలని అన్నారు. అలాగే ట్రంక్ లైన్స్ నిర్మాణ పనులు చేస్తూ వాటర్ వర్క్స్ సంబంధించిన నిర్మాణాలు కూడా చేయాలని ఆదేశించారు. పనుల్లో ఎలాంటి అలసత్వం చేయొద్దు అని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎల్బీనగర్ సర్కిల్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, డీజీఎం.రాజ్ గోపాల్, మేనేజర్ వాహిణి పాల్గొన్నారు.

సమస్యలపై అధికారులు దృష్టి సారించాలి

• ఎమ్మెల్యే బలాల



నవతెలంగాణ-మలక్‌పేట్

మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే అబ్దుల్ బలాల సూచించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సమస్యలు వంటివి ఉండకూడదని అధికారులను కోరారు. వెలగని వీధిలైట్లు ఉంటే వాటి స్థానంలో కొత్త లైట్లను వెంటనే అమర్చాలని అన్నారు. పలు కాలనీవాసులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ శాఖ అధికారులు, పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బృందావన్ కాలనీలో రాఘవేందర్ రెడ్డి పర్యటన



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 26వ డివిజన్‌లోని బృందావన్ కాలనీలో ఆ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి బుధవారం కాలనీ వాసులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, తదితర సమస్యలను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి దృష్టికి తీసుకువెళ్లి..పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దిండు శ్రీనివాస్ గౌడ్, కాలనీ ప్రెసిడెంట్, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



• ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

నవతెలంగాణ-హయత్‌నగర్

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి అధ్యక్షతన బుధవారం ఎల్బీనగర్‌లో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద కళ్ళకు నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యారంగ పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, వాటి బకాయిలు ఆలస్యం కావడంతో కళాశాలలు బంద్ చేస్తే విద్యార్థులు చదువులు ఎలా కొనసాగుతాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. విద్యార్థులు చదువులకు దూరం అయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కూడా సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, భవన కిరాయిలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులతో కళాశాలలను నిర్వహణ చేయలేమని.. దసరా తర్వాత డిగ్రీ కళాశాలలు నాలుగు రోజులు నిరవధిక బంద్ చేస్తే వారంలో ఫీజు బకాయిలు విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఇప్పటికీ విడుదల చేయలేదని మండిపడ్డారు. ఇచ్చిన మాట తప్పారని, రేపటి నుండి మళ్ళీ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్ నిర్వహిస్తామని, పరీక్షలు బహిష్కరిస్తామని ప్రకటించడంతో దీని ప్రభావం విద్యార్థుల విద్యాసంవత్సర, భవిష్యత్‌పై పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓవైపు అనేక సెలవులు వల్ల ఇప్పుడిప్పుడే అకాడమిక్ తరగతులు సక్రమంగా జరుగుతూ.. కొన్ని యూనివర్సిటీల్లో సెమిస్టర్ పరీక్షల నిర్వహణ ఒకటి రెండు రోజుల్లో జరుగనున్నాయని, కొన్ని యూనివర్సిటీలో పరీక్ష ఫీజుల తేదీలు వచ్చాయని ఇప్పుడు బంద్ చేస్తే విద్యార్థులు చాలా నష్టపోతారని అన్నారు. ప్రభుత్వం ఫీజు బకాయిల పట్ల మొండి వైఖరి వీడాలని కోరారు. రేవంత్ రెడ్డి గారు ఆనాడు ప్రతిపక్ష హోదాలో ఫీజు బకాయిలను తాము అధికారంలోకి రాగానే విడుదల చేస్తామని చెప్పారని.. నేడు అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా పెండింగ్ ఫీజు బకాయిలు ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే విద్యార్థులు చదువులను, వారి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్ గౌడ్, భూక్య వినోద్, రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి చింత వెంకటేష్, హయత్ నగర్ మండల నాయకులు మణికంఠ, ఉపేందర్, భాను ప్రకాష్, శివ, గర్ల్స్ కన్వీనర్ శ్రావణి, పార్వతి, లలిత మెట్టు, నాయకులు చందు, నవీన్ తదితర నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- బడంగ్‌పేట్



రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్‌ల నిధులను వెంటనే విడుదల చేయాలని బీజేపీ మైనార్టీ మోర్చా నాయకుడు ఎండీ నయీమ్ డిమాండ్ చేశారు. నిధులు విడుదల జాప్యంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని పదే పదే చెబుతున్నారని, కానీ ఐదు వేల తొమ్మిది వందల కోట్లకు పైగా బకాయిలను పెండింగ్‌లో ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల పట్ల కక్ష సాధిస్తోందని, వారి జీవితాలతో చెలగాటమాడుతుందని మండిపడ్డారు. విద్యార్థుల తల్లిదండ్రులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారని, సెమిస్టార్ వైజ్‌గా ఫీజు చెల్లిస్తేనే పరీక్ష ఫీజు తీసుకుంటామని కళాశాల యాజమాన్యం విద్యార్థులను వేధిస్తున్నారని తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు గురి చేస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

'పీఎం విశ్వకర్మ యోజన'కు

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి

• బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఆశన్న



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వయం ఉపాధి ప్రాతిపదికన అసంఘటిత రంగంలో చేతులు, పనిముట్లతో పనిచేసే వారు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద ఆర్థిక రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న తెలిపారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో బీసీ కుల సంఘ, ఎన్జీవోస్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఆయన పీఎం విశ్వకర్మ పథకం గురించి, ఎలా దరఖాస్తు చేసుకోవాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు, పనిముట్ల వృత్తిదారుల నుంచి కేంద్ర ప్రభుత్వం పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద ఆర్థిక సహాయం అందించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతుందన్నారు. ఈ పథకం కింద 1లక్ష రుణం 5 శాతం వడ్డీపై ఇస్తుందని, దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇవ్వడం, శిక్షణ కాలంలో స్టయిఫండ్‌తో పాటు సర్టిఫికెట్ ప్రదానం చేస్తారన్నారు. లక్ష రూపాయల రుణం 18 నెలల్లో తిరిగి చెల్లించిన వారికి మళ్లీ రూ.2లక్షల రుణం ఇస్తుందన్నారు. దరఖాస్తుదారులు చేతివృత్తులు, పనిముట్లతో పని చేస్తూ కుటుంబ సాంప్రదాయ వృత్తులలో నిమగ్నమైన హస్త కళాకారుడు లేదా వృత్తి కళాకారులు పీఎం విశ్వకర్మ పథకానికి అర్హులని చెప్పారు.

రిజిస్ట్రేషన్ చేసుకునే నాటికి లబ్ధిదారులు వయస్సు కనీసం 18 ఏండ్లు ఉండాలన్నారు. ఈ పథకం కింద కుటుంబంలో ఒకరికి మాత్రమే రిజిస్ట్రేషన్ పరిమితమని తెలిపారు. అర్హులైన వారు కామన్ సర్వీస్ సెంటర్‌కు లేదా https://pmvishwakarma. gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే ఆఫీసర్ వి. శ్రీరామ్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఇలియజ్ అహ్మద్, జిల్లా సహాయ అభివృద్ధి అధికారులు టి.నరసింహులు, డి.కృష్ణమాచారి, కుమ్మరి సంఘం అధ్యక్షులు ఎం.శివానంద, నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఎం.నరసింహ, రజక సంఘం మాధవి అమ్ముల, సోఫా సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ యెత్తిరి అంతయ్య, వడ్డెర సంఘం అధ్యక్షులు ఆర్చైట్ సంతోష్, ఆరెకటిక అబ్దుల్ అబ్దుల్ ఖాలిక్, బోయ వాల్మీకి సంఘం అధ్యక్షులు ఎమ్మెస్ నరహరి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల అవసరాల దృష్ట్యా 300 ఫీట్ల రోడ్డు

• రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం
• ఫోర్త్ సిటీ మహేశ్వరం నియోజకవర్గ ప్రజల అదృష్టం
• కేఎల్ఆర్



నవతెలంగాణ-బడంగ్‌పేట్

భవిష్యత్ తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఫోర్త్ సిటీలో 300 ఫీట్ల రోడ్డును వేయడం జరుగుతుందని, అక్కడ ఉన్న రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ విపక్షాలు అనవసరంగా రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం, ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో హైదరాబాద్‌లో చిన్న రోడ్డు ఉన్నా సరిపోయేదని, ప్రస్తుతం మహానగరంగా మారటంతో రోడ్లు, డ్రెయినేజీ, ట్రాఫిక్ సమస్య పెరిగి ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఓఆర్ఆర్ వేసేటప్పుడు ఇదే విపక్షాల విమర్శలు... అంతా పెద్ద రోడ్డు ఎందుకని, కానీ నేడు ఓఆర్ఆర్ మీద వెళ్తున్న వాహనాలకు ఆ రింగ్ రోడ్డు కూడా సరిపోయే పరిస్థితి లేదన్నారు. అందుకోసం ఫోర్త్ సిటీకి భవిష్యత్ తరాల అవసరాల దృష్ట్యా 300 ఫీట్ల రోడ్డు వేసి దానిలోని మెట్రో రైలు మార్గం కూడా వేస్తామని వివరించారు. ఈ బృహత్ ప్రణాళిక వల్ల రైతులకు, ఇక్కడి ప్రాంత ప్రజలకు ఎంతో మేలు, లాభం చేకూరుతుందని తెలిపారు. అందుకోసం ఓఆర్ఆర్‌కు ట్రిబుల్ ఆర్ మధ్య ఫోర్త్ సిటీ మరో మహానగరం కానుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతన్నలు అధైర్యపడొద్దని.. సీఎం రేవంత్ రెడ్డి కర్షక ప్రభుత్వంలో ఎలాంటి నష్టం, ఇబ్బందులు ఉండవని భరోసా ఇచ్చారు.

రెడ్డి స్మశాన వాటిక అభివృద్ధికి కృషి

కార్పొరేటర్ రామిడి మాధురి వీరకర్ణా రెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

అల్మాస్‌గూడలోని రెడ్డి స్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ రామిడి మాధురి వీరకర్ణా రెడ్డి తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అల్మాస్‌గూడలోని 3వ డివిజన్‌లో ఉన్న ఉమామహేశ్వర దేవాలయం సమీపంలో గల రెడ్డి స్మశాన వాటికలో షెడ్డు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం రూ.25 లక్షల సాధారణ నిధులతో చేపట్టారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాలుగా డివిజన్ పరిధిలోని ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ సభ్యులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్



పార్టీ అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవ్వారు మల్లారెడ్డి, బోయపల్లి వెంకట్ రెడ్డి, నాయకులు రామిడి శూరకర్ణా రెడ్డి, చప్పిడి జంగారెడ్డి, అయ్యోరుబావి కృష్ణారెడ్డి, యంజాల వెంకటరెడ్డి, జంగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సురేందర్ రెడ్డి కూతురి వివాహంలో

శాసనమండలి చైర్మెన్ సుఖేందర్ రెడ్డి

నవతెలంగాణ- నాగోల్

మన్సూరాబాద్ డివిజన్‌లోని కేబీఆర్ కన్వెన్షన్ హాల్లో కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకులు అనంతుల సురేందర్ రెడ్డి రెండో కూతురు జాన్వీ వివాహం యశ్వంత్ రెడ్డితో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వివాహానికి తెలంగాణ శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, టీపీసీసీ క్యాంపేనింగ్ కమిటీ చైర్మెన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కీ గౌడ్, మదర్ డెయిరీ మాజీ చైర్మెన్ జితేందర్ రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిలు హాజరై నూతన వధూవరులకు ఆశీర్వదించి..శుభాకాంక్షలు తెలియజేశారు.



వాకర్స్‌కు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలి

• మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి





నవతెలంగాణ- బడంగ్‌పేట్

క్రీడా మైదానంలో వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను మేయర్ పారిజాత నర్సింహారెడ్డి ఆదేశించారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ కేంద్రంలో ఉన్న సిరిపురం యాదయ్య క్రీడా మైదానాన్ని మార్నింగ్ వాకింగ్‌లో భాగంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బుధవారం స్థానిక కార్పొరేటర్ సూర్జగంటి అర్జున్‌తో కలిసి పరిశీలించారు. తర్వాత అక్కడి సమస్యలను వాకర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ క్రీడా మైదానంలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులకు సూచించారు. క్రీడా మైదానంను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రతి రోజూ ఉదయం అందరు వాకింగ్ చేయడం వలన ఎంతో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. క్రీడా మైదానంలో వాకర్స్‌కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పి.సరస్వతి, డీఈఈ నర్సింహా రాజు, కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్ళగూడెం శ్రీనివాస్ రెడ్డి, ఏఈ వినీల్ గౌడ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

• ముగిసిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు
• రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయం సంస్థ బడంగ్‌పేట్‌లో చైర్మెన్ ఎలుగంటి మధు సూధన్ రెడ్డి అధ్యక్షతన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమాలల్లో భాగంగా బడంగ్‌పేట్‌లోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 14 నుండి నేటి వరకు నిర్వహించిన వివిధ పోటీలలో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో చదువుకున్న యువతీ యువకులకు గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు చిన్న వయసు నుండే గ్రంథాలయంలో పఠనం చేసే అలవాటు చేసుకోవాలన్నారు. నిరుద్యోగులు గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని ఉద్యోగ పోటీ పరీక్షలలో పాల్గొని ప్రభుత్వ ఉద్యోగం సంపాదించి, జీవితంలో స్థిరపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్, గ్రంథాలయ సంస్థ సభ్యులు, గ్రంథాలయ సిబ్బంది సత్యం, యాదయ్య, జిల్లాలోని వివిధ గ్రంథాలయాల నిర్వాహకులు, స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

27న మామిడిపల్లికి రానున్న సీఎం





నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని మామిడిపల్లి గ్రామానికి ఈ నెల 27 తేదిన శంషాబాద్ విమానాశ్రయం దగ్గరలోని జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో జరగనున్న ఓ వివాహానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరవుతన్న నేపథ్యంలో.. మామిడిపల్లి పరిధిలోని రోడ్లు, పరిసరాలను బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి, కమిషనర్ పి.సరస్వతి పరిశీలించారు. తర్వాత రోడ్లను, పరిసర ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. వారి వెంట కార్పొరేటర్లు శివ కుమార్, యాతం పవన్ కుమార్ యాదవ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీడ్స్ ప్రోగ్రామ్ ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ది గెస్టాల్ట్ బిహేవియర్ ఇంటెలిజెన్స్ ఇనిస్టిట్యూట్ ఎల్ఎల్‌పీ, సాయి సేవాసంగ్ వారి శ్రీ సత్య సాయి విద్యా మందిర్ (అనాథ, నిరుపేద ఆడపిల్లల పాఠశాల) భాగస్వామ్యంతో ఆడపిల్లలో సత్ప్రవర్తనాపరమైన నైపుణ్యాలతో జీవితాల రూపాంతరం తెలిపేందుకు సీడ్స్ ప్రోగ్రామ్‌ను బుధవారం ఘనంగా ప్రారంభించింది. అన్ని వయస్సుల వారిలో అనుకూలత, స్థిరత్వం, భావోద్వేగ సమతౌల్యాన్ని పెంపొందించేందుకు రూపొందించిన ఈ నూతన ప్రవర్తనా నైపుణ్య మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రోగ్రామ్ శ్రీ సత్య సాయి విద్యా మందిరంలో ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా మెరిడియన్ స్కూల్స్ అధ్యక్షురాలు లలితా నాయుడు ఇంజేటి, జి.నారాయణమ్మ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ విద్యారెడ్డి గునంపల్లి హాజరయ్యారు. ఈ ప్రోగ్రామ్‌ను సుశీలా ఓరుగంటి సమర్థవంతంగా నిర్వహించారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం | నవంబర్ 21 , 2024 | www.navatelangana.com

పేదలకు సీఎం సహాయ నిధి వరం

● కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్



నవతెలంగాణ-జవహర్ నగర్

ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు వరం లాంటిదని జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాద వ్ అన్నారు. జవహర్ నగర్ ప్రాంతానికి చెందిన మహమ్మద్ రిజ్వాన బేగం - యూసుఫ్ అనారోగ్యంతో బాధపడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారికి సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.60వేల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ..పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మాట్లా వినయ్ కుమార్, నాయకులు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ-కీసర

లారీ ఢీకొని వ్యక్తి మృతి మృతిచెందిన సంఘటన బుధవారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కీసర సీఐ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం... కీసర ఔటర్ రింగ్ రోడ్డు ఎక్సిట్ 8 రోడ్డు వద్దనాగారం మున్సిపాలిటీ ,రాంపల్లి గ్రామానికి చెందిన వారిమాట్ల ఏలేంద్ర (35) ఎలక్ట్రిక్ స్కూటీ పైన వెళ్తుండగా లారీ వెనుక నుండి అతివేగంగా వచ్చి స్కూటీకి ఢీకొట్టింది. దీంతో లారీ అతడి పైనుండి వెళ్లడంతో రెండు కాళ్లకు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న కీసర పోలీస్ లు సంఘటన స్థలాన్నికి వెళ్లి క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించగా డాక్టర్లు పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కీసర సీఐ వెంకటయ్య తెలిపారు.

పేదరికం శాపం కాదు..మట్టిలోనే మాణిక్యాలు



● పిల్లలకు తల్లి, తండ్రి లేని లోటు కనిపించొద్దు
● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

నవతెలంగాణ-జవహర్ నగర్

పేదరికం శాపం కాదని, మట్టిలో నుండే మాణిక్యాలు పుట్టుకొస్తారని, పిల్లలకు తల్లితండ్రి లేని లోటు కనిపించకుండ చూసుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం జవహర్ నగర్‌లోని శారదా విద్యా నికేతన్ స్కూల్, అమ్మఒడి పిల్లలకు శారదా ఎడ్యుకేషన్ సొసైటీలో ఫీడింగ్ ఇండియా (జొమాటో) వారి సహకారంతో సుస్థిర అభివృద్ధికై విద్యార్థి పౌష్టికత కార్యక్రమాన్ని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జవహర్ నగర్‌లో వివిధ రాష్ట్రాల నుండి ఉపాధి కోసం వచ్చిన వారు అధిక సంఖ్యలో ఉన్నారని తెలిపారు. పిల్లలకు విద్య నేర్పించాలనే సంకల్పంతో పద్మావతి ఈ సొసైటీని నడుపుతున్నారన్నారు. ప్రపంచంలో దాతృత్వానికి కొదవలేదన్నారు. పుట్టేటప్పుడు ఏమీ తీసుకరాలేదని, చనిపోయేటప్పుడు ఏమీ తీసుకపోలేమని తెలిపారు. మంచి అనే పేరు సంపాదించుకోవడమే ఆస్తి అన్నారు. రిటైర్మెంట్ అయిన వారు ఇచ్చే కాంట్రిబ్యూషన్ సమాజంలో చాలా గొప్పదన్నారు. శారదా సొసైటీలో పని చేసేవారు మానవతా దృక్పథంతో ఉండాలని, జీతం కోసం పని చేయవద్దని, అమ్మనాన్నలై పిల్లలను తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా ఫీడింగ్ ఇండియా వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి, శారదా సొసైటీ నిర్వహకురాలు శారదా, కార్పొరేటర్లు బింగి లావణ్య సతీష్ గౌడ్, గొడుగు వేణు, జమల్పూర్ నవీన్ కుమార్, బీజేపీ నాయకులు కమల్, మహేందర్ యాదవ్, సంపత్ కుమార్ యాదవ్, శారదా బోర్డు సభ్యులు, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

22న కేఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ ప్రారంభం



నవతెలంగాణ-కాప్రా

ఈ నెల 22 వ తేదీన ఈసీఐఎల్‌లోని సీపీఐ కార్యాలయం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ రెండవ ఫ్లోర్‌లో కామ్రేడ్ కేఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ పేరుతో సామాజిక అధ్యయన కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు కెఎల్. మహేంద్ర సోషల్ స్టడీ సర్కిల్ నిర్వహణ కమిటీ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ ప్రారంభ ఆహ్వాన పత్రికను బుధవారం నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో విడుదల చేశారు. అనంతరం జీ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. కేఎల్ మహేంద్ర తెలంగాణ సాయుధ పోరాటంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని, అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి హక్కులు సాధించారని తెలిపారు. సింగరేణి వర్కర్స్ యూనియన్ నుండి మొదలుకొని అంతర్జాతీయ కార్మిక ఉద్యమానికి నాయకుడిగా ఎదిగారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనమండలి సభ్యుడిగా తన సేవలను అందించారని వివరించారు. అందుకే మహేంద్ర పేరుతో నేటి తరానికి సమాజంలో జరుగుతున్న మార్పులపై నిరంతరం అధ్యయనం చేసి పరిశోధనాత్మకమైన వ్యాసాలు రాయడం కోసం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ అధ్యయన కేంద్రంలో పుస్తకాలతో పాటు రీడింగ్ హాల్ ఏర్పాటు చేశామన్నారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న యువతకు, పేదరికంతో డబ్బులు చెల్లించలేని విద్యార్థుల కోసం ఉచితంగా రీడింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. పోటీ పరీక్షలకు కావలసిన పుస్తకాలతో పాటు ఇక్కడ సమాజంలో వచ్చిన మార్పులపై అనేక ఉద్యమకారులు, రచయితలు రాసిన పుస్తకాలను అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ముఖ్యతిథిగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మెన్ రియాజ్, విశిష్టతిథిగా సామాజిక, రాజకీయ విశ్లేషకులు మల్లేపల్లి లక్ష్మయ్య, డా. సోము మర్ల శాస్త్రవేత్త, సురేష్ మేడ్చల్ జిల్లా గ్రంథాలయ కార్యదర్శి హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎస్. శంకర్ రావు, నారా నర్సింహా, జీ. లక్ష్మీ నారాయణ, కె. ధర్మేంద్ర పాల్గొన్నారు.

ఫోన్ విక్రయదారుడి ఆధార్ కార్డు తీసుకోవాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

మొబైల్ షాప్ యజమానులు ఫోన్ విక్రయదారుడి ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని ఘట్కేసర్ మున్సిపల్ ఛైర్ పర్సన్ ముల్లి పావనీ జంగయ్య యాదవ్ అన్నారు. బుధవారం ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ కూడలి సమీపంలో నిర్వహించిన మొబైల్ షాప్ అసోసియేషన్ ఏర్పాటుకు ముఖ్య అతిథిగా సీఐ పరశురాం, వైస్ ఛైర్మెన్ పలుగుల మాధవ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఛైర్‌పర్సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముల్లి పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ.. అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నందుకు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతీ ఒక్క షాప్ యజమానులు ఒక్కరి మాటకు విలువలు ఇస్తూ వ్యాపారం చేసుకోవచ్చన్నారు. కొన్ని చోట్ల నకిలీ ఫోన్లు విక్రయిస్తున్నారని, అలాంటి వాటికి నిలుపుదల చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ వ్యాపారం సజావుగా చేసుకుంటూ నలుగురికి ఉపాధి కల్పించాలన్నారు. ఎవరైనా దొంగిలించిన ఫోన్స్ తెస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రతి షాప్ యజమానులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బండారు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు బొక్క సంజీవ రెడ్డి, నాయకులు అన్ను సిరాజ్, కృపనిధి, పల్లె విజయ్ గౌడ్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

రెడ్డి సంక్షేమ సంఘం అభివృద్ధికి కృషి : నాగిళ్ల బాల్‌రెడ్డి





నవతెలంగాణ - చర్లపల్లి

ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి సామాజిక వర్గ విద్యార్థుల సంక్షేమంతో పాటు, అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తామని కుషాయిగూడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నాగిళ్ల బాల్ రెడ్డి అన్నారు. బుధవారం కుషాయిగూడ రెడ్డి సంక్షేమ సంఘాన్ని ఎన్నుకున్నారు. రెడ్డి సంక్షేమ సంఘం ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఎన్నికల నిర్వహణలో భాగంగా సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకునట్టు ఎన్నికల కార్యనిర్వాహణాధికారులు రామచంద్రారెడ్డి, వెంకట్ రెడ్డిలు తెలిపారు. కుషాయిగూడ రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా నాగిళ్ల బాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మొగిలి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులుగా బిలకంటి వెంకటనరసింహారెడ్డి, బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సామ వెంకట్ రెడ్డి, కార్యనిర్వక కార్యదర్శిగా రవిపల్లి రవీందర్ రెడ్డి, కోశాధికారి రావుల రాంరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేటి ఉపాధ్యాయ సంఘాల ధర్నా వాయిదా

నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీల్లో జరిగిన స్పౌజ్ అవకతవలపై ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 21న తలపెట్టిన ధర్నాను వాయిదా వేస్తున్నామని మేడ్చల్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జీవిత భాగస్వామికి సంబంధించిన ఆవకతవకలపై కోర్టు ఉత్తర్వులు రేపు వెలువడే అవకాశం ఉందని జిల్లా విద్యాధికారి తెలిపారని, ఆమె సూచన మేరకు ధర్నాను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని తెలిపారు. నేడు ఉదయం జిల్లా విద్యాధికారితో జేఏసీ ప్రతినిధుల సమా వేశం ఉందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు వెంకటేశ్వర్లు, జయసింహ రెడ్డి, ఉరేళ్ల విఠల్. రాజ్ కుమార్, బ్రహ్మ చారి తెలిపారు.

మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ - జవహర్‌నగర్

జవహర్ నగర్ పరిధిలోని బాలాజీ నగర్ సబ్ స్టేషన్ నుండి వెలువడే 11కేవీ లక్ష్మీ నర్సింహ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10:30 గంటల నుండి 4 గంటల వరకు చెన్నాపురం, లక్ష్మీ నగర్ కట్ట, నెహ్రూ నగర్, శివ నగర్, జయశంకర్ కాలనీ, లెప్రసీ కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, సిటిజన్స్ కాలనీ, శాంతి నగర్, మూడు దేవాలయలాలు, చిలకల బులిడింగ్, రేణుకా ఎల్లమ్మ దేవాలయం, ఆదర్శ నగర్, వికలాంగుల కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని బాలాజీనగర్ ఏఈ సాంబశివ రావు బుధవారం ఓక ప్రకటనలో తెలిపారు.

దమ్మాయిగూడ పరిధిలో..

సాకేత్ సబ్ స్టేషన్ నుండి వెలువడే 11కేవీ జవహర్ నగర్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా ఉదయం 10:30 నుండి సాయంత్రం 4 గంటల వరకు అంబేద్కర్ నగర్, నాచారం ఫైర్ విక్టమ్ కాలనీ, రాయన్న కాలనీ, దొండతోట, సత్యనారాయణ కాలనీ, జన్మభూమి నగర్, ప్రగతి నగర్, అంబేద్కర్ నగర్ వాటర్ ట్యాంక్, బీజేఆర్ నగర్ ఫేజ్-2, నేతాజీ డిఫెన్స్ కాలనీ, ఎన్టీఆర్ నగర్, గబ్బిలాల్ పేట-1, కేసీఆర్ నగర్, ఫేజ్-1, న్యూ దేవేందర్ నగర్, రిజిస్ట్రేషన్ కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని దమ్మాయిగూడ ఏఈ రాజ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ అంతరాయం : ఏఈ

నవతెలంగాణ - చర్లపల్లి

కుషాయిగూడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33/11కేవీ జై జవాన్ కాలనీ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10:30 నుండి సాయంత్రం 4:00 వరకు ఎస్ఎస్.కాలనీ, ఆదర్శ నగర్, జీఆర్ రెడ్డి నగర్, దేవీనగర్, బీజేఆర్ కాలనీ, జై జవాన్ కాలనీ, మారుతీనగర్, న్యూ శ్రీనివాస్ నగర్, సాకేత్ టవర్స్, తిరుమల హార్మోని, మాపుల్ హెూమ్స్, అశోక్ మనోజ్ ఎంక్లవ్, రాజ రాజేశ్వరి కాలనీ. ల్యాండ్ మార్క్, జ్యోతి బిల్డర్స్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాల అంతర్యం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాల్సిందిగా కుషాయిగూడ విద్యుత్ సబ్ స్టేషన్ అధికారి ఆర్.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రిజిస్ట్రేషన్లను నిలిపేయడం అనాలోచిత చర్య



● ప్రజల పక్షాన సుప్రీంకోర్టుకు వెళ్తాం
● ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్ మెట్

దాదాపు 30 ఏండ్ల క్రితం ఏర్పాటైన కాలనీలకు హఠాత్తుగా రిజిస్ట్రేషన్‌లు నిలిపివేయాలని వక్ఫ్ బోర్డు ప్రకటించడం ప్రభుత్వ అనాలోచిత చర్య అని, దీనిపై ప్రజల పక్షాన సుప్రీంకోర్టుకు వెళ్లి ప్రజలకు న్యాయం జరిగేలా పోరాటం చేస్తానని, న్యాయపరమైన పోరాటానికి ప్రజలకు ఒక్క పైసా ఖర్చు కాకుండా తానే భరిస్తానని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. మౌలాలి డివిజన్ పరిధిలోని పలు సమస్యల పై పిబి సూర్య నగర్, రాక్ హిల్స్ కాలనీ, హరిజన బస్తీ, శఫీ నగర్, సాదుల్లానగర్, సుభాష్ నగర్ బస్తీల ప్రజల ఆహ్వానం మేరకు బుధవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర రెడ్డి పర్యటించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు రిజిస్ట్రేషన్ల నిలిపివేతను కోరుతూ చేసిన ప్రకటనతో భయాందోళనకు గురైన ప్రజలకు నేనున్నానని భరోసానిచ్చారు. 30 ఏండ్ల క్రితం ఏర్పాటైన కాలనీలు, బస్తీల నుండి అన్ని రకాల పన్నులు వసూలు చేస్తూ, పర్మిషన్లు ఇస్తూ ప్రభుత్వాలు సీసీ రోడ్లు, డ్రయినేజీ, వీధిదీపాలు, కరెంట్ మీటర్లు వంటి సౌకర్యా లు కల్పించిందన్నారు. అనంతరం స్థానిక కాలనీల వాసులు మాట్లాడుతూ చిత్తశుద్ధితో ప్రజల కంటే తానే ముందుండి పోరాటం చేస్తున్న ఎమ్మెల్యే ఉండడం తమ అదృష్టమ న్నారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, అధ్యక్షులు, స్థానికులు, బిఆర్ఎస్ నాయకులు అమీణుద్దీ న్, భాగ్యానంద్ రావు, ఉస్మాన్, వంశీ ముదిరాజ్, ఇబ్రహీం, సంతోష్ నాయుడు, పల్లపు సందీప్, పాల్గొన్నారు.



కురుమల అభివృద్ధికి కృషి చేస్తా

● కార్పొరేటర్ బన్నాలగీత



నవతెలంగాణ-ఉప్పల్

కురుమల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ బన్నాల గీత అన్నారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన కురుమ సంఘం సభ్యులు బుధవారం బన్నాల గీత ప్రవీణ్‌ను కార్పొరేటర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గొంగడి, రుమాలుతో సన్మాంచారు. కురుమల వైకుంఠధామంలో బాత్రూంలు శిథిలావస్థకు చేరడంతో నూతన బాత్రూంల నిర్మాణానికి రూ.20 లక్షల కేటాయించినందుకు కార్పొరేటర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. కురుమల అభివృద్ధికి తన వంతు సహాయాన్ని అందిస్తానన్నారు. కురుమల వైకుంఠధామం అభివృద్ధి కోసం మరిన్ని నిధులు వెచ్చిస్తానని హామీ ఇచ్చారు. డివిజన్‌లో బీరప్ప ఆలయంలో నిర్మించబోయే భవనానికి సహకరిస్తానని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వెలుగు గుట్ట ఆలయ కమిటీ ఛైర్మెన్ జన్ని రఘు కురుమ, రాష్ట్ర కార్యదర్శి మల్లేష్ కురుమ, ఉప్పల్ కురుమ సంఘం అధ్యక్షులు వెంకటేష్ కురుమ, కార్యనిర్వాహక అధ్యక్షులు బర్ల కృష్ణ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ సేవా భావం కలిగుండాలి

● కాంగ్రెస్ నాయకులు గ్యార ప్రవీణ్ కుమార్ ● పుట్టినరోజు సందర్భంగా
ఆటో డ్రైవర్లకు యూనిఫామ్స్ పంపిణీ ● ఆశీర్వదించిన మైనంపల్లి





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని, పేదలకు మనకు తోచిన సాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి యువ నాయకులు గ్యార ప్రవీణ్ కుమార్ అన్నారు. మల్కాజిగిరి సర్కిల్ గౌతమ్ నగర్ డివిజన్‌కు చెందినగ్యార ప్రవీణ్ కుమార్ తన పుట్టినరోజు సందర్భంగా బుధవారం మల్కాజిగిరి, గౌతమ్ నగర్ డివిజన్ వాణి నగర్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి ప్రవీణ్ కుమార్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇందిరా నెహ్రూ నగర్ (ఐఎన్) లోని హి చర్చిలో పాస్టర్ బక్కయ్య సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ శాలువాతో సత్కరించారు. చర్చికి వచ్చే వారికి, ఈసీఐఎల్ మాతృ శ్రీ అనాథ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. మల్లికార్జున నగర్ ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ కార్యక్రమం లో రామ్ చందర్, శీను, ప్రదీప్,సిద్ధులు, నాయకులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్త రకం వరి వంగడం ప్రారంభించిన నూజివీడు సీడ్స్



నవ తెలంగాణ- మేడ్చల్

గుడ్లపొంచంపల్లి మున్సిపల్ పరిధిలోని కండ్లకోయ నూజివీడు సీడ్ కంపెనీ ఆధ్వర్యంలో నూతన ఎన్ పీ-8912 వరి వంగడాన్ని ప్రారంభించినట్లుగా నిర్వాకులు బుధవారం తెలిపారు. వ్యవసాయ రంగంలో అగ్రగామిగా పేరుగాంచిన నూజివీడు సీడ్ కంపెనీ ఈ నెల 20న యూ ట్యూబ్ లైవ్ ఈవెంట్ ద్వారా తన కొత్త పరిశోధన వరి రకం ఎన్‌పీ-8912ని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ వరి వంగడం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రల్లో రబీ సీజన్‌లో సాగుకు అనుకూలమని పేర్కొన్నారు. నూజివీడు సీడ్స్ కంపెనీలోని ఆర్ అండ్ డీ నిపుణులు ఎన్‌పీ 8912 సూపర్ ఫైన్ రైస్ వంగడన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు.113 నుండి 118 రోజుల వ్యవధిలో సూపర్ ఫైన్ రైస్ గింజలు పక్వానికి వచ్చి అధిక దిగుబడిని ఇస్తాయన్నారు. ఇది ఖరీఫ్, రబీ వేసవి కాలల్లో సాగుకు అనుకూలంగా ఉంటుందని వివరించారు. ఎన్ పీ-8912 ఇతర స్వల్పకాల రకాలతో పోల్చితే అధిక మొత్తంలో ప్రీమియం -నాణ్యత గల బియ్యాన్ని ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉంటుందన్నారు. ప్రతి కంకికి 350 కంటే ఎక్కువ గింజలు 25సెంటీమీటర్ల వరకు పొడవాటి కంకులతో రైతులు అధిక దిగుబడితో లాభాలు పొందుతారని అన్నారు.ఎన్ పీ-8912 అగ్గి తెగులును తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండి తక్కువ పెట్టుబడితో రైతులకు ఎక్కువ లాభాలు కల్పిస్తుదన్నారు. కార్యక్రమంలో నూజివీడు సీడ్స్ లిమిటెడ్ తరుపున శరత్ ఖురానా, చీఫ్ స్ట్రాటెజీ ఆఫీసర్ డా.దేవేంద్ర కడియన్, డా.వర ప్రసాద్, రైస్ బ్రీడియింగ్ హెడ్ శ్రీనివాసరావు క్రాప్ మేనేజర్ మార్కెటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు, వైద్య శిబిరాలు అభినందనీయం

● డిస్ట్రిక్ గవర్నర్ లయన్ కృష్ణ ప్రసాద్, కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి
● మోడ్రన్ హైస్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ - చర్లపల్లి

విద్యతో పాటు వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని లయన్స్ ఇంటర్నేషనల్‌డిస్ట్రిక్ గవర్నర్ లయన్ కృష్ణ ప్రసాద్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320 సి ముత్యం రీజియన్. రీజియన్ ఛైర్ పర్సన్ ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో మల్లాపూర్ సూర్యనగర్‌లోని మోడ్రన్ హైస్కూల్లో ఉచిత మెగా వైద్య శిబిరాని నిర్వహించారు. వైద్య శిబిరాని డిస్ట్రిక్ గవర్నర్ లయన్ క్రిష్ణ ప్రసాద్, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు. వైద్య పరీక్షల నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకో వాలన్నారు అనంతరం రీజియన్ ఛైర్ పర్సన్ ముత్యంరెడ్డి మాట్లాడుతూ.. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



రామ్ రాజ్ కాటన్ షోరూం ప్రారంభించిన దిల్ రాజు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి గౌతమ్ నగర్ డివిజన్ భవానీ నగర్‌లో బుధవారం సినీ దర్శకుడు దిల్ రాజ్ మల్కాజిగిరిలో 300వ రామ్ రాజ్ కాటన్ షోరూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, రామ్ రాజ్ కాటన్ ఛైర్మెన్ నగరాజన్ మాట్లాడుతూ.. మల్కాజిగిరిలో నూతన షోరూం ప్రారంభించ డం ఆనందంగా ఉందన్నారు. భారత సంస్కృతి చాటే రామ్‌రాజ్ పంచలు దేశవ్యాప్తంగా పేరు గాంచిందన్నారు. కార్యక్రమంలో రామ్ రాజ్ కాటన్ షోరూం నిర్వహకులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి.. ప్రభుత్వ ప్రాథమిక స్కూల్ టీచర్లను మినహాయించాలి

● సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ జి.వేణుగోపాల్



నవతెలంగాణ-నేరేడ్ మెట్

బాలల విద్యను దృష్టిలో ఉంచుకొని సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను మినహాయించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్జి వేణుగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మల్కాజిగిరి సర్కిల్ మౌలాలి డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్‌లోని పాఠశాలలో బుధవారం బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో మండల సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను కేటాయించడం, పాఠశాలలను ఉదయం 9 గంటల నుండి మ.1 గంటల వరకే (ఒంటి పుట)నే నిర్వహించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదనకు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. విద్యా హక్కు చట్ట ప్రకారం ఏడాదిలో ప్రాథమిక పాఠశాలలు 2 వందల పనిది నాలు, 8 వందల బోధనా గంటలుగా నిర్ధారించిన్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులకు జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరిత్యాలలో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబంధించిన విధుల నుంచి మినహాయించాలన్నారు. టీచర్లను విద్యేతర పనులకు పంపకూడదని విద్యా హక్కు చట్టం నిర్దేశిస్తుందన్నారు. దసరా, దీపావళి పండుగల తరువాత పిల్లలందరూ బడులకు రాలేదన్నారు. అంతలోనే సర్వే పనుల వలన బడులు మూత, పిల్లల సామర్థ్యాలపై చాలా ప్రభావం పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ ఎస్ కృష్ణగౌడ్, కార్యదర్శి చింతల లక్ష్మి, నారాయణ, మారెడ్ పల్లి మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్, భాగ్య రాణి, హన్మంత్, ఉమ, రుబీనాబెగం, సరస్వతి, ఉమ, ఎంవి ఫౌండేషన్ ఆర్గనైజర్‌లావన్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

● కాప్రా తహసీల్దార్ సుచరిత



నవతెలంగాణ - జవహర్‌నగర్

అక్రమ కట్టడాలు చేపడితే ఎంతటి వారినైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని కాప్రా మండల తహశీల్దార్ సుచరిత అన్నారు. బుధవారం జవహర్ నగర్ పరిధిలోని కార్మిక నగర్‌లో 385, సర్వే నెంబర్‌లో నిర్మించిన రూమ్, 606లో పిల్లర్లను, 385, 706, నెంబర్‌లలో బేస్మెంట్లను రెవెన్యూ సిబ్బంది సహాయంతో కూల్చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సుచరిత మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని, అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అనురాగ్ యూనివర్సటీలో ఫార్మసీ వారోత్సవాలు



నవతెలంగాణ - పోచారం

ఘట్కేసర్ మండలం పోచారం మున్సిపల్ పరిధిలోని బుధవారం 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలలో భాగంగా అనురాగ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో రక్తదాన శిబిరాన్ని ఇంజనీరింగ్ డీన్ డా. వి .విజయ్ కుమార్, ఫార్మసీ డీన్ డా. వసుధ బక్షి, ఎస్ఎస్ఎం. సెల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. సి. మల్లేష్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. జూబ్లీహిల్స్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ శిబిరంలో ఆరాధ్య రక్తనిధి ప్రతినిధులు దాతల నుండి 120 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఇందులో భాగంగా ఎన్. ఎస్. ఎస్ యూనిట్ -1, ఫార్మసీ విభాగం వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ జే. రాజేంద్ర కుమార్, డిపార్ట్మెంట్ సమన్వయకర్త బి. తిరుపతి, జాతీయ ఫార్మసీ వారోత్సవ కోఆర్డినేటర్లు డా సంతోషి ప్రియా, డా. మోహమ్మ సాయిద్ రక్తదాతలను అభినందించారు

మనదేశం ఫార్మా ఉత్పత్తుల్లో అగ్ర స్థానంలో ఉంది

● సీరో ఫార్మా ప్రయివేటు లిమిటెడ్ జనరల్ మేనేజర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం
● ఫార్మసి పరిశ్రమలో నూరు శాతం ఉద్యోగ కల్పనకు అవకాశం కల్పిస్తాం
● కేజీఆర్ కళాశాల ఛైర్మెన్ కె.గోవింద్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

భారత దేశం ఫార్మా ఉత్పత్తుల్లో అగ్ర స్థానంలో ఉందని, విద్యార్థులు ఫార్మా రంగంలో రాణించాలని సీరో ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీలోని రాంపల్లి గ్రామంలో ఉన్న కేజీఆర్ కళాశాలలో ఫార్మసీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం కళాశాల ఛైర్మెన్ డాక్టర్ గోవింద రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యతిథితి సీరో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం హాజ రై మాట్లాడుతూ.. దేశం ఫార్మా ఉత్పత్తుల్లో అగ్ర స్థానంలో ఉందన్నారు. ఉద్యోగ పరిశోధన రంగాల్లో అపరిమిత అవకాశాలున్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. ప్రస్తుతం ఫార్మా పరిశ్రమలో విద్యార్థుల నుండి ఏ విధమైన సేవలు కోరుకుంటుయో వివరించినారు. క్రమశిక్షణ , శ్రమను కలిపితే అద్భుతాలను సాధించవచ్చన్నారు. కళాశాల ఛైర్మెన్ కె.గోవింద్ రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఫార్మసి పరిశ్రమలో నూరు శాతం ఉద్యోగ కల్పనకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కీసర సీఐ వెంకటయ్య మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలకు లోబడి క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఒక్కసారి చట్టవ్యతిరేక కార్యక్రమాల్లో కేసు బుక్కయితే జీవితాంతము బాధపడాల్సి ఉంటుందన్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ రమణా రావు మాట్లాడుతూ కళాశాలలో అద్భుతమైన సౌకర్యాలు ప్రయోగశాలు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి విజయకుమార్ , కీసర ఎస్ ఐ హరిప్రసాద్, డాక్టర్ శిల్పిక, నాగరాజ్, సింధూజ, రాధిక, సుసాన్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో 'ప్రజా పాలన కళాయాత్ర'



నవతెలంగాణ-సిటీబ్యూరో
రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న "ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు-2024"ల్లో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా 'తెలంగాణ సాంస్కృతిక సారథి' కళాకారుల 2 బందాలు "ప్రజా పాలన కళాయాత్ర" నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని బాలానగర్, ఫిరోజుగూడ, బబ్బుగూడ, నాగారం మున్సిపాల్టీలోని అహ్మద్‌గూడ, హరిదాస్‌పల్లి, చీర్యాలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో ప్రచారం చేశారు.

బాలానగర్‌లో వివాహిత ఆత్మహత్య



నవతెలంగాణ-బాలానగర్
ఉరేసుకుని వివాహిత ఆత్మ హత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలోని చోటు చేసుకుంది. సీఐ నరసింహారాజు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉమాపతి, దేవి దంపతులు రాజు కాలనీలో కొంతకాలంగా వినాయక్ నగర్‌లో నివాసముంటున్నారు. బుధవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో దేవి (30) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి 2017లో పెళ్లి వీరికి కాగా ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ మేరకు మృతురాలిని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించి బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విజయోత్సవ సభలో రేవంత్ రెడ్డి ప్రసంగంపై

రంగారావు ఘాటు వ్యాఖ్యలు..

- బీఆర్ఎస్ నాయకులు మాధవరం రంగారావు



నవతెలంగాణ-కూకట్‌పల్లి
వేములవాడలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జరుపు తున్నటువంటి విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగంపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాధవరం రంగారావు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన పత్రికా ప్రకటన విడుదల చేస్తూ.. వేములవాడలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత 10 సంవత్సరములు పాలించిన కేసీఆర్ ఏమీ చేయలేదన్నారు. నేను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పది నెలలు కాలేదు.. నన్ను దింపేయాలని కుట్ర చేస్తున్నారని.. నేను వచ్చిన పది నెలల్లోనే చాలా చేశానన్నారు. 50 వేల ఉద్యోగాలు ఇచ్చాను. రైతులకు 18 వేల కోట్లు, 23 లక్షల కుటుంబాలకి రుణమాఫీ చేశాను. అలాగే కొడంగల్‌లో భూమి సేకరిస్తుంటే కేటీఆర్, హరీష్ రావు అడ్డుపడుతున్నారని కలెక్టర్, ఆర్డీవో, అధికారులను కొట్టించారని.. వేములవాడ విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి. అందుకు ధీటుగా మాధవరం రంగారావు మాట్లా డుతూ కలెక్టర్ మా మీద దాడి చేయలేదు అని చెపు తుంటే.. మరి మీకు ఏ అధికారి ఫిర్యాదు చేశారు. రైతుల ను ఎందుకు అరెస్టు చేయించారు.. చెప్పాల్సిన బాధ్యత మీ మీద ఉందన్నారు. అని ఒక వైపు బాధితులు, మాకు ఉన్న భూమిని మీ ఫార్మా కంపెనీకి ఇస్తే మా బతుకు కష్టమవుతుందని.. మా భూమి ఇవ్వలేము అని చెబుతూ ఉంటే, వాళ్ల మీద కేసులు పెట్టి జైలుకు పంపించడం జరిగింది. మీ నియోజకవర్గ ప్రజలు మిమ్మల్ని గెలిపించి ముఖ్యమంత్రిని చేసినప్పుడు, ఆ ప్రజలను మీరు ఒప్పించి భూమి తీసుకొని, మంచి చేయాలని ఉద్దేశం ఉంటే.. వాళ్లని అరెస్టు చేసి జైలుకు ఎందుకు పంపించారు అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ప్రసంగించే సమయంలో 10 శాతం కూడా, మీరు చెప్పిన హామీలు, మీరు చేసిన పనుల గురించి వివరించకపోగా.. పూర్తిగా కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్‌ల గురించి మాట్లాడడం సరిపోయింది అని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను నెరవేర్చాలన్నారు. మీరు ఏదైతే కేసీఆర్ 10 సంవత్సరాలలో చేయని పని, 10 నెలల్లో చేసామనుకుంటున్నారో.. దాన్ని రెఫరెండమ్‌గా తీసుకుని, మీరు గెలిచిన 65 అసెంబ్లీ స్థానంలో కానీ.. పార్టీలోకి బీఆర్ఎస్ నుంచి చేర్చుకున్నా. చేర్చుకున్నామని చెప్పుకోలేని పరిస్థితిలో ఉన్న పది నియోజకవర్గాల్లో, ఏదైనా ఒక నియోజకవర్గం కానీ, మీరు పీఏసీ చైర్మెన్ ఇచ్చిన శేర్లింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు అరికెపూడి గాంధీని అయిన రాజీనామా చేయించి.. పోటీ చేసి గెలిపిస్తే, ప్రజలు ఆమోదించి నట్టుగా ఉంటుందని రంగారావు సవాల్ విసిరారు.

పార్కులను అందుబాటులోకి తీసుకురావాలి



- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
మరిన్ని పార్కుల నిర్వహణను చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. బాలాజీ నగర్‌లోని మహిళా పార్కును బాగా నిర్వహించి నందుకు స్థానిక కాంగ్రెస్ నాయకురాలు బండి సుధకు నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ ప్రతినిధులు ఆమెకు ఉత్తమ పార్కు నిర్వహణ అవార్డును ఈ నెల 10న గచ్చిబౌలిలో అందజేశారు. ఈ సందర్భంగా అవార్డుతో బండి సుధను బుధవారం బండి రమేష్‌ని బాలానగర్ పార్టీలోని కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమెను, బండి రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, కుక్కల రమేష్, మధు గౌడ్, రమాదేవి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో సత్ జ్ఞాన్ హైస్కూల్ విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
యంగ్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ హైదరాబాదు వారు నిర్వహించిన.. ఇండియా బిగ్గెస్ట్ సూపర్ స్టార్స్ స్కేటర్స్-2024 స్కేటింగ్ పోటీలు కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీలలో వెంకటేశ్వర నగర్ సత్ జ్ఞాన్ హై స్కూల్ విద్యార్థులు స్కేటింగ్‌లో అత్యుత్తమమైన ప్రతిభ కనబరిచి 16 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొనగా.. 14 మంది విద్యార్థులకు బహుమతులు అందుకోవడం జరిగింది. 4 నుంచి 6 సంవత్సరాల వయస్సు విభాగంలో మాస్టర్ డి జోసఫ్ ప్రథమ బహుమతి, 6 నుండి 8 సంవత్సరాల వయసు విభాగంలో మాస్టర్ ఎల్ రేహాన్‌కు తృతీయ బహుమతి, 8 నుండి 10 వయసు విభాగంలో మాస్టర్ వి.సాయి పవన్, మాస్టర్ ఎస్.సుశాంత్ అవినాష్ కుమార్‌కు కన్సోలేషన్ బహుమతి.. 10 నుండి 12 సంవత్సరాల వయసు విభాగంలో మాస్టర్ డి.అభిరామ్‌కు తృతీయ బహుమతి, మాస్టర్ జి.సాయి అర్జున్ రెడ్డి, మాస్టర్ ఎం.తమన్ రాజ్, మాస్టర్ ఆర్యన్ భూతాలే, మాస్టర్ డి.ఇమ్మానుయేల్ నలుగురికి కన్సోలేషన్ బహుమతి.. 12 నుండి 14 సంవత్సరాల వయస్సు విభాగంలో మాస్టర్ జె.సాయికిరణ్, మాస్టర్ జి.హితాన్ష్ కుమార్ ఇద్దరికీ ప్రథమ బహుమతి, మాస్టర్ జి.ధీరజ్‌కు ద్వితీయ బహుమతి, మాస్టర్ కే.చరణ్‌కు తృతీయ బహుమతి.. మాస్టర్ కే.వర్షిత్‌కు కన్సోలేషన్ బహుమతి అందుకోవడంతో పాటు ఉత్తమ ప్రశంసా పత్రాలని అందుకోవడం జరిగింది. మిగతా ఇద్దరికీ మాస్టర్ ఎస్.మోహిత్ ఎస్ మోహన్‌కి పార్టిసిపేషన్ అవార్డ్స్ పొందడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లయన్ చింతల మల్లేశం మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ గెలుపొందిన విద్యార్థులను శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులందరూ చిన్నప్పటినుంచి క్రమశిక్షణ మంచి పట్టుదలతో ముందుకు వెళ్లి భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో ఉండేవిధంగా ఇలాంటి పోటీలు స్ఫూర్తినిస్తాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్కేటింగ్ మాస్టర్ రవళి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. ప్రమాదమే..

- మూలమలుపు చౌరస్తాలో ప్రమాదకరంగా మ్యాన్ హోల్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట
అధికారుల పర్యవేక్షణ లోపం, నాయకుల నిర్లక్ష్యం వెరసి గిరినగర్ ప్రజల పాలిట శాపంగా మారింది. ప్రధాన రోడ్డు గుంతల మయంగా మారిపోవడంతో వాహనదారులు, పాదాచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.వర్షం వస్తే గుంతల్లో వర్షపు నీరు చేరడంతో పడరాని పాట్లు, సర్కస్ ఫీట్లు పడాల్సి వస్తుందని స్థానికులు అధికారుల, నాయకుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గిరినగర్ గురుమూర్తి నగర్ ప్రాంతాలకు అనుసంధానంగా ప్రధాన రోడ్డు మూల మలుపు చౌరస్తా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మ్యాన్ హోల్ కుంచించుకుపోయి రెండు వారాలు అవుతున్న కనీసం పట్టించుకునే నాధుడే కరువయ్యాడని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సాయంత్రం వేళల్లో సమీపంలోనే పాఠశాల ఉండడంతో చిన్నారులు పడరాని పాటుపడుతున్నారు. ఇక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే మ్యాన్ హోల్ మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



జేఎన్‌టీయూహెచ్ యోగ మెన్ అండ్ ఉమెన్ జట్లు ఎంపిక చేశారు. బుధవారం జేఎన్‌టీయూహెచ్ ఇండోర్ స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన యోగా హాల్‌లో ఈ సెలక్షన్స్ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ జేఎన్‌టీయూహెచ్ యునివర్సిటీ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ నల్గొండ అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ జెఎన్ టీయూహెచ్ యునివర్సిటీ ప్రొఫెసర్ ఎన్ఎస్ దిలీప్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు కైట్ యూనివర్సిటీ భువనేశ్వర్ లో డిసెంబర్ 24 నుంచి 28 వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లో పాల్గొన్నట్లు తెలిపారు. అనంతరం సెలక్షన్స్ లో హైదరాబాద్ డిస్ట్రిక్ట్ యోగా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.సురేంద్రనాథ్ పాల్గొని ఎంపికైన క్రీడాకాలను అభినందించారు.
నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
దోబీ ఘాట్, బ్రాహ్మణ సంఘ భవనం చుట్టూ నిర్మించే ప్రహరీ గోడ పనులను త్వరగా పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం కె.పి.హెచ్.బి కాలనీ డివిజన్‌లో జరుగుతున్న బ్రాహ్మణ సంఘ భవనం, దోబీ ఘాట్ ప్రాంతాలను స్థానిక కార్పొరేటర్ మండడి శ్రీనివాసరావు, జీహెచ్ఎంసీ డీసీ వంశీ కుమార్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాటికి సంబంధించిన గేట్లను ఏర్పాటు చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో ఈ.ఈ శ్రీనివాస్, డి.ఈ.శ్రీదేవి, ఏ.ఈ.సాయి ప్రసాద్, రాజేష్ రాయ్, సాయిబాబా చౌదరి, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులలో జాప్యం వహించకుండ త్వరితగతిన పూర్తి చేయాలి..

అభివృద్ధి పనులలో జాప్యం వహించకుండ త్వరితగతిన పూర్తి చేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం అల్లాపూర్ డివి జన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొ రేటర్ సబిహా గౌసిద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్తీ దావఖాన పనులు జరుగుతున్నావని అధికారులు కాంట్రాక్టర్లు పనుల్లో జాప్యం చేయడం వల్ల పనులు జరగడం లేదని అన్నారు. వీలైనంత త్వరగా అధికారులు సహకరించి ఆస్పత్రి సిబ్బందికి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గౌసుద్దీన్, ఐలయ్య, వీర రెడ్డి, ఆస్లాము, సలావుద్దీన్, ఈఈ శ్రీని వాస్, డి ఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



కంచె వేసే పనులు నిలిపివేయాలి

బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కైతలాపూర్ గ్రామము చుట్టూ హౌసింగ్ బోర్డు వారు కంచె వేస్తున్న విషయాన్ని స్థానికులు బుధవారం ఆందోళన చెందుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుక వచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ బాబురావుతో కలిసి హౌసింగ్ బోర్డు అధికారులతో మాట్లాడి కైతాలాపూర్ సమస్య పరిష్కరించి.. స్థానికంగా ఉన్న ఆలయం కావలసిన స్థలం సమస్య పరిష్కరించే వరకు కంచే వేసే పనులు నిలిపివేయాలని కోరారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదయ్య గౌడ్, సంతోష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పలు శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆల్విన్ కాలని డివిజన్‌లో పలు శుభ కార్యాల్లో హాజరై అభినందనలు తెలియజేశారు. అనిల్ రెడ్డి తులసివనంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి మహా పడి పూజా మహోత్సవంలో పాల్గొని.. స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు.
అనంతరం ఎల్లమ్మ బండలోని బీఆర్ఎస్ కార్యకర్త రాము నూతన గృహ ప్రవేశం కార్యక్రమానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు.





"అవ్వి క్లినిక్స్ ఫర్ ఉమెన్" ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్
132 - జీడిమెట్ల డివిజన్ సుచిత్ర చౌరస్తాలో నూతనంగా ఏర్పాటుచేసిన "అవ్వి క్లినిక్స్ ఫర్ ఉమెన్" ను కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన పరిజ్ఞానం అత్యాధునిక సదుపాయాలతో ఏర్పాటుచేసిన "అవ్వి క్లినిక్స్ ఫర్ ఉమెన్" ప్రేమే లక్ష్యంగా సేవయే మార్గంగా మంచి పేరును గడించాలన్నారు.ఈ కార్యక్రమంలో సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, నదీమ్ రాయ్, సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, నరేందర్ రెడ్డి, ఎల్లా గౌడ్, పోలే శ్రీకాంత్, నదీమ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.



'పంచముఖ హనుమాన్' దేవాలయ విగ్రహ ప్రతిష్ట..

జగద్గిరిగుట్ట: యాంత్రిక జీవనానికి అలవాటు పడిన ప్రజలు ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత పొందుతారని స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. బుధవారం గాజులరామారం డివిజన్ బతుకమ్మ బండలో పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 108 వైరాగ్య శిఖామణి, అవధూత గిరి మహా రాజ్‌ల పర్యవేక్షణలో నిర్వహించిన పంచ ముఖ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ పంచముఖ హనుమాన్ దీవెనలతో ప్రజలంతా పూర్తి ఆరోగ్యంతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నాయకులు ఇబ్రహీం, సుంకరి చందు, ఇమ్రాన్ బేగ్, సాయిబాబా, హమీద్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రాజగోపుర శిఖర కలశ స్తంభన పూజా మహోత్సవం..

దుండిగల్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలోని శ్రీ సీతారామచంద్రస్వామి, ఈ విశాలాక్షి విశ్వేశ్వర స్వామి దేవస్థానం వద్ద నిర్వహించిన.. రాజగోపుర శిఖర కలశ స్తంభన పూజా మహోత్సవానికి ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై శ్రీ విశ్వేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పురాతన కాలంలో దేవాలయాల నిర్మాణంలో వేద పండితులు అనేక శక్తులతో స్వామివారిని ప్రతిష్టాపన చేయడం వలన.. ఆ పరిసర ప్రాంతాలు కూడా శక్తి వంతమవుతాయని, తద్వారా మనము దేవాలయాలను సందర్శించినప్పుడు తెలియని మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.
ఈ కార్యక్రమంలో కొంపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్ డప్పు కిరణ్, సీనియర్ నాయకులు బూర్గుబావి హన్మంత్ రావు, ఆలయ కమిటీ చైర్మెన్ బూర్గుబావి సత్యనారాయణ, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీని గాడ్సే అనడంపై మండిపడ్డ చిరుమర్తి



నవతెలంగాణ-కూకట్‌పల్లి
బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పైన, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిరుమర్తి రాజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.
మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలని డివిజన్‌లో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే అరెకె పూడి గాంధీ పైన, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు చేసిన వ్యాఖ్యలపై చిరుమర్తి రాజు బుధవారం పాత్రి కేయ సమావేశంల ఏర్పాటు చేశారు.
ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నాయకుల కు ఇక్కడ శేరిలింగంపల్లిలో ఏం పని అని ప్రశ్నించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ అధినేతనే ఫామ్ హౌస్‌లో రెస్ట్ తీసుకుంటున్నారని.. కానీ ఎమ్మెల్యే ఎమ్మెల్సీ, ఇక్కడికి వచ్చి తమ ఎమ్మెల్యే పైన అవాకులు, చెవాకులు పేలుతూ.. అసంబద్ధ ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. ఇదే జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి.. బేరసారాలు చేశారని, అది కుదరకపోవడంతోనే ఇప్పుడు ప్రజలను కార్యకర్తలను మభ్య పెట్టే విధంగా మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఎమ్మెల్యేగా అరికెపూడి గాంధీ మూడుసార్లు, ప్రజల ఆశీర్వాదంతోనే గెలిచారని తెలిపారు. ఆయన చేస్తున్న అభివృద్ధి ప్రస్తుతం ఆయనను అంచలంచలుగా ఎదిగేలా చేస్తుందన్నారు. ఎమ్మెల్యే స్థాయి నుంచి నేడు పీఏసీ చైర్మెన్‌గా ఆయన ఎదగడం వారికి ఇష్టం లేకపోవడం, అందుకే ఇలా మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కి సరైన నాయకుడు లేడని, ప్రస్తుతం నాయకుడిని తయారు చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి అన్నారు.

నూతన డైరెక్టర్‌గా ప్రొఫెసర్ సుష్మ భాధ్యతలు స్వీకరణ



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ
జెఎన్‌టీయూహెచ్ యూనివర్సిటీలో నూతనంగా నియమితులైన యూజీ సీ-మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) డైరెక్టర్ గా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎం. సుష్మ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ పలు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్దులు వారి ఛాంబర్‌లో పుష్పగుచ్చం అందించి శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకులు భాను ప్రకాశ్ నాయక్, శ్రీను నాయక్ మాట్లాడుతూ జెఎన్‌టీయూహెచ్ యూనివర్సిటిలో సీనియరిటీనీ గుర్తించి.. డైరెక్టర్‌గా నియమించిన ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ బుర్ర వెంకటేశంకి, రిజిస్ట్రార్, రెక్టర్‌లకు విద్యార్థి సంఘాల తరుపున, విద్యార్థు ల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆదర్శ్, సన్నీ ఇమ్మానుయేల్, ప్రశాంత్, రాజేష్ , విద్యార్థులు బి.తిరుపతి, ఉదయ్, ధర్మ తేజ, శ్రీరామ్, జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసి వనంలో అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో.. నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడి పూజ మహోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, అయ్యప్ప స్వాములు, భక్తులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పీఏసీ చైర్మెన్ అరెకపూడి గాంధీ ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, కాశినాథ్ యాదవ్, పోశెట్టి గౌడ్, ఆదర్శ్, రాజు తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-కూకట్‌పల్లి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 డివిజన్ జీడిమెట్లలోని భారత జనతా పార్టీ జాయింట్ సెక్రటరీ భరత్ సింహ రెడ్డి సోదరుడి వివాహంలో నూతన వధువరులను ఆశీర్వదించిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

అంతర్జాతీయ సెమినార్ వక్తగా ప్రొ. రాజేష్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 24 , 25 తేదీల్లో వియత్నాంలోని హెూచిమిన్ సిటీలో లైవ్ వెల్ యువర్ వేపై జరగనున్న అంతర్జాతీయ సెమినార్‌లో కీలక వక్తగా ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ ఫ్యాకల్టీ డీన్ ప్రొ. రాజేష్ కుమార్. ఫిజికల్ ఎక్సర్‌సైజ్ అనే అంశంపై పై ప్రసంగించనున్నారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం ఆయన ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, మలేషియా, టర్కీ, శ్రీలంక, థాయిలాండ్ మొదలైన అనేక దేశాలలో జరిగిన అంతర్జాతీయ సమావేశాలలో గతంలో స్పీకర్‌గా పాల్గొన్నారు. అయిన తో పాటుగా ఐఎఫ్‌సీఎస్ఎస్ చైర్మెన్ డాక్టర్ ఇమ్మాన్యుయేల్ ఎస్. కుమార్, వెల్నెస్, డాక్టర్ గురునామ్ పై ప్రసంగాన్ని ఇవ్వ నున్నారు. సింగ్, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్, నీల్ గోగ్టే ఇంజినీరింగ్ కాలేజ్ ఆరోగ్యంపై ప్రసంగాన్ని అందిస్తున్నారు.

మహిళలు దేశాన్ని పాలించాలి

- తెలంగాణ రిసెర్చ్ స్కాలర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రేమ్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, దేశాన్ని పాలించే స్థాయికి రావాలని తెలంగాణ రిసెర్చ్ స్కాలర్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. మహిళ యునివర్సిటీ (చాకలి ఐలమ్మ యునివర్సిటీ) వీసీ ప్రొ. సూర్య ధనుంజయ్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మహిళ యునివర్సిటీ మొదటి వీసీ గా నియమితులైనందుకు హర్షం వ్యక్తం చేశారు. యునివర్సిటీలో ఉన్న విద్యార్థినులకు చక్కటి వసతి కల్పించాలని, ఉన్నత విద్యకు ప్రోత్సహించాలని, మహిళ యునివర్సిటీ అభివద్ధికి పాటు పడాలన్నారు. యునివర్సిటీలో ఉన్న పేద, మధ్య తరగతి విద్యార్థుల ఎక్కువగా ఉన్నందున హాస్టల్ వసతి కల్పించాలని, స్కాలర్షిప్ సౌకర్యం కల్పించాలని కోరారు. పరిశోధనలు ప్రోత్సహించాలని ఈ సందర్భంగా వీసీని కోరుతున్నట్టు తెలిపారు.

పేదలకు ఎప్పుడూ అండగా ఉంటా

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

పేదలకు ఎల్లప్పుడూ అన్ని విధాలుగా అండగా ఉంటానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బన్సీలాల్‌పేట డివిజన్ సీసీనగర్‌కు చెందిన కుమారికి మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ. 3 లక్షల ఆర్థిక సహాయం పత్రాన్ని బుధవారం వెస్ట్ మారేడ్ పల్లిలోని కార్యాలయంలో బాధితురాలి భర్త సత్తిబాబుకు ఎమ్మెల్యే అందజేశారు. గత కొద్దిరోజులుగా కుమారి మెద డు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నది. వైద్యులకు చూపించగా పరీక్షలు జరిపి చికిత్స చేయాలని, దానికి భారీగా ఖర్చవుతుందని తెలిపారు. దీంతో రోజువారీ భవన నిర్మాణ కూలీపని చేసుకొని కుటుంబాన్ని పోషించే సత్తిబాబు ఎమ్మెల్యేను కలిసి తన పరిస్థితి వివరించి సాయ ం చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే చొరవతో రూ. 3 లక్షల రూపాయలు మంజూరైనాయి. బీఆర్ఎస్ నాయకులు కుర్మ లక్ష్మీపతి, జనార్దన్, అబ్బాస్, రాము తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అఖిల భారత పశుగణన

- గోడ పత్రికలు ఆవిష్కరించిన కార్పొరేటర్ నరసింహ యాదవ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

21న(నేడు) అఖిల భారత పశుగణన కార్యక్రమం ప్రారంభం కానుంది. బుధవారం ఈ మేరకు కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ కరపత్రాలను, గోడపత్రికల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పాతబోయిన్‌పల్లిలో అందరూ పశుగణాకాల వివరాలు ఇవ్వాలని కోరారు. అంతకముందు, పశు వైద్యశా ాల డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ ఫిబ్రవరి 29 వరకు ఈ పశు గణాంక కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. తిరుమలగిరి బోయిన్‌పల్లి సికింద్రాబాద్ మండల పరిధిలో 22 మంది ఎన్యూ మరేటర్లు, నాలుగు సూపర్వైజర్లు సమాచారం సేకరిస్తారని, ఆవులు, బర్రెలు, మేకలు, గొర్రెలను పెంప కం చేసేవారు వాటి వివరాలను ఎన్యూమనేటర్లు సమాచారం ఇవ్వాలని కోరారు

బాధిత కుటుంబానికి నష్టపరిహారం ఇప్పించిన సీఐటీయూ



నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్‌లో 2023 సంవత్సరంలో వినాయక నగర్ నివా సి, భవన నిర్మాణ కార్మికుడు దత్తు అమీన్‌పూర్ శ్రీవాణి నగర్ లో, బిల్డింగ్ డిస్మెంటల్ చేస్తుండగా ప్రమాదవశాత్తు పై నుంచి రాయి పడి చనిపోయాడు. అయితే బాధిత కుటుంబానికి సంవత్సరం నుండి ఎటువంటి నష్టపరి హారం ఇవ్వలేదు. అనేకమంది లీడర్లను సంప్రదించినా ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. తర్వాత ఆ కుటుంబం సీఐటీయూ నాయకులను కలిసి వారికి జరిగిన అన్యాయాన్ని సీఐటీయూ నాయకత్వం దష్టికి తీసుకొచ్చింది. తర్వాత సీపీఐ(ఎం) నాయకులు టి సాయి శేషగిరిరావు, సీఐటీయూ నాయకులు జోన్ కన్వీనర్ జె స్వామి, డివిజన్ ప్రధాన కార్యదర్శి బి. దేవదాస్ ,జైపాల్‌ల ఆధ్వర్యంలో ఇంటి యజమానిని కలిసి మాట్లాడారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి రూ.4 లక్షల నష్టపరిహారం బుధవారం చనిపోయిన కార్మికుని భార్య శోభ, అతని కుమారుడు జస్వంత్, కుమార్తె సంధ్య, కుటుంబ సభ్యులకు ఇప్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ స్వామి మాట్లాడుతూ సీఐటీయూ కార్మికుల పక్షాన నిలబడి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తుందని తెలిపారు. రహమత్ నగర్ డివిజన్‌లో భవనిర్మాణ కార్మికులకి ఎంతోమందికి లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు ఇప్పించి వాటి ద్వారా ప్రభుత్వం లేబర్ డిపార్ట్మెంట్ నుంచి అనేక బెనిఫిట్స్ నిరంతరం ఇప్పిస్తున్నదని చెప్పారు.

జి.ఓ. నెం.29ని రద్దు చేయాలి

- పి.డి.ఎస్.యు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అనిల్
- ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్రంలోని గ్రూప్-1 నియామకాల భర్తీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనారిటీ వర్గాల అభ్యర్థుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీసే జి.ఓ. నెంబర్. 29ని తక్షణమే రద్దు చేయాలని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.అనిల్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా జీవో 55 పునరుద్ధరించి ఉద్యోగాలు భర్తీ చేయాలని కోరారు. ఓయూ అంబేద్కర్ లైబ్రరీ ముందు జీ.ఓ. నెంబర్. 29 రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ సహాయ కార్యదర్శి రాకేష్, ఓయూ నాయకులు నవీన్, భరత్, ప్రణయ్ రెడ్డి, వినయ్, నవీన్ ఋషికేష్, రాకేష్, గణేష్, లైబ్రరీ విద్యార్థులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

పార్శిగుట్ట మోహన్ రెడ్డి నగర్ లో కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ బుధవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పనులను రూ. 19 లక్షల వ్యయంతో చేపట్టినట్టు తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు.గత ప్రభుత్వంలో మంజూరు అయిన పనులే ఇప్పుడు చేపట్టినట్టు తెలిపారు అనంతరం స్థానికులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

పోస్టర్లు ఆవిష్కరించిన ప్రిన్సిపాల్ ప్రొ. కాశిం



నవతెలంగాణ-ఓయూ

నల్లగొండ ఎన్ జి కాలేజీ గ్రౌండ్‌లో నవంబర్ 23న జరిగే ఉమ్మడి నల్లగొండ జిల్లా మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్స్ ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ. కాశీం బుధవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. విద్యార్థి నాయకుడు వలిగొండ నరసింహ మాట్లాడుతూ ప్రొఫెసర్ కాశిం, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, వివిధ మాదిగ సంఘలా నాయకులు హాజరయ్యే మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి స్వచ్ఛందంగా తరలి రావాలన్నారు. ఎం ఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి డా. పల్లెర్ల సుధాకర్, సీనియర్ విద్యార్థి నాయకుడు పోతరాజు వెంకటేష్, జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ఆర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుమంత్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చెడిపల్లి రఘు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జనపాల మహేష్, రాష్ట్ర నాయకుడు అజయ్ సామ్రాట్, ఓయూ విద్యార్థి నాయ కులు నందు, మధు, ఏర్పులవిజయ్, నకిరేకంటి సతీష్, వంశీ, విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధుల కొరతతో నిలిచిన విద్యాసంస్థల భవనం





- విడుదలయ్యేది ఎప్పుడో ..?..
  నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడో..?
- స్కూల్ ,కళాశాలలో పడిపోయిన అడ్మిషన్‌లు
- తీవ్ర ఇబ్బందుల్లో విద్యార్థులు
- భవనం దెబ్బకి పడిపోయిన అడ్మిషన్స్

నవతెలంగాణ-ఓయూ

ఎన్నో ఏండ్లుగా సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని సీతాఫల్మండి డివిజన్‌లో పేద వర్గాలకు చెందిన సుమారు 1500 మంది విద్యార్థులు చదువుతున్న పురాతన భవనాన్ని కులగొట్టి అక్కడ నిర్వహిస్తున్న హై స్కూల్‌ను ఓయూ మోడల్ స్కూల్ కి, జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలను విద్యా నగర్ లో వివేకానంద కళాశాలకు తరలించారు. ఒకే భవనంలో విద్యాసంస్థల నిలయాన్ని నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 30 కోట్ల మంజూరు చేస్తూ ఉత్తరులను జారీ చేసింది.

హడావుడి కూల్చివేత, నత్తనడకన పనులు

హడావుడిగా గతేడాది సెప్టెంబర్ 23న అప్పటి విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రా రెడ్డి శంకుస్థాపన చేశారు. కొత్త భవనం పేరుతో అక్కడి ఉపాధ్యాయులకు ఎలాంటి సమాచారం లేకుండా విద్యార్థులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా సెలవు దినాలలో భవనాని కూల కొట్టడంతో తీవ్ర దూమరం రేపింది. దీంతో అక్కడ చదువుతున్న విద్యార్థులను చుట్టుపక్కల వివిధ ప్రభుత్వ స్కూళ్లకు పంపించేశారు. అక్కడ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు, మౌలిక వసతులు లేకపోవడంతో సంవత్సర కాలం నుండి విద్యార్థులు సుదూరంగా వెళ్ళవలసి వచ్చింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శంకుస్థాపన చేసిన విద్యాసంస్థల నిర్మాణానికి నూతన కాంగ్రెస్ ప్రభుత్వం 13.03.24న బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ (బీఆర్ఓ), ఆర్డర్ విడుదల చేసినప్పటికీ సంవత్సరం పూర్తయినా నేటికీ నిధుల కొరతతో కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.

నిధులు రాక పనులు నిలిపివేత

భవనాన్ని నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టర్ నిధులు విడుదల కాక పోవడంతో నిర్మాణ పనులు పిల్లర్స్ దశలోనే నిలిపివేశారు. దీంతో భవనం నిర్మాణం పూర్తయ్యేది ఎప్పుడో అందుబాటులోకి వచ్చేది ఎప్పుడో అని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన మౌలిక వసతులు లేకపోవడం వల్ల పేద వర్గాల విద్యార్థులంతా ప్రయివేటు పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు, అదేవిధంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమయ్యే ప్రమాదం నెలకొన్నది కావున కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే కేటాయించిన రూ. 30 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరుతున్నారు.

గతంలో ఈ స్కూల్ లో 1000 మంది విద్యార్థులు ఉండగా నేడు 600, జూనియర్ కాలేజీలో 300 మంది విద్యార్థులు ఉంటే నేడు 160 , డిగ్రీ కాలేజ్ లో 500 మంది విద్యార్థులు ఉంటే నేడు 400కి అడ్మిషన్స్ పడి పోయాయి. దీనంతటికీ కారణం ఈ భవన నిర్మాణమే కారణం అంటున్నారు స్థానికులు.

నిధుల కోసం ఎమ్మెల్యే ఉద్యమించాలి



పేద వర్గాలు చదువుతున్న ప్రభుత్వ విద్య పట్ల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా నిధుల కొరతతో అర్థాంతరంగా ఆగిపోయిన విద్యాసంస్థల భవన నిర్మాణానికి నిధుల విడుదలకు స్థానిక ఎమ్మెల్యే ఉద్యమించాలి. అనేకమార్లు ప్రభుత్వ విద్య బలోపే దానికి పెద్ద పీట వేస్తామని చెప్తున్నా ముఖ్యమంత్రి మాటలు కేవలం కాగితాలకు మాత్రమే పరిమి తమయ్యాయి, ఆచరణలో మాత్రం శూన్యం.

- సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కంపెల్లి శ్రీనివాస్

రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం మార్చి 13న, బీఆర్ఓ ఇచ్చి నిధులు విడుదల చేయకపోవడం బాధాకరం. ఈ విషయం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశాము వారు సీఎం కు లెటర్ రాశారు. బిల్డింగ్ పనుల జాప్యంతో విద్యార్థుల జీవితా లు చెల్లాచెదురుగా అయి స్కూల్ ,కాలేజ్‌లో అడ్మిషన్లు తగ్గిపో వడం బాధాకరం. విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని ఈ విద్యా సంవత్సరం అయినా భవన నిర్మాణం పూర్తి చేయాలి. నిధులు విడుదల కాక కాంట్రాక్టు కూడా పనులు నిలిపివేశారు.

- లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్

లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గంలో 33 మంది లబ్దిదారు లకు బుధవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ పికెట్ క్యాంపు కార్యాల యంలో రూ. 33 లక్షల విలువైన కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం పని చేస్తోందని తెలిపారు.

ఫంక్షన్ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

బోయిన్‌పల్లి చిన్నతోకటలో కాంగ్రెస్ నాయకుడు ముప్పిడి మధుకర్ ఏర్పాటు చేసిన ఎమ్మార్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్‌తో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





ఓయూ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రమేష్ కుమార్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఓయూ

ఓయూ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బుధవారం ఆచార్య వి. రమేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ప్రిన్సిపాల్ ప్రొ. చింత సాయిలు, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్ ప్రొ. ఎస్. శ్రీను నాయక్, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ టెక్స్టైల్ టెక్నాలజీ ప్రొ. జె. హయవదన, హెడ్ ప్రొ. బి. రాజం, డా. టి. జ్యోతి, డా. ఎ. పరశు రాం,డా. సాదం ఐలయ్య, డా.రమేష్,డా. పి. సునిత, డా.నారాయణ, డా.సమీ,డా.కవిత డా.ధీరజ్,డా. అభిలాష్, డా. అజిత్, ఎ. ఆర్. ఓం ప్రకాష్, కళాశాల అధ్యాపకులు, కళాశాల ఉద్యోగులు, విద్యార్థులు, కళాశాల పూర్వ విద్యార్థులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



విద్యకు మొదటి ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

- కార్పొరేటర్ పి. విజయ రెడ్డి

నవతెలంగాణ-బంజారా హిల్స్

విద్యకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతనిస్తున్నదనికార్పొరేటర్,టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి తెలిపారు. వెంకటేశ్వర నగర్ డివిజన్‌లోని పంజాగుట్ట బస్తి కమిటీ వారి విజ్ఞప్తి మేరకు కార్పొరేటర్ స్కూల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ దష్టికి విద్యార్థుల సమస్యను తీసుకువెళ్లారు. అలాగే స్పెషల్ బడ్జెట్‌తో పంజాగుట్టలోని ప్రతాప్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాల (పడవ స్కూల్)లో రూ.15 లక్షల వ్యయంతో 1) బోర్వెల్, ఆర్ఓ ప్లాంట్ 2) విద్యార్థినులకు వాష్‌రూమ్స్ 3) ఎలక్ట్రికల్ లైట్స్, ఫ్యాన్స్ 4) బెంచెస్ అండ్ చైర్స్ 5)డోర్స్ అండ్ విండోస్ రిపేర్ పనులను చేయిస్తున్నారు. జరుగుతున్న పనులను బుధవారం కార్పొరేటర్ పరిశీలించడంతో పాటు ఉపాధ్యాయుల బృందంతో మాట్లాడి ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పంజాగుట్ట బస్తీ కమిటీ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభగల విద్యార్థులకు పొన్నాల ఫౌండేషన్ గోల్డ్ మెడల్..



నవతెలంగాణ-ఓయూ

ఓయూ లైబ్రరీ సైన్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పొన్నాల పౌండేషన్ ద్వారా గోల్డ్ మెడల్ ఇచ్చేందుకు ఓయూ పూర్వ విద్యార్థి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ముందుకు వచ్చారు. ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారంతో చర్చించి తన ఆసక్తిని ప్రతిపాదించారు. ఈ మేరకు ఓయూ నిబంధనల మేరకు రూ.5 లక్షల 50 వేల చెక్కును అందించారు.నగదు డిపాజిట్ పై వచ్చిన ఇంట్రెస్ట్‌తో ఏటా లైబ్రరీ సైన్స్ విద్యార్థికి బంగారు పతకాన్ని అందిస్తారు. ఈ సందర్భంగా ప్రొ. కుమార్ పొన్నాల లక్ష్మయ్యకు వీసీ కతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థిగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది స్నాతకోత్సవం నుంచి పొన్నాల పౌండేషన్ తరపున లైబ్రరీ సైన్స్ లో గోల్డ్ మెడల్ ఇవ్వనున్నట్టు వీసీ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఓయూలో చేపట్టనున్న పలు అభివద్ధి కార్యక్రమాలు చర్చకు వచ్చాయి. ఇందుకు లైబ్రరీ ఆధునికీకరణపై పొన్నాల ఫౌండేషన్ ద్వారా తగిన సహకారం అందిస్తామని పొన్నాల లక్ష్మయ్య హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లైబ్రరీతో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. తాను ఐదవ తరగతి చదువుకునే రోజుల్లో స్వగ్రామం ఖిలాషాపూర్‌లో నెలకు ఒక రూపాయి వేతనానికి గ్రంథపాలకుడిగా పనిచేసే వాడినని అప్పుడు తనకు పుస్తకపఠనంపై ఆసక్తి ఏర్పడిందని తన చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకున్నారు. తాను చదువుకున్న విశ్వవిద్యాలయానికి తిరిగి ఏదైనా చేయాలన్న తన ఆలోచనలను పంచుకున్నారు. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన నేషనల్ లైబ్రరీ వీక్ ముగింపు సందర్భంగా పుస్తక ప్రదర్శనను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఓయూ మెయిన్ లైబ్రరీ ఇన్‌చార్జి లైబ్రేరియన్ డాక్టర్ అచలా మునిగల్ పాల్గొన్నారు.



హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఇంట్లో జీహెచ్ఎంసీ అధికారులు సర్వే నిర్వహించారు. బుధవారం జూబ్లీహిల్స్‌లో సీపీ ఇంటికి వెళ్లిన ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారాన్ని సేకరించారు. సీపీ తెలిపిన వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్ నీరజ, సూపర్‌వైజర్ రాజ్‌కుమార్, వార్డు ఇంచార్జి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆదర్శ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 26వ బ్రాంచ్ ప్రారంభం

- ఆర్.బి.ఐ విశ్రాంత మేనేజర్ శశిధర్ శాస్త్రి చేతుల మీదుగా ఓపెనింగ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్‌పల్లిలో ఆదర్శ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 26వ బ్రాంచ్‌ను బుధవారం ప్రారంభించింది. ఆర్‌బీఐ విశ్రాంత మేనేజర్ శశిధర్ శాస్త్రి ముఖ్యఅతిథిగా పాల్గొని శాఖను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆదర్శ్ బ్యాంకు యజమాన్యం కస్టమర్లకు ఎంతో మంచి సర్వీస్ అందిస్తున్నదని తెలిపారు. అంతకుముందు ఆదర్శ్ బ్యాంక్ చైర్మెన్ మదనగోపాలస్వామి మాట్లాడుతూ బోయిన్‌పల్లి ప్రాంతంలో కస్టమర్లకు కూడా వారి సేవలు అందించేందుకు బ్రాంచ్ చేసినట్టు చెప్పారు. అలాగే వారి బ్యాంకు తక్కువ మొత్తం అప్పులను పూచీకత్తులు లేకుం డానే ఇస్తారని తెలిపారు. బ్రాంచ్‌లో లాకర్ల సదుపాయం, ఏటీఎం సౌకర్యం కూడా ఉందని పేర్కొన్నారు. ఆదివా రాలలో కూడా వారి బ్యాంకు పని చేస్తుందన్నారు. ప్రతి బ్రాంచ్‌లో ఏటీఎంలు ఏర్పాటు చేశారని, బ్యాంక, ఆర్‌బీఐ నిబంధనలు పాటిస్తూ ఎంతో మందికి ఆదర్శంగా ఈ బ్యాంకు సేవలు ఉన్నాయని తెలిపారు. అతి త్వరలో ఆదర్శ్ బ్యాంక్ 50 బ్రాంచీలను ఏర్పాటు చేస్తుందని అన్నారు.. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గంగారావు, సీఈఓ ఎం.వి రమణ, ఏజీఎంలు నాయుడు, శ్రీనివాసరావు, వెంకటేశం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి వార్షిక పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పదోతరగతి వార్షిక పరీక్ష ఫీజు చెల్లింపు గడువును మరో పది రోజులు పొడిగించినట్టు జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 28వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష ఫీజు చెల్లించవచ్చునని డీఈవో సూచించారు. రూ.50 అపరాధ రుసుముతో వచ్చేనెల 10వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చునన్నారు. ఇక రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబర్ 19 వరకు.... రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 30 వరకు చెల్లించవచ్చునని డీఈవో తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇక మూడు సబ్జెక్టులు, అంత కంటే తక్కువ సబ్జెక్టులకు ఫెయిలైన వారు రూ.110 చెల్లించాలనీ, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులు ఫెయిలైన వారు రూ.125 కట్టాలన్నారు. ఒకేషనల్ విద్యార్థులు రూ. 60 చెల్లించాల్సి ఉంటుందనీ, పూర్తి వివరాలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ జూపల్లి నర్సింగ్‌రావు తెలియజేశారు. మరిన్ని వివరాల కోసం https://bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫీజు షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ-సిటీబ్యూరో

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులైన డ్రాయింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు వచ్చే ఏడాది(2025) జనవరిలో జరుగుతాయనీ, ఈ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు పరీక్ష ఫీజులు చెల్లించాలని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారిణి ఆర్.రోహిణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని పరీక్ష ఫీజులు చెల్లించాలని ఆమె సూచించారు. వెబ్ దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకుని వాటిని గన్‌ఫ్రౌండ్‌లోని అలియా జూనియర్ కాలేజీ ప్రాంగణంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సమర్పించవచ్చునని తెలిపారు. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు రూ.100, డ్రాయింగ్ హయ్యర్ పరీక్షకు రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్ పరీక్షకు రూ.150 చొప్పున, టైలరింగ్, ఎంబ్రాయిడరీ హయ్యర్ పరీక్షకు రూ.200 చొప్పున ఫీజులు చెల్లించాలన్నారు. వచ్చే నెల 3వ తేదీ లోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఫీజులు చెల్లించేందుకు అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 10లోపు రూ.50 అపరాధ రుసుంతో, డిసెంబర్ 17లోపు రూ.75 అపరాధ రుసుంతో ఫీజులు చెల్లించవచ్చున్నారు.



రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవి ఇంట్లో సమగ్ర సర్వే.

జీహెచ్ఎంసీ వ్యాప్తంగా విజయవంతంగా సర్వే ..

- ఇప్పటి వరకు మొత్తం 57.30 శాతం సర్వే పూర్తి

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ వావ్యాప్తంగా సర్వే వియవంతంగా జరుగుతున్నది. నగరంలో చేపట్టే సర్వేలో సినీ ప్రముఖులు , ఉన్నతాధికారులు పదవీవిరమణ పొందిన ఐఏఎస్, వివిధ పార్టీల నాయకుల సర్వే సిబ్బంది పూర్తి వివరాలను నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అవకాశాల మెరుగుకు రాజకీయ, కుల సర్వే ప్రకారం ప్రజలకు అవసరమైన పథకాలకు రూపకల్పన చేసేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో సర్వే లో ప్రజలు ఎక్కువ శాతం పాల్గొంటున్నారు.

అందరి సమన్వయంతో సర్వే జిహెచ్ఎంసి వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతున్నది. తప్పులు లేకుండా సర్వేను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఎన్యూమరేటర్లకు సూచనలు, సలహాలు ఇస్తూ ప్రభుత్వ నిర్దేశించిన మేరకు కోడింగ్ ప్రక్రియను సవర్థవంత్తంగా పూర్తి చేయుటకు మానిటరింగ్, నోడల్, జోనల్ అధికారులు విశేష కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎం సీ వ్యాప్తంగా బుధవారం 1,32,656 కుటుంబాల సర్వే పూర్తి కాగా, ఇప్పటి వరకు 13,91,817 కుటుంబాల సర్వే పూర్తి తో..57.30 శాతం సర్వే పూర్తి చేశారు.



బీసీ వర్గాల అభివృద్ధికి సలహాలు, సూచనలివ్వండి

- 23న కలెక్టరేట్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ : డీఆర్వో వెంకట చారి

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ప్రభుత్వం అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తోడ్పడునందించేందుకు నియమించిన బీసీ కమిషన్ ఈనెల 23న బహిరంగ విచారణ చేపట్టనున్నదనీ, బీసీ తరగతులు చెందినవారు సామాజిక, ఆర్థిక, విద్య రంగాలలో సలహాలు, సూచనలివ్వాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) ఈ.వెంకట చారి కోరారు. బుధవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో వివిధ కుల సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల స్థితిగతులను పరిశోధించడానికి బీసీ కమిషన్ ఛైర్మెన్ నిరంజన్, కమిటీ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి బీసీ వెల్ఫేర్ కమిషనర్ సభ్య కార్యదర్శిగా గల బీసీ కమిషన్ ఈనెల 23న జిల్లా కలెక్టరేట్(లక్డికాపూల్)లో ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ చేపట్టనుందన్నారు. వెనుకబడిన తరగతులకు చెందినవారు ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన సూచనలు, సలహాలు కమిషన్‌కు అఫిడవిట్ రూపంలో అందించాలని ఆయన సూచించారు. అఫిడవిట్ ఒరిజినల్ సెట్ ఒకటితో పాటు 5జిరాక్స్ సెట్లను (మొత్తం 6 సెట్లు) ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అఫిడవిట్‌కు ఎవిడెన్స్, సాక్ష్యాలుంటే పటిష్టంగా ఉంటుందన్నారు. అఫిడవిట్ స్వీకరణకు 3 కౌంటర్లు రిసెప్షన్, అప్లికేషన్ వెరిఫై, అసిస్టెన్స్ కోసం సలహాలు, మార్గదర్శనం చేసేందుకు డిప్యూటీ తాసిల్దార్, సహాయ బీసీ సంక్షేమ అధికారులను నియమించామన్నారు. ప్రతి దరఖాస్తును రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. బీసీ వర్గాల అభ్యున్నతికి సలహాలు సూచనలు ఇవ్వడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి.ఆశన్న, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఇలియాజ్ అహ్మద్, సహాయ బీసీ సంక్షేమాధికారి టి.నరసింహులు, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా కోశాధికారి జక్కుల బాలరాజ్ కుమారుడి రిసెప్షన్ సోమవారం చంపాపేట్‌లోని మంద రామ్ రెడ్డి కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. ఈ రిసెప్షన్‌కు టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్), జిల్లా టీఎన్జీవోస్ కార్యదర్శి విక్రమ్ కుమార్, జిల్లా సహాధ్యక్షులు కె.ఆర్.రాజ్ కుమార్, ఉపాధ్యక్షులు కుర్రాడి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీలు ఖాలేద్ అహ్మద్, గీతా, పబ్లిక్ సెక్రటరీ వైదిక్ శస్త్ర, ఈసీ ముఖీద్, ఏపీఆర్వో వహీద్, నిరంజన్ రెడ్డి, హరీష్(డెంటల్), శ్రీనివాస్(మెటర్నటి), ఉస్మాన్, రామకృష్ణ రెడ్డి, మహ్మద్ చౌష్ హాజరై నూతన వధూవరులు ప్రవతిక, మనీష్ సాయిలను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలిపారు.

నవతెలంగాణ-సిటీబ్యూరో

బావమరిదిపై బావ దాడి

- జూబ్లీహిల్స్‌లో పీఎస్‌లో కేసు నమోదు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ఆస్తిలో వాటా ఇవ్వాలని బావమరిదిపై బావ దాడికి పాల్పడిన సంఘటన లంగర్‌హౌస్‌లో చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటగిరిలో నివసిస్తున్న అబ్దుల్ వహీద్ తన చెల్లిని లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న మహమ్మద్ షాహిద్ ఖాన్ కు ఇచ్చి వివాహం చేశాడు. గత కొన్ని సంవత్సరాలుగా మహమ్మద్ షాహిద్ ఖాన్ తన భార్య తండ్రి (మామ) పేరుపై ఉన్న ఆస్తిలో వాటా ఇవ్వాలని కోరుతుండగా రెండు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నవి. అయితే మంగళవారం రాత్రి వెంకటగిరి లోని తన బావమరిది ఇంటికి వచ్చిన బావ మహమ్మద్ షాహిద్ ఖాన్ ఆస్తి పంపకాలు చేయాలని బావమరిదితో గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో హెల్మెట్‌తో బావమరిది అబ్దుల్ వహీద్ తలపై కొట్టాడు. ఇద్దరూ ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అనంతరం గాయపడిన అబ్దుల్ వహీద్ కుమారుడు అబ్దుల్ మోహిత్ తన తండ్రితో కలిసి వచ్చి జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు బాధితుడుని వైద్య పరీక్షల నిమిత్తం హాస్పటల్ పంపించారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎస్సై సోమశేఖర్ మీడియాకు తెలిపారు.

స్పెషల్ డ్రైవ్ పనుల పరిశీలన



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ ఓ అండ్ ఎం డివిజన్-4 పరిధిలో పర్యటించారు. 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఫీల్ ఖానా ప్రాంతంలో జరుగుతున్న సీవరేజ్ డీ-సిల్టింగ్ పనుల్ని ఆయన తనిఖీ చేశారు. సీవరేజ్ ఔట్ లెట్ సమస్య, ఏఎంఎస్ కింద జరుగుతున్న పనుల్ని పరిశీలించారు. అంతే కాకుండా గౌలిగూడ సెక్షన్ లో బిల్లింగ్, కలెక్షన్స్, మీటర్ రీడర్స్ పనితీరు, ఓటీఎస్ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ పర్యటనలో ఈడీ వెంట జీఎం, డీజీఎం, మేనేజర్లు ఉన్నారు.

ఫుట్ పాత్‌ను ఆక్రమిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఫుట్ పాత్ ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్ అన్నారు. బుధవారం బొగ్గులకుంట, ఎల్బీ స్టేడియం తదితర ప్రాంతాల్లో జాయింట్ ఆపరేషన్ రుప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫుట్ పాత్‌లను సొంత వ్యా పారాల కోసం ఆక్రమించి వినియోగించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎల్. రవికుమార్, సుల్తాన్ బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎస్. రాంబాబు పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కచ్చా మోరీ పనులు నత్తనడక



- పనులు త్వరగా పూర్తి చేయాలి: కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవ తెలంగాణ-ముషీరాబాద్

కచ్చా మోరీ పనులు నత్తనడకన సాగుతున్నాయని త్వరగా పూర్తి చేయాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని జవహర్ నగర్ మెయిన్ రోడ్‌లో 50 లక్షలతో ఆర్టీసీ క్రాస్ రోడ్ నుంచి ఇందిర పార్క్ వెళ్లే దారిలో జవహర్ స్కూల్ వద్ద కచ్చా మోరి పనులను సంబంధిత అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ.. నిధులు మంజూరైన కూడా జీహెచ్ఎంసీ అధికారులు ట్రాఫిక్ పోలీసుల సమన్వయ లోపం కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. వాహనదారులకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ పోలీసులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఏ.వినయ్ కుమార్, బీజేపీ నాయకులు శ్రీకాంత్, ఉమేష్ నర్సింగ్ రావు, సత్యం, సురేందర్, సురేష్, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

సీజనల్ వ్యాధుల పట్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుల్తాన్ బజార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి బుధవారం ఓ ప్రకటన లో అన్నారు. ఈ సందర్భం గా అమె మాట్లా డుతూ.. సుల్తాన్ బజార్ పట్టణ ప్రా థమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నమన్నారు. చలికాలం మొదలైందని డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దోమల వల్ల చికున్ గున్యా వస్తుందని ఇందులో లక్షణాలు ప్రదానంగా కీళ్లలో తీవ్రమైన నొప్పిని కలిగిస్తుందని ఎల్లో ఫీవర్ దోమల ద్వారా మాత్రమే వ్యాపిస్తుందని చెప్పారు. టైఫాయిడ్ సాధారణ వ్యాధి అని నీల్లు లేదా కలుషితమైన, అపరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడం వల్ల వస్తుందన్నారు. ఇది సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాపిస్తుందని ఇందులో జుట్టు రాలడం, బరువు తగ్గడం, కండరాల బలహీనత వంటివి ఉండవచ్చని శరీరంలో అధిక జ్వరం, తలనొప్పి, ఇన్ఫెక్షన్ ఉంటాయని తెలిపారు. వైరల్ జ్వరం దీనిని సీజనల్ ఫీవర్ అని అంటారని వాతావరణంలో మార్పుల కారణంగా, ప్రధానంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు దీని బారిన పడుతుంటురన్నారు. దీని ప్రధాన లక్షణాలు జలుబు-దగ్గు, తరచుగా తుమ్ములు, తలనొప్పి లక్షణాలు ఉంటాయన్నారు. డెంగ్యూ వ్యాధి దోమలు కుట్టడం ద్వారా వ్యాపిస్తుందన్నారు. దోమ కాటు వల్ల కీళ్ల నొప్పులు, ప్లేట్లెట్స్ పడిపోవడం, బలహీనత ఏర్పడతాయన్నారు. ప్రజలు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యాధి లక్షణాలు కనబడితే వెంటనే వైద్యుని సంప్రదించాలని సూచించారు.

వివాహ వ్యవస్థ పటిష్టతకు కృషి చేయాలి



నవతెలంగాణ-ముషీరాబాద్

భారతీయ వివాహ వ్యవస్థ పటిష్టతకు మ్యారేజ్ బ్యూరోలు కృషిచేయాలని సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆలిండియా మ్యారేజ్ బ్యూరోస్ అసోసియేషన్ జాయింట్ యాక్షన్ కమిటీ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దైవజ్ఞశర్మ హాజరై మాట్లాడుతూ. భారతదేశంలో వివాహ వ్యవస్థకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. వివాహ వ్యవస్థను పునరుద్ధ రించడానికి మ్యారేజీ బ్యూరోలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా జేఏసీ ఏర్పడటం హర్షణీయమని తెలిపారు. ఆల్ ఇండియా మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ జేఏసి చైర్మన్ అర్జున్ రావు మ్యారేజ్ బ్యూరోలను ప్రభుత్వం గుర్తించి గుర్తింపుకార్డులు ఇవ్వాలన్నారు. మ్యారేజ్ బ్యూరోలపై వేధింపులను ఆపాలని ఆయన కోరారు. ప్రభుత్వ పరంగా అన్ని సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మ్యారేజ్ బ్యూరో అసోసియేషన్ జేఏసీ నాయకులు హరినాథ్ గౌడ్, కల్పనా రెడ్డి, వీరభద్రారెడ్డి, డి.పురుషోత్తం, పట్టాభిరా మయ్య, సాయిప్రసాద్, చంటిబాబు, జి.నాగమణి, షేక్ రఫీ, తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

అంతా మాయా బజార్

- పైన నిగ నిగ... లోన నాసీరకం
- తాగే పాల నుంచి ప్రతి వస్తువూ కల్తీ చేస్తున్న కల్తీరాయుళ్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

'కల్తీకి కాదేది అనర్హం' అన్న చందంగా మార్కెట్‌లో ప్రతి వస్తువును కల్తీచేస్తున్నారు... పైన కవర్‌చూస్తే బ్రాండెడ్ పేరుతో అందంగా కనిపిస్తోంది. లోన చూస్తే కుళ్లిపోయినవి, నాసిరకంగా ఉంటున్నాయి. ఈ మాయా బజార్‌లో ఏది కల్తీయో.. ఏది స్వచ్ఛమైనదో తెలియక... నగర వాసుల్లో అయోమయం నెలకొంది. గరంమసాలాలు, అల్లంపేస్టు, కారం పొడి, మంచినీళ్ల నుంచి వంటనూనె, ఆహారపదార్థాలు, డిస్టిల్డ్ వాటర్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు, హెూటళ్లలో ఇలా అన్నీ కల్తీ మయమవుతున్నాయి. ఏది తింటే ఏమవుతుందో తెలియక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. కల్తీపై కొరడా ఝుళిపించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పాలప్యాకెట్ నుంచి....

నగరంలో ఎటూ చూసిన కల్తీ ఆహారం... కల్తీ పదార్థాలను ప్రజలకు అంటగడుతున్నారు. పాల ప్యాకెట్ నుంచి తాగేనీరు, నిత్యావసర వస్తువుల వరకు అన్నీ కల్తీచేస్తున్నారు. వీటిని అరికట్టాల్సిన యంత్రాంగం నిద్రావస్తలో ఉంది. కల్తీరాయుళ్లతో కొందరు ప్రభుత్వ యంత్రంగంలో పనిచేసేవాళ్ల కుమ్మక్కయినట్లు ఆరోపణలున్నాయి. మార్కెట్‌లో ఏదీ కల్తీ, ఏదీ అసలు అనేది గుర్తించలేని విధంగా తయారయ్యింది. కల్తీ ఆహారపదార్థాలు తినడంతో క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, మధుమేహం ఇలా ఎన్నో రకాల జబ్బులకు నగర ప్రజలు బలవుతున్నారు. దీనికి ప్రధాన కారణం కల్తీ ఆహారపదార్థల వాడకమేనని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కల్తీలను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. నగరంలో తూతూమంత్రంగా దాడులు నిర్వహిస్తున్న అధికారుల ఆ తర్వాత నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు.

అటు పోలీసులు, ఇటు జీహెచ్ఎంసీ అధికారులు

గ్రేటర్‌లో ఆహార పదార్థాల కల్తీని నిరోధించాల్సిన జీహెచ్ఎంసీ అది మన పని కాదన్నట్టుగా వ్యవహరిస్తోంది. మా వద్ద తగినంత సిబ్బంది లేరు అన్నట్టుగా ఆ విషయాన్ని గాలికి వదిలేశారు. అడపాదడపా దారులు చేస్తూ మేమున్నామంటూ చెప్పుకునేలా పనిచేస్తు న్నారు. ఇదిలావుండగా క్షేత్రస్థాయిలో ప్రతి గల్లీలో పోలీ సులు గస్తీ నిర్వహిస్తుంటారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్ మొబైల్ పార్టీలకు ఎక్కడ ఏం జరుగుతుందో ఎక్కువగా తెలిసే అవకాశముంది. అయితే పోలీసులు కూడా అది మన పనికాదు, జీహెచ్ఎంసీది, మనం కేసులు రాసినా దానిని తిరిగి జీహెచ్ఎంసీ, ఫుడ్‌సేఫ్టి విభాగాలకు అప్పగి ంచాలి, ఆ కేసు నిలిచేది కాదు అనే ధోరణిలో ఉన్నారని విమర్శలు ఉన్నాయి. ఎంతో కష్టపడి కల్తీరాయుళ్లను పట్టు కుంటే వారికి శిక్ష పడేది కాదు, ఎందుకు ఆ రిస్క్యూ అన్నట్లుగా వారు వ్యవహరిస్తున్నారు. ఇదిలావుండగా అటు పోలీసులు, ఇటు జీహెచ్ఎంసీ సిబ్బంది కొందరు కల్తీ రాయుళ్లతో చేతులు కలిపి, నెలవారి మాముళ్ల కూడా తీసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి.

కల్తీల తయారీకి హైదరాబాద్ అడ్డా...

నాణ్యతలేని నకిలీ మాసాలాలు, మురిగిపోయిన కూరగాయలు, కుళ్లిపోయిన మటన్, చికెన్‌తో హెూటళ్లలో కల్తీ ఆహారాన్ని అందిస్తున్న సంఘటనలు తాజాగా వెలుగు చూస్తున్న విషయం తెలిసిందే. బయట పుడ్ కంటే ఇంట్లో చేసుకోవడం మేలంటూ మార్కెట్లకు వెళ్లి వస్తువులను తీసుకొస్తే అందులోను కల్తీ వస్తువులే ఉంటున్నాయి. దీంతో దిక్కుతోచని స్థితిలో నగర ప్రజలు మానసిక వేదను అనుభవిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్నామంటే ఒక పక్క కాలుష్యం, మరో పక్క ట్రాఫిక్‌తో బయట నరకం అనుభవిస్తుంటే, ఇంట్లోకి వెళ్లిన తరువాత భోజనం చేయడానికి వెళ్తే మనం వాడుతున్నవన్ని అసలైన వస్తువులేనా అనే అనుమానాలు కల్గుతున్నాయి. ఇలా నగర ప్రజలు తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురవుతున్నారు. కారం పొడి, గాసాలు, అవాలు, జీలకర, బాదం, మంచినూనే, పప్పులు ఇలా అన్ని ఆహారపు వస్తువులు కల్తీ తయారవుతున్నాయి. కాలనీలు, బస్తీలలోని చిన్న చిన్న కిరణా దుకాణాలే కాకుండా హెూల్‌సెల్, రిటైల్‌లో విక్రయాలు సాగించే బేగంబజార్, సిద్ధిఅంబర్ బజార్, షా యినాయత్‌గంజ్, మలక్‌పేట్ ఆబిడ్స్, కోఠి, సికింద్రాబాద్, అఫ్జల్‌గంజ్, చార్మినార్ తదితర ప్రాంతాలలో కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు సాగుతున్నాయి.

రసాయనాలు ఉపయోగించి

బ్రాండెడ్ కారం పొడిలో నాణ్యత లేని కారం కలపడం, పాలు, అవాలు తయారీలో యాసిడ్స్, కలర్స్ కలపడం, జీలకరలో యాసిడ్స్, బాదంకు జాబు రంగు రుద్దడం ఇలా కల్తీ ఆహారపు వస్తువులు ఫ్రెస్‌గా ఉన్నట్లు రాసాయనాలు ఉపయోగించి కల్తీరాయుళ్లు తయారు చేస్తు న్నారు. ఎక్కువగా నగర శివారు ప్రాంతాలలో తమ కార్ఖా నాలను నిర్వహిస్తున్నారు. కాటేదాన్, శంషాబాద్, కొత్తూరు, శామీర్‌పేట్, చౌటుప్పల్, బండ్లగూడ, మేడ్చల్ ఇలా ఔటర్ రింగురోడ్డు పరిసర ప్రాంతాలలో చాల మంది గుటు చప్పుడు కాకుండా కల్తీ ఆహారపదార్థాలను తయారు చేస్తు న్నట్లు సమాచారం. ఇక్కడ తయారైనా కల్తీ వస్తువు లలో చాల వాటికి అసలైన వస్తువుల స్టిక్కర్స్ వేసి మార్కెట్లోకి రిలీజ్ చేయడం, మరికొన్ని సొంత కంపెనీల స్టి క్కర్లతో మార్కెట్‌లోకి పంపిస్తున్నారు. ఇప్పటికైనా క్షేత్ర స్థా యిలో అధికారులు నిఘా వేసి నిరోధించాల్సిన అవసరముంది.

ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర

- పీడీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్రలను మానుకోవాలని పీడీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ఫీజుల బకాయిల విడుదలలో కాంగ్రెస్ పాలకుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ బుధవారం బషీర్ బాగ్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నాగరాజు, కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో లక్షలాది మంది పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ ప్రయివేట్ కళాశాల యాజమాన్యాలు నవంబర్ 19వ తేదీ నుంచి సమ్మె చేస్తుండడంతో రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల పరిధిలోని డిగ్రీ, పీజీ విద్యార్థులు తరగతులకు హాజరయ్యే అవకాశం లేకుండా ఆందోళనకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ మూడవ, ఐదవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెలలో జరుగుతున్నందున విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేట్ కళాశాలల యాజమాన్యంతో చర్చించి వారి డిమాండ్‌కు అనుగుణంగా వెంటనే రూ.8 వేల కోట్ల పెండింగ్ ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ ఫీజు బకాయి నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది విద్యా సంవత్సరం మొదలవగానే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయడానికి గ్రీన్ ఛానల్ విధానం అమలు చేయాలని కోరారు. విద్యా శాఖ మంత్రిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి వెంటనే ఈ అంశంపై సమీక్ష సమావేశం నిర్వహించాలని, ప్రయివేట్ విద్యా సంస్థలు చేస్తున్న ఈ సమ్మెను విరమింపజేయాలని, అదే విధంగా క్రమక్రమంగా ప్రయివేట్ విద్యా సంస్థలను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు పూనుకోవాలని కోరారు. డిగ్రీ, పీజీ కళాశాలలు, యూనివర్సిటీలలో లెక్చరర్, ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.హరీష్, రాజశేఖర్, కోట ఆనంద్, విద్యార్థులు లక్ష్మీకాంత్, పవన్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జనాభాను బట్టి రిజర్వేషన్ అమలు చేయాలి

- తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

కులల వారీగా జనాభాను బట్టి రిజర్వేషన్ అమలు చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మెన్ వెంకటేశ్వరరావును తన కార్యాలయంలో కలిసి బీసీలకు, గౌడ్స్‌కు న్యాయంగా రావాల్సిన హక్కులపై వినతి పత్రం అందజేశారు. అనంతరం చైర్మెన్ బాలగౌని బాల్ రాజ్ గౌడ్, రాష్ట్ర కన్వీనర్, అయిలి వెంకన్న గౌడ్‌లు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన సర్వే దాదాపుగా పూర్తి కావచ్చిందని మెత్తం జనాభాలో సగానికిపైగా బీసీలు ఉంటే అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని వివిధ కులాల వారిగా వారి వారి జనాభాను బట్టి రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం బీసిల హక్కులను కాలరాసిందని విమర్శించారు. ఉన్న రిజర్వేషన్లను కుదించి స్థానిక సంస్థలలో, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో అన్యాయం చేసిందన్నారు. చట్టసభలలో రాజకీయ రిజర్వేషన్లు వచ్చేంతవరకు మా పోరాటం ఆగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ చైర్మెన్ యెలికట్టే విజయకుమార్ గౌడ్, బీసీ కుల సంఘాల చైర్మన్ కుందారం గణేష చారి తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలిస్తాం





నవ తెలంగాణ-ముషీరాబాద్

బాల కార్మిక వ్యవస్థను పూర్తిస్థాయిలో నిర్మూలిస్తామని కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ అన్నారు. బుధవారం ఆశ్రయ్ ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలల దినోత్సవం పురస్కరించుకొని చిన్నారులతో కలిసి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్, ఏంవిఎఫ్ ఫౌండేషన్ వెంకటరెడ్డి హాజరై మాట్లాడారు. 18 సంవత్సరాలలోపు చిన్నారులంతా బడిబాట పట్టేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. చిన్నారులు బడిబాట పడితే వారి భవిష్యత్ బంగారుబాట పడుతుందన్నారు. చిన్నారులను దుకాణాలలో గానీ ఇతర సంస్థలలో గానీ చేర్చుకుని పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దకాణాలలో చిన్నారులతో పనులు చేయిస్తే ప్రజలు తమకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాలిని, ఆశ్రయ ఫౌండేషన్ సెక్రెటరీ మల్లారెడ్డి, అంకిత ఫౌండేషన్ స్టీఫెన్ డానియల్, ఆర్ఎఫ్ఐ సీనియర్ మేనేజర్ శ్రీలతలతో పాటు బాల తేజస్సు, ఆశ్రిత, అనురాగ్ ఫౌండేషన్, అంకిత ఫౌండేషన్, అమన్ వేదిక, లాలపేట్ ఆశ్రయ్ బాయ్స్ హెూం, వరల్డ్ విజన్ ఇండియా, నైటంగిల్, బ్లూ ఫౌండేషన్, ఎస్ ఆర్ డి, ఆర్ఎఫ్ఐ తదితర స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రజక ఫిషర్‌మెన్ జిల్లా కమిటీల నియామకం



నవతెలంగాణ-ముషీరాబాద్

రజక ఫిషర్‌మెన్ 11 జిల్లాల కమిటీల నియామకంను బుధవారం బాగ్లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రజక ఫిషర్మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ రాష్ట్ర వ్యవస్థాపక చైర్మెన్ ఆమనగంటి సైదులు నియమించారు. సూర్యాపేట జిల్లా అధ్యక్షులు పూసపెల్లి శ్రీనివాస్, యాదాద్రి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ నరసింహులు, కరీంనగర్ జిల్లా అధ్యక్షులుగా రాగల రమేష్, నల్గొండ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శేఖర్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు ఆరెల్లి శేఖర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులుగా ఏ.సాయన్న, సిరిసిల్ల అధ్యక్షులుగా అమ్మనూరి రమేష్‌ను ఎన్నుకున్నారు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా ఆలేటి మల్లేష్‌ని నియమించారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

- పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలి
- కాంగ్రెస్ తెచ్చిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి కాంగ్రెస్సే తూట్లు పొడుస్తోంది
- ఏఐఎస్ఎఫ్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, సహాయ కార్యదర్శి జి.నరేష్ ఆరోపించారు. ఫీజు బకాయిల విడుదలపై ఆనాడు సీఎం ఎ.రేవంత్ రెడ్డి చెప్పింది ఏంటని, నేడు చేస్తున్న జాప్యం ఏంటని, రాష్ట్ర సర్కార్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతూ విద్యార్థుల పట్ల వివక్షతను చూపుతుందని అన్నారు. ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం హిమాయత్ నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయం ఎదుట పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కార్యకర్తలు, విద్యార్థులు కళ్ళకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి విద్యార్థుల పోరాటం వారి తల్లిదండ్రుల సహకారం ఉందన్న విషయం రాష్ట్ర సీఎం ఎ.రేవంత్ రెడ్డి గుర్తు పెట్టుకోవాలన్నారు. పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు రూ.7,650 వేల కోట్లు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా 13 లక్షల మంది విద్యార్థులు అనేక ఆర్థికపరమైన అవస్థలు ఎదుర్కొంటున్నారని, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర వృత్తి విద్య కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు వివిధ రకాల ఎంట్రన్స్‌లలో మంచి ర్యాంకులు సాధించినప్పటికీ, ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలలలో డబ్బులు కట్టి టీసీ ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకోలేక ఉన్నత చదువులను మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని, ఫీజు బకాయిలు చెల్లించక పోవడంతో ప్రయివేటు కళాశాలల యామా న్యాలు ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోం టున్నాయన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయటంలో నిర్లక్ష్యం వహించి ందని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు ఒకే సారి విడుదల చేస్తామని చెప్పిన ఆనాటి పీసీసీ అధ్యక్షులు, నేటి సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 11 నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిల విడుదల చేయటంలో నిర్లక్ష్యం చేయటం సిగ్గుచేటని, పాలకులు మారిన విద్యార్థుల జీవితాలు మారటం లేదని, ఫీజు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదని, విద్యా శాఖ తన వద్దే పెట్టుకున్న సీఎం విద్యా శాఖకు నిధులు కేటాయిం చకుండా విద్యార్థుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆందో ళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఉద్యమాలు ఉధృతం చేస్తూ ప్రభుత్వంపై పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య, ఓయూ అధ్యక్షులు లెనిన్, జిల్లా సహా య కార్యదర్శి అనిల్ కుమార్, నాయకులు హర్ష, పవన్, వెంకట్, శింబు, వంశీ, విజయ్, కురుమూర్తి, అరుణ్, మనోజ్, శివకుమార్, రంజిత్,సుదర్శన్, రఘు, రాజేందర్, అశోక్, సాయికుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

సర్వే అనంతరం లెక్కలు బహిర్గతం చేయాలి

- బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణ యాదవ్



నవతెలంగాణ-ముషీరాబాద్

సమగ్ర కుటుంబ సర్వే అనంతరం కులాల లెక్కలు బహిర్గతం చేయాలని బీసీ జాగృతి సేన వ్యవస్థాపక అ ధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. ఈ మేర కు బుధవారం బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మెన్ భూసాని వెంకటేశ్వరరావును తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. సమగ్ర కుటుంబ సర్వే పూర్తయిన వెంటనే సమగ్ర కులాల లెక్కలు బహిరంగంగా ప్రకటించి స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, విద్యా, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, పారిశ్రామిక,, ప్రయివేట్ రంగాలతో పాటు, చట్టసభలలో కూడా, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన ప్రకారం బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి, బీసీల అభివృద్ధి కోసం ప్రతి వార్షిక బడ్జెట్‌లో 50వేల కోట్లు కేటాయించాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం కాకుండా జనాభా దామాషా నిష్పత్తిన రిజర్వేషన్లు కల్పించాలని లేనియెడల బీసీ జాగృతీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బీసీ గురుకులాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆహారం కల్తీ వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.



కందతో కమ్మనైన...

మార్కెట్‌లో అనేక రకాల కూరగాయలు అందుబాటులో ఉన్నాయి. కొంతమందికి తెలియని కూరగాయల్లో కంద దుంప కూడా ఒకటి. ఇది డయాబెటిక్ రోగులకు దివ్యౌషధమని చెబుతారు. చాలా మంది దీనిని తినటానికి ఇష్టపడరు. కానీ, కందలో ఎన్నో పోషకాలు, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్, బీటా కెరోటిన్ గుణాలు అధిక మొత్తంలో ఉంటాయి. దీంతో శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. తగిన మోతాదులో కేలరీలు, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, పొటాషియం, ఫైబర్ ఉంటాయి. అలాగే ఇందులో అధికంగా ఉండే విటమిన్ ఏ చర్మానికి మేలు చేస్తుంది. దీనిని రెగ్యూలర్ ఆహారంలో చేర్చుకోవటం వల్ల చెడు కొలెస్ట్రాల్‌ను తొలగించి మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తుంది. ఇది అధిక బరువు ఉన్నవారికి ఈ కూరగాయతో మంచి ప్రయోజనం కలుగుతుంది. మహిళల్లో ఈస్ట్రోజన్ ఉత్పత్తిని పెంచుతుంది. కీళ్ల నొప్పులను నివారిస్తుంది. అలాగే గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉండుట వలన డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలో చక్కెర స్థాయిలు హెచ్చుతగ్గులు లేకుండా నియంత్రణలో ఉండేలా చేస్తుంది. ఎన్నో పోషక విలువలున్న దీంతో చేసుకునే కొన్ని రకాల వంటలు మీ కోసం....

కోఫ్తా కర్రీ

కావలసినవి: కంద - 1/4 కిలో, పుట్నాలపప్పు- ఒకటిన్నర టీ స్పూన్లు, దాల్చినచెక్క - చిన్న ముక్క, లవంగాలు -



2, ఎండుమిర్చి - 8, వెల్లుల్లి 3 పాయలు, ఉప్పు - తగినంత, బ్రెడ్ ముక్కల పొడి - మూడు స్పూన్లు, శెనగపిండి - ఒకటిన్నర టీ స్పూను, సన్న ఉల్లిపాయ ముక్కలు - రెండు స్పూన్లు, పుదీనా, కొత్తిమీర ఆకు - నూనె - వేయించడానికి సరిపడా. గ్రేవీకి కావల్సినవి: ఉల్లిపాయ ముక్కలు - ఒక స్పూను, టమాటా పేస్టు - అర కప్పు, పసుపు - అర స్పూను, కారం - ఒక స్పూను, దనియాలపొడి - ఒక స్పూను, జీలకర్ర పొడి - ఒక స్పూను, గరంమసాల - ఒక స్పూను, ఉప్పు - తగినంత, నూనె - కొద్దిగా.

తయారీ విధానం: కందను బాగా కడిగి తొక్క తీసి పల్చని ముక్కలుగా కోసి ఉంచుకోవాలి. వెడల్పాటి గిన్నెలో నీళ్ల పోసి నీళ్లు మరుగుతున్నప్పుడు ముక్కలు అందులో వేసి కొద్దిసేపు ఉడికించాలి. స్టౌ మీద నుండి దింపి మూత పెట్టి 10 నిముషాలు అలాగే ఉంచాలి. తర్వాత ముక్కలని గుడ్డపై వేసి ఆరబెట్టాలి. ఎండుమిర్చి, పుట్నాలపప్పు, మసాలా దినుసులు కలిపి మిక్సీలో పొడి చేసుకోవాలి. వెల్లుల్లి, ఉప్పు, కంద కలిపి గ్రైండ్ చేసుకోవాలి. కొద్దిగా పేస్టు గ్రేవీలో కలుపుకోవడానికి పక్కన పెట్టి ఉంచుకోవాలి. కంద పేస్టుకి పుదీనా, కొత్తిమీర, బ్రెడ్‌ముక్కలు, శెనగపిండి కలుపుకోవాలి. చిన్న ఉండలుగా చేసి నూనెలో వేయించి పక్కన పెట్టుకోవాలి.

ఇపుడు గ్రేవీ తయారుచేసుకోవాలి. దీని కోసం వెడల్పాటి మూకుడులో ఉల్లిపాయ, పచ్చిమిర్చి, అల్లం, వెల్లుల్లి పాయలు వేసి వేపుకోవాలి. ఆ తర్వాత టమాట పేస్టు, ఉప్పు, ఇతర పొడులు వేసి కలపాలి. కొద్ది నిముషాల తర్వాత కంద పేస్టు, తగినంత నీరు కలిపి గ్రేవీ చిక్కబడే వరకు మరిగించాలి. వడ్డించే పాత్రలో ముందుగా వేపి పెట్టుకున్న కంద కోఫ్తాలను అమర్చి, వాటిపై తయారు చేసుకున్న వేడి వేడి గ్రేవీ పోయాలి. అంతే కొత్తిమీరతో అలంకరించి వేడిగా వడ్డించుకోవటమే.

నిల్వ పచ్చడి

కావలసిన పదార్థాలు : తురిమిన కంద - నాలుగు కప్పులు, చింతపండు - ఒక కప్పు, కారం - ఒక కప్పు, ఉప్పు - అర కప్పు, పసుపు - ఒక స్పూను, మెంతు పొడి - ఒక స్పూను, అల్లం వెల్లుల్లి పేస్టు - రెండు స్పూన్లు. తాలింపుకు : పల్లీ నూనె - రెండు కప్పులు, ఆవాలు - రెండు స్పూన్లు, శెనగపప్పు - ఒక స్పూను, మెంతులు - ఒక స్పూను, వెల్లుల్లి - పది, కరివేపాకు - కొద్దిగా.



తయారీ విధానం : ముందుగా కందను బాగా కడిగి తొక్కతీసి ఆరబెట్టాలి. అది బాగా ఆరిన తర్వాత తురిమి కొద్దిగా నూనె వేసి లైట్‌గా వేయించుకుని పక్కనపెట్టుకోవాలి. ఆ తర్వాత చింతపండు గుజ్జును ఓ బాండీలో వేసి చిక్కగా అయ్యే వరకూ ఉడికించుకోవాలి. మరో బాండీ తీసుకుని అందులో నూనె పోసుకోవాలి. నూనె వేగిన తర్వాత తాలింపు గింజలు, కరివేపాకు, వెల్లుల్లిపాయలు వేసుకోవాలి. అవి వేగాక స్టవ్ ఆఫ్ చేసి నూనెను చల్లారనివ్వాలి. ఈ లోపు వేయించుకున్న కంద తురుములో కారం, ఉప్పు, పసుపు, మెంతు పొడి, ముందుగా ఉడికించుకున్న చింతపండు వేసి కలుపుకోవాలి. ఆ తర్వాత తాలింపు వేసిన నూనె కూడా వేసి బాగా కలుపుకోవాలి. ఇది దాదాపు 20 నుంచి 30 రోజుల వరకూ నిల్వ ఉంటుంది. వేడి వేడి అన్నంలో తింటే రుచి ఎంతో బాగుంటుంది.

వడలు

కావలసిన పదార్థాలు : కంద - అరకిలో, శెనగపిండి - మూడు స్పూన్లు, బియ్యం పిండి - మూడు స్పూన్లు, ఉల్లిపాయలు - రెండు, పచ్చిమిర్చి - ఆరు, జీలకర్ర - ఒక స్పూను, వాము - ఒక స్పూను, కరివేపాకు, కొత్తిమిర - కొద్దిగా. ఉప్పు - రుచికి సరిపడా, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ విధానం : కందను శుభ్రంగా కడిగి ముక్కలుగా కోసుకోవాలి. వాటిని మరీ మెత్తగా కాకుండా మరీ గట్టిగా కాకుండా ఉడికించుకోవాలి. అవి చల్లారిన తర్వాత చేతితోనే గుజ్జులా చేసుకోవాలి. అందులో శెనగపిండి, బియ్యం పిండి వేసి బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత ఉల్లి తరుగు, పచ్చిమిర్చి తరుగు, జీలకర్ర, వాము, కరివేపాకు, కొత్తిమిర తరుగు, ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. బాండీలో నూనె పోసి



బాగా కాగిన తర్వాత అందులో కలిపిపెట్టుకున్న కంద పిండిని చేతిలో చిన్న చిన్న వడలుగా చేసుకొని వేసుకోవటమే. కరకరలాడే కంద వడలు సిద్ధం. పిల్లలు ఎంతో ఇష్టంగా తింటారు.

పులుసు

కంద - పావుకిలో, నూనె - నాలుగు స్పూన్లు, ఆవాలు, - ఒక స్పూను, జీలకర్ర- ఒక స్పూను, మెంతులు - ఒక స్పూను, పచ్చిమిర్చి - నాలుగు, ఉల్లిపాయ - పెద్దది ఒకటి, అల్లం వెల్లుల్లి పేస్టు - ఒక స్పూను, కరివేపాకు, కొత్తిమిర - కొద్దిగా, చింతపండు - పెద్ద నిమ్మకాయ సైజు అంత, బెల్లం - కొద్దిగా. ఉప్పు - తగినంత.

స్టవ్ వెలిగించుకుని బాండీ పెట్టుకోవాలి. అందులో ముందుగా నూనె



వేసుకోవాలి. నూనె కాగిన తర్వాత అందులో ఆవాలు, జీలకర్ర, మెంతులు వేసి వేపుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలను వేసి వేపుకోవాలి. అవి వేగాక అల్లం వెల్లుల్లి పేస్టు వేసి వేయించుకోవాలి. అందులో కొద్దిగా కరివేపాకు వేసుకోవాలి. పసుపు, ఉప్పు, కారం వేసుకోవాలి. ఆ తర్వాత చిన్నగా తరిగిన కంద ముక్కలను వేసి పచ్చివాసన పోయే వరకూ వేయించుకోవాలి. ఇప్పుడు కొద్దిగా నీళ్ల పోసి కంద ముక్కలు 60 శాతం ఉడకనివ్వాలి. అవి ఉడికాక, కొద్దిగా పలుచగా తీసిపెట్టుకున్న చింతపండు గుజ్జును పోసుకోవాలి. పులుసు కాస్త చిక్కబడేవరకూ ఉడికించుకొని అందులో బెల్లం వేసి మరో అయిదు నిమిషాలు చిన్న మంట మీద ఉడకనివ్వాలి. ఆ తర్వాత కొత్తిమిర తరుగు వేసి స్టవ్ ఆఫ్ చేయటమే. ఎంతో రుచికరమైన కంద పులుసు రడీ.

కొబ్బరి నూనె కర్పూరంతో...

ఈ రోజుల్లో జుట్టు రాలడం, చుండ్రు, దురద వంటివి సర్వసాధారణమై పోతున్నాయి. చాలా మంది మార్కెట్‌లో రసాయనాలు అధికంగా ఉండే షాంపూలు, కండిషనర్‌లను ఆశ్రయిస్తారు. వీటివల్ల ఫలితాలను పక్కనపెడితే.. కొన్నిసార్లు దుష్ప్రభావాలను కూడా కలిగిస్తాయి. రసాయనాలు స్కాల్ప్ ఇన్ఫెక్షన్లకు కారణమవుతాయి. దీంతో ఫంగస్‌కూడా పెరుగుతుంది.

స్కాల్ప్ నుండి జెర్మ్స్, బ్యాక్టీరియాను తొలగిస్తుంది

కర్పూరాన్ని కొబ్బరినూనెతో కలిపి రాసుకుంటే తలలో ఉండే సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియా తొలగిపోతాయి. కర్పూరంలో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ గుణాలు ఉన్నాయి, ఇవి స్కాల్ప్‌పై ఇన్ఫెక్షన్‌ను నివారిస్తాయి. కొబ్బరి నూనెతో జుట్టు మూలాలకు పోషణ అందించడం వల్ల జుట్టుకు బలం చేకూరి, ఫంగస్ సమస్యను దూరం చేస్తుంది. కొబ్బరి నూనె, కర్పూరాన్ని క్రమం తప్పకుండా వాడటంవల్ల స్కాల్ప్ ఆరోగ్యంగా ఉంటుంది, ఇది మంచి జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది.



జుట్టుకు మెరుపు, మృదుత్వాన్ని ఇస్తుంది

కొబ్బరి నూనె, కర్పూరంను క్రమం తప్పకుండా వాడటంవల్ల జుట్టుకు సహజమైన మెరుపు, మృదుత్వం వస్తుంది. కొబ్బరి నూనెలో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ జుట్టు మూలాలకు పోషణనిచ్చి, జుట్టును మృదువుగా చేస్తాయి. కర్పూరం జుట్టుకు శుభ్రమైన, తాజా అనుభూతిని అందిస్తుంది.

ఇలా తయారుచేసుకోవాలి...

రెండు కర్పూరం బిళ్లలు తీసుకుని వాటిని పొడిచేసుకోవాలి.

అరకప్పు కొబ్బరి నూనెను వేడి చేసుకోవాలి. కర్పూరం పొడిని కొబ్బరి నూనెలో కలుపుకోవాలి. అది కరిగే వరకూ వేడి చేసుకోవాలి.

తలస్నానం చేయటానికి అరగంట ముందు ఈ నూనెతో తలపై బాగా మసాజ్ చేసుకోవాలి. లేదా రాత్రి పడుకునేముందు తలకు రాసుకొని పొద్దున తలస్నానం చేయవచ్చు.

ఈ నూనెతో తలకు మసాజ్ చేయడం వల్ల హెయిర్ ఫోలికల్స్ వద్ద రక్త ప్రసరణ పెరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది వెంట్రుకల కుదుళ్లను బలోపేతం చేస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది.

వరి కొయ్యలకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు

క్రమంగా తగ్గుతున్న గడ్డి నిల్వలు

- దాంతోపాటు కొయ్యలకు నిప్పు పెడుతున్న రైతులు
- సింగల్ సూపర్ ఫాస్పెట్ చల్లడంతో కుళ్లిపోనున్న కొయ్యలు
- సేంద్రీయ కార్బనం ఎరువుతో భూమికి మేలంటున్న వ్యవసాయ అధికారులు



నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

వరి కోతల అనంతరం గడ్డి.. కొయ్యలను రైతులు తగలబెట్టడం పర్యావరణానికి ముప్పుగా మారింది. గ్రామాల్లో పశువుల పెంపకం క్రమంగా తగ్గుతూ వస్తుండటం వల్ల గడ్డి నిల్వల అవసరాలు తగ్గిపోతున్నాయి. మిషన్లతో పంటను కోయడం వల్ల పెద్ద పెద్ద కొయ్యలు పొలాల్లో మిగిలిపోతున్నాయి.. తరువాతి పంట సాగు కోసం గడ్డిని, కొయ్యలను రైతులు పొలాల్లోనే కాల్చేస్తున్నారు.

తద్వారా నేలతోపాటు వాతావరణానికి కూడా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. నేలలో ఉండాల్సిన పోషకాలు, వానపాములతోపాటు ఇతర సూక్ష్మక్రిములు నశించి నేల సారం దెబ్బతింటోంది. వ్యవసాయ రంగంలో రైతులు అనుసరించాల్సిన విధానాలను తెలుసుకొని నూతన పద్ధతులను పాటిస్తే సాగు ఖర్చులు తగ్గడంతో పాటు పర్యావరణాన్ని రక్షించడం, పశుపక్షాదులకు సహకరించిన వారవుతారనివ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు

వరి కొయ్యలు కాల్చడం వల్ల నష్టాలు

వానాకాలం వరి కోతలు పూర్తికాగానే చాలా మంది రైతులు వరి కొయ్యలను పొలాల్లో కాల్చుతున్నారు. దీని వల్ల వాతావరణం కాలుష్యమవుతోంది. దీంతోపాటు భూమిలో కోట్ల సంఖ్యలో ఉండే ఉపయోగకర బ్యాక్టీరియా, శిలింధ్రాలు చనిపోయి నేల నిర్జీవంగా మారుతుంది. పంటలు కూడా సరిగా పండకుండా వుండే అవకాశం ఉంది అని వ్యవసాయ శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు. వరి కొయ్యలు కాల్చడం వల్ల అందులో ఉండే పంట పెరుగుదలకు అవసరమయ్యే అనేక పోషకాలు నశిస్తాయి. నేలలో సేంద్రీయ కర్బన శాతం తగ్గిపోయి, నేల సారం తగ్గే అవకాశం ఉంది. వరి కొయ్యలు కాల్చడం వల్ల వేడికి నేలలో అధికంగా ఉండే అనేక రకాల ఉపయోగకర జీవులు చనిపోతాయి. వాయు కాలుష్యం పెరిగి, వాతావరణంలో పెను మార్పులు వస్తాయి. గాలి నాణ్యత తగ్గుతుంది. నేలలో తేమ శాతం తగ్గి, గట్టిపడి, నేల కోతకు గురయ్యే అవకాశం ఉంటుంది.

పంట అవశేషాలను సద్వినియోగం చేసుకునే పద్ధతి ఇలా..

వరి కొయ్యలను కలియ దున్నినట్లైతే నేలలో పోషకాల శాతం, సేంద్రియ కర్బన శాతం పెరిగి నేల సారం పెరుగుతుంది. వరి కొయ్యలను తొందరగా భూమిలో కుళ్లిపోయేలా చేసేందుకు, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పెట్‌ను ఎకరం పొలంలో చల్లి కలియ దున్నితే తొందరగా మురిగి నేల సారవంతమవుతుంది.

సూక్ష్మ మిశ్రమాలను వాడి కొయ్యలను తొందరగా మురిగేటట్టు చేసుకోవాలి. వేస్ట్ - డి మార్కెట్‌లో లభ్యమయ్యే వేస్ట్ డి- కంపోజర్ని ఉపయోగించి కూడా వరి కొయ్యలు త్వరగా మగ్గేటట్టు చేసుకోవచ్చు. వరి గడ్డిని సేకరించి, ముడి పదార్థంగా చేసుకొని కంపోస్ట్ పద్ధతిలో సేంద్రీయ ఎరువుగా మార్చొచ్చు. వరి గడ్డిని తగలబెట్టకుండా యూరియాలో మగ్గబెట్టి, పోషక విలువలను పెంచి పశువుల మేతగా కూడా వాడుకోవచ్చు. పంటల అవశేషాలను కాల్చకుండా ఆధునిక పద్ధతిలో నేల సారాన్ని పెంచి, పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సేంద్రీయ కార్బనం ఎరువుతో భూమికి మేలు

పొలం దున్నేటప్పుడు వరి కొయ్యలు మురగడానికి ఎస్ఎస్‌పి (సింగల్ సూపర్ ఫాస్పెట్)ని చల్లుకోవాలి. ఆ తర్వాత దున్నితే వరి కొయ్యలు తొందరగా కుళ్లి భూమికి సేంద్రీయ కర్బనాన్ని అందజేస్తుంది. దానివల్ల రసాయన ఎరువుల మోతాదును కూడా తగ్గించుకోవచ్చు. పర్యావరణానికి మేలు చేసిన వారమవుతాం. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

- జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రవణ్ కుమార్

అసెంబ్లీకి రా..సామీ

(మొదటిపేజీ తరువాయి)

వస్తున్నామని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమీక్ష చేస్తున్నారన్నారు. నియోజక వర్గంలోని కలికోట సూరమ్మ ప్రాజెక్టును పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగు నీరు అందిస్తామని చెప్పారు. పదేండ్లలో రూ.20లక్షల కోట్లు ఖర్చు చేసిన కేసీఆర్.. రూ.100 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన చరిత్ర కేసీఆర్‌దని, ఇప్పుడు అదే వరి ధాన్యం 66 లక్షల ఎకరాల్లో కోటీ 53లక్షల మెట్రిక్ టన్నులు పండిందని వివరించారు.

కేటీఆర్ ఊచలు లెక్కపెట్టక తప్పదు

'భూ బదలాయింపులపై హరీశ్‌రావు లెక్క చెప్పాలి. అన్ని లెక్కలూ తీయిస్తున్నాం. కొండపోచమ్మ నుంచి కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు కాల్వ ద్వారా నేరుగా నీళ్లు వెళ్తున్నాయి. ప్రజలు అధికారం ఇస్తే ఇదేనా మీరు చేసింది? డ్రగ్స్ తీసుకున్న వారు ఇంట్లో దొరికితే కేసు పెట్టకూడదా? బావ మరిది తాగి తందనాలు ఆడితే.. కేటీఆర్ ఎలా సమర్థిస్తారు? విదేశీ మద్యంతో దొరికితే కేసు పెట్టకూడదా? చట్టం అందరికీ సమానమే కేటీఆర్' అని అన్నారు. పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని భూ సేకరణ చేస్తున్నామని, అందుకు అధికారులు వస్తే దాడి చేస్తారా? అంటూ ప్రశ్నించారు. 'నా నియోజక వర్గంపై కేసీఆర్‌కు ఎందుకంత కక్ష? నేనేమీ లక్ష ఎకరాలు సేకరించ లేదు.



సేకరిస్తానన్నది నాలుగు గ్రామాల్లో 1100 ఎక రాలు మాత్రమే' అని చెప్పారు. 'నీ ఉరుకులాటలు గమనిస్తూనే ఉన్నా. ఎంత దూరం ఉరుకుతారో నేనూ చూస్తా. భూ సేకరణపై కుట్ర చేసినందుకు కేటీ ఆర్ ఊచలు లెక్కపెడతారు' అని హెచ్చరించారు. రంగనాయకసాగర్ వద్ద హరీశ్‌రావు ఫామ్‌హౌస్ కట్టుకున్నారని, భూ సేకరణ కోసం తీసుకున్న భూమిని హరీశ్‌రావు పేరు మీదకు రాయించుకున్నది నిజం కాదా? అని ప్రశ్నించారు.

పార్లమెంటుకు పంపినా రూపాయీ తేలేని 'బండి'

'పొన్నం ప్రభాకర్‌ను ఎంపీగా గెలిపిస్తే తెలంగాణ రాష్ట్రం సాధించారు. కరీంనగర్‌లో బీజేపీ ఎంపీని గెలిపిస్తే జిల్లాకు ఏం ఒరిగింది. రెండుసార్లు పార్లమెంట్‌కు ఇక్కడి నుంచి బండి సంజయ్‌ని పంపిస్తే రూపాయి పని కూడా చేయలేదు' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కనీసం పార్లమెంట్‌లోనైనా ప్రశ్నించారా? ఈ ప్రాంత అభివృద్ధికి చిల్లి గవ్వనైనా తెచ్చారా..? అంటూ ప్రశ్నించారు. అంతకు ముందు మూడుసార్లు బీఆర్ఎస్ ఎంపీలను గెలిపిస్తే వాళ్ల కూడా కరీంనగర్‌కు చేసిందేమీ లేదని అన్నారు. దేశానికి ప్రధానిని అందించిన గడ్డ కరీంనగర్ అని, పరిపాలన ఎలా ఉంటుందో నర్సింహారావు చూపించారని అన్నారు.

త్వరలోనే మిగతా రుణాలు మాఫీ :వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

రూ.30 వేల కోట్ల రైతు రుణాలకుగాను రూ.18 వేల కోట్లు మాఫీ చేశామని, మిగిలిన రూ.12 వేల కోట్ల రుణాలు త్వరలోనే మాఫీ చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తెలిపారు. గతంలో 20 శాతమే సాగైన సన్నరకం వడ్లు రూ. 500 బోనస్ ప్రకటనతో ఇప్పుడు 60 శాతం సాగయ్యాయని తెలిపారు.

రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే నాలుగేండ్లలో రూ.లక్ష కోట్లతో నాలుగు లక్షల ఇండ్లు నిర్మించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని చెప్పారు. ఇక్కడి మధ్య మానేర్‌లో నిర్వాసితులకు 4696 ఇండ్లకు రూ.250 కోట్లు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో '2024 రోల్ మోడల్ రెవెన్యూ చట్టం' తీసుకురాబోతు న్నామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్య నారాయణ, మక్కాన్ సింగ్ రాజ్ ఠాకుర్, డాక్టర్ సంజయ్ కుమార్, ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్, డీజీపీ జితేందర్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు.

డీఏపీ కోసంరోడ్డెక్కిన రైతన్న

(మొదటిపేజీ తరువాయి)

ఉప ఎన్నికలు జరుగుతున్న తరుణంలోనే డీఏపీకి కొరత ఏర్పడడం యోగి ప్రభుత్వాన్ని కలవరపెట్టింది. పశ్చిమ యూపీ, బ్రజ్ ప్రాంతాల్లో రైతులు ఎరువుల కోసం రాత్రంతా చలికి వణుకుతూ క్యూలలో నిలబడి వేచి ఉండడం కన్పించింది. హత్రాస్, మధుర తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి దృశ్యాలే కన్పించాయి. ఉత్తరప్రదేశ్ నుండి పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వరకూ రైతులు ఎరువుల కొరతతో ఇబ్బంది పడుతున్నారని రైతు సంఘాలు తెలిపాయి. సాధారణంగా సీజన్ ప్రారంభానికి ముందే ప్రభుత్వం డీఏపీని సేకరించి నిల్వ చేస్తుంది. కానీ ఈసారి సకాలంలో ఆ పని జరగలేదు.

నిపుణులు ఏమన్నారు?

ప్రభుత్వం వద్ద సరైన ప్రణాళిక లేకపోవడం, ఎరువుల సబ్సిడీలు ఈ పరిస్థితికి కారణమని నిపుణులు తెలిపారు. డీఏపీ, ఇతర కాంప్లెక్స్ ఎరువుల కోసం కేంద్రం సెప్టెంబర్ 18న రూ.24,475 కోట్ల సబ్సిడీని ఆమోదించింది. అయితే డీఏపీపై సబ్సిడీని పెద్దగా పెంచలేదు. దీంతో వివిధ కంపెనీలు దానిని దిగుమతి చేసుకునేందుకు ఆసక్తి చూపలేదు. రబీ సీజన్‌లో 60 లక్షల టన్నుల డీఏపీ అవసరమవుతుందని, అక్టోబర్ మధ్య నుండి డిసెంబర్ మధ్య వరకూ దీని వినియోగం అధికంగా ఉంటుందని పేరు చెప్పడానికి ఇష్టపడని నిపుణుడొకరు చెప్పారు. అయితే ఈసారి రబీ సీజన్ ప్రారంభంలో పదిహేను లక్షల టన్నుల డీఏపీ మాత్రమే అందుబాటులో ఉన్నదని, ప్రభుత్వం వద్ద తగిన ప్రణాళిక లేకపోవడమే దీనికి కారణమని ఆయన తెలిపారు. సబ్సిడీని చాలా తక్కువగా పెంచడంతో డీఏపీ దిగుమతులపై ప్రభావం పడిందని అన్నారు.

'అదానీ' విద్యుత్ ఒప్పందాలు సమీక్షించండి

(మొదటిపేజీ తరువాయి)

రెండు నెలల్లో నివేదిక అందజేయాలని జస్టిస్ ఫరా మహబూబ్, జస్టిస్ దెబాశిష్ రాయ్ చౌదరితో కూడిన బెంచ్ క్యాబినెట్ కార్యదర్శిని ఆదేశించింది. 2017లో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం జార్ఖండ్‌లోని గొడ్డా జిల్లాలోని యూనిట్ నుండి అదానీ గ్రూప్ బంగ్లాదేశ్‌కు విద్యుత్‌ను ఎగుమతి చేస్తోంది. అయితే ఈ ఎగుమతులు వివాదానికి కేంద్ర బిందువుగా మారాయి. ఒప్పందం మేరకు బంగ్లాదేశ్ అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తోందని నిపుణులు తెలిపారు.

విద్యుత్ కొనుగోలు బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకుపోయాయంటూ అదానీ గ్రూప్ సెప్టెంబరులో బంగ్లాదేశ్‌ను హెచ్చరించింది. బకాయిలు చెల్లించకపోవడంతో అదానీ గ్రూప్ ఆ దేశానికి విద్యుత్ సరఫరాను సగానికి తగ్గించిందని ఈ నెల ప్రారంభంలో వార్తలు వచ్చాయి. కాగా అదానీ గ్రూపుతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసేందుకు ఆదేశాలు ఎందుకు జారీ చేయకూడదో వివరణ ఇవ్వాల్సిందిగా న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. ఒప్పందంపై సంతకాలు చేసే సమయంలో జరిగిన చర్చలకు సంబంధించిన పత్రాలను నెల రోజుల్లో అందజేయాలని కూడా సూచించింది. అదానీ గ్రూపుతో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలన్నింటినీ రద్దు చేయాల్సిందిగా కోరుతూ బంగ్లాదేశ్ సుప్రీంకోర్ట్ న్యాయవాది అబ్దుల్ ఖయూమ్ ఈ నెల 13న దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను పురస్కరించుకొని హైకోర్టు ఈ ఆదేశాలు జారీ చేసింది. సుమారు రూ.7,200 కోట్ల బకాయిలను నవంబర్ 7వ తేదీ లోగా చెల్లించని పక్షంలో విద్యుత్ సరఫరాను పూర్తిగా నిలిపివేస్తానని అదానీ గ్రూప్ బంగ్లాదేశ్‌ను హెచ్చరించింది. అయితే ఆ తర్వాత దానిపై వివరణ ఇస్తూ బకాయిలను పూర్తిగా చెల్లించాలని తాను డిమాండ్ చేయలేదని తెలిపింది. షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో విద్యుత్ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. అదానీ గ్రూప్, బంగ్లాదేశ్ ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రత్యక్షంగా పాలుపంచుకున్నారా అంటూ ప్రతిపక్షాలు ప్రశ్నలు సంధించిన విషయం తెలిసిందే.

అమెరికా ఎంబసీ ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడి జరిగిందని మాస్కో ప్రకటించిన ఒక రోజు తర్వాత ఎంబసీపై దాడి హెచ్చరిక వెలువడింది. రష్యా లోపల ప్రాంతాలపై అమెరికా అందచేసిన ఆయుధాలతో ఉక్రెయిన్ దాడి చేసిన నేపథ్యంలో ఆ దాడిని నాటో దేశాలు, అమెరికా, యూరోపియన్ దేశాలు చేసిన యుద్ధంగానే పరిగణిస్తామని పుతిన్ హెచ్చరించారు. ఒకవేళ అదే పరిస్థితి ఎదురైతే, మారిన ఆ ఘర్షణల ప్రభావాన్ని దృష్టిలో వుంచుకుని, తమకు వచ్చే బెదిరింపులను పరిగణనలోకి తీసుకుని తగు నిర్ణయాలు తీసుకుంటామని పుతిన్ పేర్కొన్నారు.

తిలక్ వర్మ @ 3వ ర్యాంక్

ఐసిసి టి20 ర్యాంకింగ్స్ విడుదల



దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) ప్రకటించిన తాజా టి20 ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ యువ స్టార్ బ్యాటర్ తిలక్ వర్మ సత్తా చాటాడు. ఏకంగా 69 స్థానాలను మెరుగుపరుచుకొని టాప్-3లో నిలిచాడు. ఐసిసి బుధవారం వెల్లడించిన టి20 బ్యాటర్ల జాబితాలో తిలక్ 806 రేటింగ్ పాయింట్లతో 3వ స్థానంలో నిలువగా.. సూర్యకుమార్ యాదవ్ 788రేటింగ్ పాయింట్లతో నాల్గో స్థానంలో ఉన్నాడు. టాప్-10లో ముగ్గురు భారత బ్యాటర్లు చోటు దక్కించుకోగా.. యశస్వి జైస్వాల్(706) 8వ స్థానంలో ఉన్నాడు. టి20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టాప్-10లో ముగ్గురు టీమిండియా ఆటగాళ్ల చోటు సంపాదించడం ఇదే తొలిసారి. హెడ్(ఆస్ట్రేలియా) 855పాయింట్లతో అగ్రస్థానంలో, సాల్ట్(ఇంగ్లండ్) 828 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నారు. దక్షిణాఫ్రికాతో జరిగిన మూడు నాలుగు టి20ల సిరీస్‌లో తిలక్ వర్మ రెండు శతకాలతో రాణించడంతో అతని ర్యాంక్ మెరుగైంది. ఈ పర్యటనలో రాణించిన మరో భారత బ్యాటర్ సంజు శాంసన్(598) 22వ స్థానంలో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలో హార్దిక్ పాండ్యా నంబర్ వన్ ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మార్కస్ స్టొయినిస్ నాలుగో స్థానంలో, శ్రీలంక మాజీ కెప్టెన్ వనిందు హసరంగ ఐదో స్థానంలో నిలిచారు.

వెటరన్ అథ్లెట్ అఫ్జల్‌కు ఆర్థిక సాయం

రూ.3 లక్షలు అందజేసిన శాట్ ఛైర్మన్ శివసేనారెడ్డి



హైదరాబాద్ : భారత వెటరన్ ఫుట్‌బాల్ ఆటగాడు, 1962 జకర్తా ఆసియా క్రీడల్లో భారత్‌కు బంగారు పతకం సాధించటంలో కీలక భూమిక వహించిన డిఎంకె అఫ్జల్‌కు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) ఆర్థిక సహకారం అందించింది. తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అఫ్జల్ కొన్నాండ్లుగా మంచానికి పరిమితం అయ్యారు. అఫ్జల్ ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న శాట్ ఛైర్మన్ కే. శివసేనారెడ్డి రూ. 3 లక్షలను వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. బుధవారం గోల్కొండలోని అఫ్జల్ నివాసానికి వెళ్లిన శివసేనారెడ్డి ఆర్థిక సహాయం అందజేసి భరోసా కల్పించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన తెలంగాణకు, దేశానికి వన్నె తీసుకొచ్చిన వెటరన్ క్రీడాకారులను ఆదుకునేందుకు శాట్ త్వరలోనే సమగ్ర విధానం తయారు చేస్తుందని శివసేనా రెడ్డి తెలిపారు. శాట్ వీసీ, ఎండీ సోనీ బాలాదేవి, మాజీ క్రీడాకారులు షబ్బీర్ అలీ, విక్టర్ అమల్‌రాజ్, పీఆర్‌వో సురేశ్ కాలేరు కార్యక్రమంలో పాల్గొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఆర్థిక సహాయం అందించి, అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వం, శాట్ ఛైర్మన్‌కు అఫ్జల్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏసీబీకి వలలో స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్

- మరోచోట శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు..

నవతెలంగాణ-సిటీబ్యూరో





మలక్‌పేట్-2 సర్కిల్‌కు చెందిన స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. వివరాల్లోకెళ్తే.. స్టేట్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ మహబూబ్ బాషా ఓ ఫిర్యాదుదారుని బ్యాంక్ ఖాతాను డిఫ్రీజ్ చేయడానికి అవసరమైన లెటర్ ఇవ్వడానికి లక్ష రూపాయలు లంచం డిమాండ్ చేశాడు. అందులో భాగంగా బుధవారం 50 వేల రూపాయలు ఫిర్యాదుదారుని నుంచి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏ1 మహబూబ్ బాషాతో పాటు ఏ2 అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ సోమ శేఖర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఇదిలా ఉండగా, జీహెచ్ఎంసీ సర్కిల్ 18లో పనిచేస్తున్న ఇద్దరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా లంచం డిమాండ్ చేయగా.. ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. జూబ్లీహిల్స్‌లో ఓ కాఫీ షాప్‌కు ఫైన్ వెయ్యకుండా ఉండటానికి శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ (అవుట్‌సోర్సింగ్) సలీంఖాన్ ఓ వ్యక్తిని రూ.60,000 లంచం డిమాండ్ చేశాడు. చివరికి మరో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ జి.రమేష్ ద్వారా రూ.25,000కు ఒప్పందం కుదిరింది. ఈ మేరకు లంచం తీసుకుంటుండగా ఇద్దరిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

అదరగొట్టిన అమ్మాయిలు

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ విజేత భారత్

ఫైనల్లో చైనాపై గెలుపు



రాజ్‌గిర్(బీహార్): భారత మహిళల హాకీ జట్టు ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీని మరోసారి ముద్దాడింది. బిహార్ స్పోర్ట్స్ యూనివర్సిటీ స్టేడియంలో బుధవారం జరిగిన ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగింది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారతజట్టు బుధవారం జరిగిన హోరాహోరీ ఫైనల్లో చైనాను 1-0తో ఓడించి వరుసగా రెండోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను మూడో క్వార్టర్‌లో దీపిక కుమారి చేసింది. 31వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను దీపిక గోల్ చేసి జట్టుకు ఆధిక్యాన్ని అందించింది. ఆ తర్వాత ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. భారత్‌కు చైనా గట్టి పోటీ ఇచ్చింది. దాంతో తొలి రెండు క్వార్టర్స్‌లో ఇరుజట్లు గోల్స్ చేయలేకపోయాయి. అయితే, మూడో క్వార్టర్స్‌లో దీపికా గోల్ చేసి భారత్‌ను ఆధిత్యంలో వెళ్లేలా చేసింది. ఈ టోర్నీలో దీపికకు ఇది 11వ గోల్‌కావడం విశేషం. గతేడాది రాంచీలో 2016లో సింగపూర్‌లో ఈ టైటిల్‌ను గెలుచుకున్న భారత జట్టు అద్భుతంగా సమన్వయం చేస్తూ చైనాను నిలువరించింది. తొలి అర్ధభాగంలో ఎలాంటి గోల్ చేయకపోయినా.. ద్వితీయార్థం తొలి నిమిషంలో దీపికా పెనాల్టీ కార్నర్‌లో గోల్ చేసి అభిమానుల్లో జోష్ నింపింది. మూడో క్వార్టర్‌లోనే భారత్‌కు ఆధిక్యాన్ని రెట్టింపు చేసే సువర్ణావకాశం లభించింది. అయితే 42వ నిమిషంలో పెనాల్టీ స్ట్రోక్‌లో దీపిక కొట్టిన షాట్‌ను చైనా గోల్‌కీపర్ కుడివైపు డైవ్ చేసి కాపాడింది. మూడో క్వార్టర్‌లో భారత్‌కు పెనాల్టీ కార్నర్ లభించినా.. గోల్‌గా మలచలేకపోయారు. అయితే, మ్యాచ్ చివరలో మరోసారి భారత క్రీడాకారులు తడబడ్డారు. జపాన్‌తో జరిగిన సెమీఫైనల్స్‌లో 16 పెనాల్టీ కార్నర్‌లో ఒక్క దాన్ని కూడా గోల్స్‌గా మలచలేకపోయిన విషయం తెలిసిందే. ఫైనల్‌లో మొదటి 30 నిమిషాల్లోనూ నాలుగు పెనాల్టీ కార్నర్ వృథా అయ్యాయి. పెనాల్టీ కార్నర్‌లో గోల్ సాధించడం భారత్‌కు బలహీనంగా మారింది. ఈ టైటిల్‌ను భారత్ చేజిక్కించుకోవడం ఇది మూడోసారి. దక్షిణ కొరియా జట్టు కూడా గతంలో మూడుసార్లు విజేతగా నిలిచింది. మూడోస్థానం కోసం మలేషియాతో జరిగిన పోరులో జపాన్ జట్టు 4-1 గోల్స్‌తో గెలిచింది.

టైటిల్ విజేతగా నిలిచిన భారతజట్టు ఆటగాళ్లకు బీహార్ ప్రభుత్వం నగదు పురస్కారాన్ని ప్రకటించింది. ఒక్కో ప్లేయర్‌కు రూ.3లక్షలు నగదు, సహాయ, ఇతర సిబ్బందికి రూ.1.50లక్షలు చొప్పున అందజేయనున్నట్లు హాకీ ఇండియా(హెచ్‌ఐ)కు ఓ ప్రకటనలో తెలిపింది.

ఫైనల్	: చైనాపై (1-0)గెలుపు
సెమీఫైనల్	: జపాన్‌పై (2-0)గెలుపు
గ్రూప్‌దశలో...	
మలేషియాపై	: 4-0తో గెలుపు
దక్షిణ కొరియాపై	: 3-2తో గెలుపు
చైనాపై	: 3-0తో గెలుపు
జపాన్‌పై	: 3-0తో గెలుపు



బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో

- టీమిండియాదే ఆధిపత్యం
- బౌలింగ్ కోచ్ మోర్కెల్

పెర్త్: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా మరోసారి ఆధిపత్యం చెలాయించడం ఖాయమని క్రీడా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 2018, 2020 సీజన్‌లలో టైటిళ్లు నెగ్గిన భారత్.. వరుసగా మూడోసారి టైటిల్‌ను చేజిక్కించుకొని హ్యాట్రిక్ కొడుతుందని వారు తెలిపారు. అలాగే టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా నాయకత్వ సామర్థ్యంపై భారత జట్టు బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ ప్రశంసల జల్లు కురిపించాడు. పెర్త్ వేదికగా జరిగే తొలిటెస్ట్‌కు రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మ అందుబాటులో లేని పక్షంలో జస్ప్రీత్ బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ సిరీస్‌కు ఈ మిస్టరీ బౌలర్‌ను సెలెక్షన్ కమిటీ వైస్ కెప్టెన్‌గా నియమించింది. బుమ్రా గతంలో 2022లో ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టెస్ట్‌కు కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆ మ్యాచ్‌లో భారత్ ఏడు వికెట్ల తేడాతో ఓటమిపాలైంది. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్‌లో కూడా బుమ్రా వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. ఆస్ట్రేలియాతో జరిగే ఐదు టెస్టుల సిరీస్‌లో యువ ఫాస్ట్ బౌలర్లకు బుమ్రా మార్గనిర్దేశం చేస్తాడని బౌలింగ్ కోచ్ మోర్కెల్ పేర్కొన్నారు. బుధవారం జరిగిన మీడియా సమావేశంలో మోర్కెల్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు. అలాగే విరాట్ కోహ్లి, కేఎల్ రాహుల్ వంటి ఆటగాళ్లతో బుమ్రా సలహాలు అవసరమైన సలహాలు సూచనలు తీసుకోగలడని.. అది కెప్టెన్‌గా ముందుకు సాగడంలో సహాయపడుతుందని మోర్కెల్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా గడ్డపై బుమ్రాకు అద్భుతమైన రికార్డు ఉంది. ఏడు టెస్టు మ్యాచుల్లో 32 వికెట్లు పడగొట్టాడు. 2018-19, 2020-21 పర్యటనల్లో విజయం సాధించిన తర్వాత ఆస్ట్రేలియా గడ్డపై భారత జట్టు వరుసగా మూడో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోందని తెలిపాడు.

26 నుంచి ఫుట్‌బాల్ స్కేటింగ్ వరల్డ్‌కప్

భారత జట్టుకు కోచ్‌గా మహ్మద్ అబ్దుల్ ఖాదీర్



హైదరాబాద్ : ఈ నెల 26 నుంచి టర్కీ వేదికగా ఫుట్‌బాల్ స్కేటింగ్ వరల్డ్‌కప్ జరుగనుంది. ఫుట్‌బాల్ స్కేటింగ్ వరల్డ్‌కప్‌లో 33 దేశాలు పోటీపడుతున్నాయి. ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో పోటీపడే భారత జట్టుకు శాట్ కోచ్ మహ్మద్ అబ్దుల్ ఖాదీర్ జాతీయ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ప్రపంచకప్ సీనియర్, జూనియర్ బుధవారం హైదరాబాద్ నుంచి బయల్దేరింది. భారత జట్టులో ఎనిమిది మంది క్రీడాకారులు తెలంగాణ అథ్లెట్లు కావటం విశేషం.

నవచిత్రం

నాన్‌స్టాప్‌గా నవ్వుతూనే ఉంటారు : వెంకటేష్



వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ కాంబినేషన్‌లో రూపొందిన మూడవ చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు.

ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా హీరో వెంకటేష్ మాట్లాడుతూ,'సంక్రాంతికి ఒక మంచి ఎంటర్‌టైనర్ ఇవ్వాలనే ఉద్దేశంతో సినిమాని అద్భుతంగా ఫినిష్ చేసి, ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తున్నాం. ప్రేక్షకులకి, ఫ్యాన్స్‌కి, ఫ్యామిలీస్‌కి అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. ఇది నా కెరీర్‌లోనే బెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. ఆద్యంతం నవ్వుతూనే ఉంటారు. దర్శకుడు అనిల్‌తో వర్క్ చేయడం చాలా సౌకర్యంగా ఉంటుంది. సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం' అని అన్నారు. 'గేమ్ ఛేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలతో సంక్రాంతికి వండర్స్ క్రియేట్ చేయబోతున్నాం. అలాగే బాలయ్య 'డాకు మహారాజ్' సినిమాని కూడా మేమే రిలీజ్ చేస్తున్నాం. ఈ మూడు సినిమాలు సంక్రాంతికి పెద్ద విజయాలు సాధించబోతున్నాయి. ఈ సినిమా రషెస్ చూసి నాన్ స్టాప్‌గా నవ్వుకున్నాను. దర్శకుడు అనిల్ క్యాలెండర్‌లో ఈ సినిమా బెస్ట్ సినిమాగా నిలుస్తుంది' అని నిర్మాత దిల్ రాజు చెప్పారు.

డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ,'సంక్రాంతికి నాకు స్పెషల్ కనెక్షన్ ఉంది. సంక్రాంతికి వచ్చిన 'ఎఫ్ 2', మహేష్‌తో చేసిన 'సరిలేరు నీకెవ్వరు' సంక్రాంతి బ్లాక్ బస్టర్స్. మళ్ళీ ఈ సినిమాతో మీ అందరినీ నవ్వించడానికి వస్తున్నాం. ఎక్స్ కాప్, ఎక్స్‌గర్ల్ ఫ్రెండ్, ఎక్సలెంట్ వైఫ్ మధ్య జరిగే బ్యూటీఫుల్ జర్నీ ఇది. దీన్ని ఒక క్రైమ్ బ్యాక్‌డ్రాప్‌లో చేశాం. ఖచ్చితంగా థ్రిల్ ఫీలౌతారు. వెంకటేష్, నా కాంబినేషన్‌లో హ్యాట్రిక్ ఫిల్మ్‌గా రాబోతోంది' అని అన్నారు.

భిన్న కథాకథనాలు



అమ్మ రాజశేఖర్, అమ్మ రాగిన్ రాజ్

నిర్మాత ఆర్‌బిచౌదరి సమర్పణలో మెగా సూపర్ గుడ్ ఫిలింస్ పతాకంపై రూపొందిన చిత్రం 'తల'. ఎస్.వి.ప్రసాద్, వాకాడ అంజన్ కుమార్ నిర్మాతలు. అమ్మ రాజశేఖర్ దర్శకుడు.

ఈ చిత్రంతో ఆయన తనయుడు అమ్మ రాగిన్ రాజ్ హీరోగా పరిచయం అవుతున్నారు. త్వరలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు ఈ సినిమా రెడీ అవుతోంది.

ఈ నేపథ్యంలో బుధవారం ఈచిత్ర టీజర్ లాంచ్ ఈవెంట్ ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా జరిగింది.

డైరెక్టర్ అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ, 'మూవీ టీజర్ మీకు బాగా నచ్చిందని ఆశిస్తున్నాను. మన బాడీకి తల ఎంత ముఖ్యమో నాకు ఈ సినిమా అంతే ఇంపార్టెంట్. నా కెరీర్‌లో దేవుడిగా భావించేది ఆర్.బి. చౌదరిని. డ్యాన్స్ మాస్టర్‌గా ఆయన నాకు ఫస్ట్ అవకాశం ఇచ్చారు. ఆయన సినిమాలతోనే నాకు మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు ఆయన నిర్మాణంలో మా అబ్బాయిని హీరోగా పరిచయం చేస్తుండటం సంతోషంగా ఉంది. ఇది చాలా డిఫరెంట్ స్టోరీ. ప్రేక్షకులు కోరుకునే అన్ని ఎమోషన్స్, ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది. త్వరలోనే సినిమాని విడుదల చేస్తాం' అని తెలిపారు.

'నాన్న(అమ్మ రాజశేఖర్) 'తల' మూవీ కథ చెప్పినప్పుడు నా క్యారెక్టర్‌ని బాగా చేయాలని ఫిక్స్ అయ్యాను. నాన్నకి మంచి పేరు తీసుకొచ్చే సినిమా ఇది. మీరంతా థ్రిల్ అయ్యేలా ఉంటుంది' అని హీరో అమ్మ రాగిన్ రాజ్ చెప్పారు.

మాయగా సర్‌ప్రైజ్ చేస్తా..



శ్రద్ధా శ్రీనాథ్

విశ్వక్ సేన్ నటించిన తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. నూతన దర్శకుడు రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 22న విడుదల కానుంది.

ఈ సందర్భంగా హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ మీడియాతో ముచ్చటించారు.

'ఈ సినిమాలో మాయ అనే డిఫరెంట్ క్యారెక్టర్ చేశాను. ఇప్పటివరకూ చేయని క్యారెక్టర్ ఇది. చాలా ఛాలెంజ్‌గా తీసుకుని నటించాను. ఈ కథలో నా క్యారెక్టర్ కాంట్రీబ్యూషన్ చాలా క్రూషియల్‌గా ఉంటుంది. మెకానిక్ రాకీ జీవితంలో మాయ ఎలాంటి రోల్ ప్లే చేసిందనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ప్రేక్షకులకి చాలా సర్‌ప్రైజ్‌లు, ట్విస్ట్‌లు ఉంటాయి. చాలా విజిల్ మూమెంట్స్ కూడా ఉంటాయి. డైరెక్టర్ రవితేజ చాలా అద్భుతంగా తీశారు. విశ్వక్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. తనతో గతంలో ఒక సినిమా చేయాల్సి ఉంది. మిస్ అయ్యింది. ఈ సినిమాలో మా కెమిస్ట్రీ చాలా బాగుంటుంది. జేక్స్ బిజోయ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత రామ్ తాళ్లూరి చాలా గ్రాండ్‌గా నిర్మించారు. టెక్నికల్‌గా సినిమా టాప్ నాచ్‌లో ఉంటుంది. నా తొమ్మిదేళ్ళ సినీ జర్నీలో ప్రతి సినిమాని ఒక లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్‌గా తీసుకుని, ముందుకు వెళుతున్నాను. నేను నటించిన 'డాకు మహారాజ్' సంక్రాంతికి వస్తోంది. తమిళంలో ఓ వెబ్ సిరీస్ చేస్తున్నాను. విష్ణు విశాల్‌తో చేస్తున్న సినిమా కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది'.

మెప్పించే 'సినిమా పిచ్చోడు'

ఎన్నేటి ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై తెరకెక్కిన చిత్రం 'సినిమా పిచ్చోడు'. కుమార్ స్వామి, సావిత్రి కృష్ణ, కిట్టయ్య ప్రధాన పాత్రల్లో నటించారు. కుమార్ స్వామి దర్శకుడిగానూ పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని సంధ్య వెంకట్ నిర్మించారు. సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెల 22న థియేటర్స్‌లో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది.

ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ, 'ఇదొక మంచి ఎమోషనల్ కామెడీ ఎంటర్‌టైనర్. ఫ్యామిలీతో కలిసి చూసేలా సినిమా ఉంటుంది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కి విశేష స్పందన లభించింది. సినిమా కూడా అదే తరహాలో అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం. ఇందులో ఒక స్పెషల్ సాంగ్‌ని గీతామాధురి పాడారు. అన్ని పాటలు వినసొంపుగా ఉండటంతో సూపర్‌హిట్ అయ్యాయి' అని తెలిపారు.



కుమార్ స్వామి, సావిత్రి కృష్ణ

100% మంచి సినిమా



'దేవకి నందన వాసుదేవ'తో హీరో అశోక్ గల్లా అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. అర్జున్ జంధ్యాల దర్శకుడు. ప్రశాంత్ వర్మ కథ అందించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ నిర్మించారు.

ఈనెల 22న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌కు డైరెక్టర్ బోయపాటి శ్రీను, హీరో సుధీర్ బాబు ప్రత్యేక అతిథులుగా విచ్చేసి, చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

హీరో అశోక్ గల్లా మాట్లాడుతూ,'ప్రశాంత్ వర్మ ఒక సినిమాతో వస్తున్నారంటే అది ఖచ్చితంగా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఆయన కథ ఇవ్వడంతో బాలా చాలా గ్రాండ్‌గా ఈ సినిమాని తీశారు. అర్జున్ చాలా గ్రేట్ విజన్‌తో అద్భుతంగా తెరకెక్కించారు. మా సినిమా గురించి చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాము. మీరు డెఫినెట్‌గా ఎంజాయ్ చేసేలా ఉంటుంది' అని తెలిపారు.

'ఈ కమర్షియల్ డివైన్ థ్రిల్లర్‌లో అన్ని ఎలిమెంట్స్ ఉన్నాయి. ఇందులో సత్యభామగా అలరిస్తా. నటిగా అర్థవంతమైన కథలు చెప్పాలని తొలి అడుగు వేస్తున్నాను' అని హీరోయిన్ మానస వారణాసి చెప్పారు.

డైరెక్టర్ అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ,'టీమ్ సహకారంతో అద్భుతమైన అవుట్ పుట్ వచ్చింది. ప్రశాంత్ కథ ఇచ్చారు. సినిమా అంతా కంప్లీట్ అయిన తర్వాత ఆయనకి చూపించాను. చూసి ఆయన చాలా సర్‌ప్రైజ్ ఫీల్ అయ్యారు. చాలా అద్భుతంగా డెవలప్ చేసి తీశావ్ అన్నారు. ఈ సినిమా మీద నమ్మకంతో నిర్మాత బాల మొదటి పది నిమిషాలను ముందే చూపించాలని నిర్ణయించుకున్నారు. ఈ సినిమా చూసిన ప్రతి ప్రేక్షకుడు అద్భుతమైన సినిమాని తీశారని ప్రశంసిస్తారు. ఇప్పటివరకు ఇలాంటి సినిమా రాలేదు' అని అన్నారు.

'ఈ సినిమా అంచనాలకు మించి ఉంటుంది. ఈ సినిమా ష్యూర్ షాట్ హిట్. ఇది 100% మంచి సినిమా. రిలీజ్‌కి ముందే సినిమాలోని పది నిమిషాలను ప్రదర్శించామంటే అందరూ అర్థం చేసుకోవచ్చు. సినిమా ఫలితం పై మేం చాలా చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం' అని చెప్పారు.

ఫ్రెష్ కంటెంట్‌తో 'జీబ్రా'



సత్య దేవ్, డాలీ ధనంజయ్ నటించిన మల్టీ స్టారర్ చిత్రం 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించారు. ఈ సినిమా ఈనెల 22న థియేటర్లలోకి రానుంది.

ఈ సందర్భంగా మేకర్స్ నిర్వహించిన ప్రీరిలీజ్ ఈవెంట్‌లో హీరో సత్య దేవ్ మాట్లాడుతూ,'ఇది వెరీ యూనిక్ ఎంటర్‌టైనర్. ఇందులో బ్యాంకర్ రోల్ ప్లే చేశాను. నా గత సినిమాలకి భిన్నంగా ఉండే పాత్ర. కొత్త సత్యదేవ్‌ని చూస్తారు. చాలా ఫ్రెష్ కంటెంట్‌తో దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించాడు. ఈ సినిమా తప్పకుండా అన్ని వర్గాలను అలరిస్తుంది. ఓ మంచి సినిమాతో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను అని గర్వంగా ఉంది' అని అన్నారు.

ఇఫీలో హిందీ ట్రైలర్ రిలీజ్



జో శర్మ

దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల రూపొందించిన చిత్రం 'M4M' (మోటీవ్ ఫర్ మర్డర్). ఈ నెల 23వ తేదీ సాయంత్రం 7 గంటలకు ఈ చిత్ర హిందీ ట్రైలర్‌ను ప్రతిష్టాత్మక గోవా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ)లో ఐఎమ్‌పిపిఎ ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, దేశ, విదేశీయ సినీ ప్రముఖుల సమక్షంలో రిలీజ్ చేయబోతున్నారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాత మోహన్ వడ్లపట్ల మాట్లాడుతూ,'యూనివర్సల్ సబ్జెక్ట్‌తో రూపొందిన చిత్రమిది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సినీ ప్రేక్షకులు మా మూవీని చూసి థ్రిల్ అవుతారు. మోటీవ్ ఫర్ మర్డర్ అని తెలిసినప్పుడు మైండ్స్ బ్లో అవుతాయి. అనూహ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ని ఈ చిత్రం ద్వారా నేను మీ అందరికీ అందించబోతున్నాను. త్వరలోనే ఐదు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు.

తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషలలో ఈ సస్పెన్స్ థ్రిల్లర్ తెరకెక్కింది. జో శర్మ, సంబీత్ ఆచార్య, శుభలేఖ సుధాకర్, సత్యకృష్ణ, ఎంఆర్‌సి వడ్లపట్ల, పసునూరి శ్రీనివాస్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ: మోహన్ వడ్లపట్ల, రాహుల్ అడబాల, జో శర్మ, స్క్రీన్ ప్లే: మోహన్ వడ్లపట్ల, రాహుల్ ఆడబాల, డైలాగ్స్: శ్రీచక్ర మల్లికార్జున, సంగీతం: వసంత్ ఇసాయిపెట్టై, డిఓపీ: సంతోష్ షానమోని, ఎడిటింగ్: పవన్ ఆనంద్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

భారత్‌కు అంత సులభం కాదు..

అభివృద్ధి చెందిన దేశంగా మారడం

- ఏఐతో నిరుద్యోగం పెరగొచ్చు :

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్



చెన్నయ్ : వచ్చే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా హోదాను పొందడం అంత సులభమేమీ కాదని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ సి రంగ రాజన్ అన్నారు. చెన్నైలో ఏర్పాటు చేసిన జి రామచంద్రన్ స్మారకోపన్యాసంలో రంగరాజన్ మాట్లాడు తూ.. అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయం 14,000 డాలర్లుగా ఉంటే.. భారతీయుల తలసరి ఆదాయం 2500 డాలర్ల వద్దే ఉందన్నారు. అభివృద్ధి చెందిన దేశాల తలసరి ఆదాయం మరింత పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో భౌగోళిక రాజకీయ అవాంతరాలు, కృత్రిమ మేధస్సు వల్ల ఉత్పన్నమయ్యే అనిశ్చితి వంటి అనేక సవాళ్లను అధిగమించడమూ సులభం కాదన్నారు భారతీయుల తలసరి ఆదాయం ఏడు రెట్లు పెంచాలంటే.. ఏడాదికి సగటున కనీసం 10 శాతం వృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే 25 ఏండ్లలో ఆ స్థాయి వృద్ధి రేటు కష్టమన్నారు. ప్రపంచ వాణిజ్యం పురోగమిస్తున్న సమయంలో చైనా, దక్షిణ కొరియా వంటి దేశాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. ఇక ఆస్థాయిలో ప్రపంచ వృద్ధి ఉండకపోవచ్చన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ దిగుమతి సుంకాల పెంపునపై అనుసరిస్తున్న వైఖరిని దృష్టిలో ఉంచుకుని ప్రపంచ వాణిజ్యంలో పెద్దగా ఉత్సాహం కొనసాగకపోవచ్చని రంగరాజన్ సందేహం వ్యక్తం చేశారు. ఎఐతో నైపుణ్యాల స్థాయి ఉద్యోగాలను సృష్టించగలమేమో కానీ.. దాంతో పెద్ద ఎత్తున నిరుద్యోగానికి దారి తీయొచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు విస్తృతమైన విధానాలు మాత్రమే కాకుండా వ్యక్తిగత పరిశ్రమలు ఎదుర్కొంటున్న అవరోధాలను తొలగించే పాలసీని రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

వృద్ధి 6.5 శాతానికి పతనం

- ఇక్రా రేటింగ్స్ అంచనా



ముంబయి : భారత వృద్ధి రేటు తిరోగమనం పట్టనుందని అంతర్జాతీయ ఎజెన్సీలు హెచ్చరిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగి సిన త్రైమాసికంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 6.5 శాతానికి పరిమితం కావొచ్చని రేటింగ్ ఎజెన్సీ ఇక్రా బుధవారం ఓ రిపోర్ట్‌లో విశ్లేషించింది. ఇంతకు రెండు రోజుల క్రితం మోర్గాన్ స్టాన్లే కూడా జీడీపీ అంచనాలకు ఏడు శాతం నుంచి ఏకంగా 6.3 శాతానికి కోత పెట్టింది. ఇక్రా రేటింగ్స్ రిపోర్ట్ ప్రకారం.. ఈ ఏడాది భారీ వర్షాలు, బలహీనమైన కార్పొరేట్ కంపెనీల పనితీరు కారణంగా సెప్టెంబర్ త్రైమాసికంలో దేశ జీడీపీ 6.5 శాతానికి తగ్గొచ్చు. కాగా.. 2024-25 ద్వితీయార్ధంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకునే అవకాశాలు న్నాయి. దీంతో ఆర్థిక సంవత్సరంలో 7 శాతం వృద్ధి ఉండొచ్చు.

పట్టణ వినిమయం తగ్గుతోందన్న రిపోర్ట్‌ల నేపథ్యంలో ఇక్రా జీడీపీ అంచనాలకు కోత పెట్టడం విశేషం. 2024-25లో జీడీపీ 7.2 శాతంగా ఉండొచ్చని ఆర్‌బిఐ అంచనా వేసింది. జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో 6.7 శాతం వృద్ధి చోటు చేసుకున్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ త్రైమాసికం జీడీపీ గణంకాలను నవంబర్ 30న కేంద్ర గణంకాల శాఖ అధికారికంగా వెల్లడించనుంది. "సెప్టెంబర్ త్రైమాసికంలో పారిశ్రామిక రంగం ముఖ్యంగా మైనింగ్, విద్యుత్ రంగాలు మందగించే అవకాశం ఉంది. భారీ వర్షపాతం కారణంగా అనేక రంగాలు ప్రతికూలతను ఎదుర్కొంటున్నాయి. సరుకుల ఎగుమతుల్లో పతనం. పడిపోతున్న వ్యక్తిగత రుణాల వల్ల డిమాండ్ పడిపోవచ్చు. ఈ పరిణామాలు వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం చూపొచ్చు." అని ఇక్రా ఎకనామిస్ట్ అదితి నాయర్ పేర్కొన్నారు.

క్విక్ కామర్స్‌తో కిరాణా స్టోర్లపై ప్రభావం

- డేటామ్ రిపోర్ట్



న్యూఢిల్లీ : క్విక్ కామర్స్‌తో సంప్రదాయ కిరాణా స్టోర్ల వ్యాపారం క్రమంగా తగ్గుతోందని డేటామ్ రిపోర్ట్‌లో తేలింది. 2018లో కిరాణా స్టోర్స్ మార్కెట్ వాటా 95 శాతంగా ఉండగా.. 2023లో 92.6 శాతానికి తగ్గిందిని వెల్లడించింది. ఇది 2028 నాటికి 88.9 శాతానికి తగ్గొచ్చని అంచనా వేసింది. ఇందుకు ప్రధాన కారణం ఆన్‌లైన్ కిరాణా షాపింగ్‌కు ప్రాధాన్యత పెరగడమేని ఆ రిపోర్ట్ పేర్కొంది. 5 శాతం మంది కిరాణా స్టోర్ల నుంచి కొనుగోలు చేయడం పూర్తిగా మానేసినట్లు సర్వే వెల్లడించింది. క్విక్ కామర్స్ 2024లో ఏకంగా 74 శాతం వృద్ధిని అంచనా వేసింది. ఇది 2023-28 కాలంలో అత్యంత వేగంగా అభివద్ధి చెందుతున్న రిటైల్ ఛానెల్‌గా ఉందని ఆ పరిశ్రమ వర్గాల అంచనాన.

డిసెంబర్‌లో ఐయుఎంఎఫ్ సదస్సు

బెంగళూరు : అంతర్జాతీయ యూనిఫాం తయారీదారుల సదస్సు (ఐయుఎంఎఫ్) 2024ను బెంగళూరులో నిర్వహించనున్నారు. ఇది డిసెంబర్ 18 నుండి 20 వరకు జరుగుతుందని సోలాపూర్ గార్మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఎస్‌జిఎంఎ) ఛైర్మన్ సునీల్ మెంగ్జీ తెలిపారు. దీనికి పరిశ్రమలోని తయారీదారులు, సరఫరాదారులు, పంపిణీదారులకు వారి తాజా ఉత్పత్తులను ప్రదర్శించనున్నారన్నారు. 120 ప్రముఖ బ్రాండ్‌లు 10,000 కంటే ఎక్కువ డిజైన్‌ల యూనిఫాం దుస్తులు, యూనిఫాం ఫ్యాబ్రిక్స్ ఉపకరణాలతో పాల్గొంటాయన్నారు.

బిర్లా ఓపస్ పెయింట్స్ తయారీ విస్తరణ

బెంగళూరు : ఆదిత్య బిర్లా గ్రూప్‌లోని గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లో భాగమైన బిర్లా ఓపస్ పెయింట్స్ తన నాలుగో ప్లాంట్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. మైసూరుకు సమీపంలోని చామరాజ్‌నగరలో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. పూర్తిగా ఆటోమేటెడ్, ఇంటిగ్రేటెడ్ పెయింట్ ప్లాంట్ ఏడాదికి 866 మిలియన్ లీటర్ల తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉందని ఆదిత్య బిర్లా గ్రూప్ ఛైర్మెన్ కుమార్ మంగళం బిర్లా పేర్కొన్నారు. మూడేండ్లలో రూ.10వేల కోట్ల ఆదాయాన్ని చేరాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

నగరంలో 100 ఎంజి విండ్సర్‌ల డెలివరీ

హైదరాబాద్ : జెఎస్‌డబ్ల్యు ఎంజి మోటార్ ఇండియా తన ఎంజి విండ్సర్‌కు సంబంధించి హైదరాబాద్‌లో 100 యూనిట్లను డెలివరీ చేసినట్లు వెల్లడించింది. ఈ విద్యుత్ కార్లకు విశేష మద్దతు లభిస్తుందని ఆ కంపెనీ పేర్కొంది. తెలంగాణలో ఇవిలకు మరింత డిమాండ్‌ను పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన తెలంగాణ ఎలక్ట్రిక్ వెహికిల్ అండ్ ఎనర్జీ స్టోరేజ్ పాలసీ 2020-2030 పరిశ్రమకు మరింత మద్దతు అందించనుందని ఆ కంపెనీ పేర్కొంది. ప్రభుత్వ కొత్త ఇవి పాలసీలో రెండేళ్ల పాటు 100 శాతం రోడ్ పన్ను మినహాయింపు ఉందని తెలిపింది.

హైదరాబాద్‌లో జెప్టో కేఫ్ ఏర్పాటు

హైదరాబాద్ : ఇ-కామర్స్ జెప్టో హైదరాబాద్‌లో తన కేఫ్ సర్వీసులను ప్రారంభించినట్లు తెలిపింది. ఆ సంస్థ ఇటీవల కేఫ్ సర్వీసులను ప్రారంభించింది. ప్రస్తుతం ముంబయి, ఢిల్లీ, బెంగళూరుల్లో 120 కేఫ్‌లను ఏర్పాటు చేసింది. 2026 నాటికి కేఫ్ వ్యాపారం ద్వారా రూ.1,000 కోట్ల ఆదాయం లక్ష్యంగా తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నట్లు జెప్టో సిఇఒ అదిత్ పాలిచా తెలిపారు. తమ సర్వీసుల్లో 148 పదార్థాలను పది నిమిషాల్లో నాణ్యమైన ఆహార పదార్థాలు అందించే సర్వీసులకు అనూహ్యంగా స్పందన లభించిందన్నారు.

పట్టణ, గ్రామీణ విద్యార్థులకు ఒకే విద్యాబోధన అందాలి



- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి
- ప్రజాభవన్‌లో పిల్లల ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఒకే రకమైన విద్యాబోధన అందాల్సిన అవసరముందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి నొక్కిచెప్పారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సమకాలిన అంశాలతో పాటు పాఠ్యాంశాలపైనా డిజిటల్ ఆన్‌లైన్ తరగతులు నిరంతరంగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో యూనిసెఫ్ సారథ్యంలో అలయెన్స్ ఫర్ చైల్డ్ రైట్స్ అండ్ మహిత ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో ప్రత్యేకంగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, తదితరాలను ప్రజావాణి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ..పట్టణాలు, నగరాల్లో నివాసముండే విద్యార్థులకు నూతన పద్ధతుల్లో విద్యాభ్యాస అవకాశాలుంటాయనీ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మాత్రం ఇలాంటి సౌకర్యాలు చాలా తక్కువ అని చెప్పారు. అందుకోసం పట్టణ, నగర, గ్రామీణ విద్యార్థులందరికీ ఒకే విధమైన విద్యా బోధన అందాల్సిన ఆవశ్యకతను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు.

విద్యారంగ అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకెళ్తున్నారని చెప్పారు. అందులో భాగంగా 25 ఎకరాల స్థలంలో సమీకృత విద్యాలయాల నిర్మాణాలను చేపడుతున్న విషయాన్ని ప్రస్తావించారు. బాల్యం చాలా గొప్పదని బాల్య దశలోనే వారి భవిష్యత్తు జీవితాన్ని తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్యదేవరాజన్, చైల్డ్ ప్రొటెక్షన్ కమిషన్ చైర్మెన్ శ్రీనివాసరావు, కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్, మహిత ప్రోగ్రాం డైరెక్టర్ రమేశ్, శేఖర్‌రెడ్డి, యూనిసెఫ్ ప్రతినిధులు ఖ్యాతి తివారీ, ప్రసన్ సేన్, తదితరులు పాల్గొన్నారు.

మినిస్టర్ ఇన్ వెయిటింగ్

- మంత్రి సీతక్కను నియమించిన సర్కారు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము నేడు రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను రాష్ట్ర ప్రభుత్వం మినిస్టర్ ఇన్ వెయిటింగ్‌గా నియమించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేసింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రపతి రాష్ట్రంలో పర్యటించనున్నారు. అన్ని అధికార కార్యక్రమాల్లో రాష్ట్రపతి వెంట సీతక్క ఉండనున్నారు.

ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త అధ్యాయం

- గయానాలో ప్రధాని మోడీ చారిత్రక పర్యటన

జార్జి టౌన్, గయానా : గత 50ఏండ్ల కాలంలో మొట్టమొదటి సారిగా భారత దేశ ప్రధాని గయానాలో పర్యటిస్తున్నారు. రీయో డీ జెనీరో నుంచి బుధవారం తెల్లవారు జామున ఇక్కడకు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీ ఇక్కడి భారతీయులను కలుసుకున్నారు. వీరిలో చాలామంది 180 ఏండ్ల క్రితమే ఇక్కడకు వలస వచ్చేసిన వారే. గయానాలో దాదాపు 3,20,000మంది భారతీయ సంతతి వున్నారు. వీరు కాకుండా 2వేల మంది వరకు భారత జాతీయులు వున్నారు. వివిధ రంగాలకు చెందిన వారిని ఇలా కలుసుకోవడం తనకు చాలా సంతోషంగా వుందని మోడీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

వాతావరణంలో మార్పులతో ఇబ్బందులు



- జాగ్రత్తలు తీసుకోండి
- రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రానున్న ఏడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా పొడి వాతావరణంతో పాటు కొన్ని జిల్లాల్లో 15 డిగ్రీల సెంటిగ్రేడ్ కన్నా తక్కువ ఉష్ణోగ్రత ఉంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో అందుకు తగినట్టు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖ సూచించింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. సీజనల్ ఫ్లూ, ఇన్ ఫ్లూయెంజాలతో పాటు శ్వాస సంబంధమైన ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశముందని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటివి సాధారణమేననీ, ఎక్కువ మంది ఎలాంటి చికిత్స లేకుండానే కోలుకుంటారని తెలిపారు.

వీటి బారిన పడిన వారికి జ్వరం, దగ్గు, గొంతులో గరగర, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలు కనిపిస్తాయి. తగ్గు, తుమ్ములతో ఇవి ఒకరి నుంచి మరొకరికి సులభంగా అంటుకుంటాయి. ఈ లక్షణాలు కనిపించినచచ వెంటనే ప్రజలు ఇంట్లో విశ్రాంతి తీసుకోవడంతో పాటు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకుంటే వారంలోనే కోలుకుంటారు. గర్భిణిలు, ఐదేండ్ల లోపు చిన్నారులు, 65 ఏండ్లు పైబడినవారు. దీర్ఘకాలిక రోగులు వీటి బారిన పడితే వారికి ప్రమాదం ఎక్కువ. ఆరోగ్యపరమైన అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే 108 అంబులెన్స్ సేవలకు కాల్ చేయాలి. జ్వరం ఎక్కువగా ఉన్నా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందిగా ఉన్నా, చర్మం, పెదవులు నీలి రంగులోకి మారినా, ఉమ్మిలో రక్తం పడినా వెంటనే డాక్టర్ ను సంప్రదించాలని డాక్టర్ రవీందర్ నాయక్ సూచించారు.దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తప్పకుండా కవర్ చేసుకోవాలి. తరచుగా చేతులను శుభ్రం చేసుకోవాలి. కండ్లను, ముక్కును, నోటిని తాకొద్దు. రద్దీ ప్రదేశాలకు దూరంగా ఉండాలి. ఫ్లూ వచ్చిన వ్యక్తికి దూరంగా ఉండాలి. ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటో తొందరగా కోలుకుంటారు. చేతులు కలపకూడదు. అనారోగ్యబారిన పడిన వారికి సన్నిహితంగా మెలగరాదు. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయకూడదు. స్వీయ వైద్యం పక్కన పెట్టి ఫిజిషియన్ సలహాతో మెడిసిన్స్ తీసుకోవాలని కోరారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రత్యేక బెడ్లు, అత్యవసర మందులను అందుబాటులో ఉంచినట్టు డీహెచ్ డాక్టర్ బి.రవీందర్ నాయక్ తెలిపారు.

డిసెంబర్ 2 నుంచి గ్రూప్-2 మాక్ టెస్టులు

- 29 వరకు దరఖాస్తుల స్వీకరణ : మైనార్టీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చేనెల రెండో తేదీ నుంచి గ్రూప్-2కు హాజరయ్యే అభ్యర్థులకు మాక్ టెస్టులను ఉచితంగా నిర్వహించనున్నట్టు తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ డైరెక్టర్ టి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29 వరకు మైనార్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, జైన్, పార్శి, బుద్ధిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. అన్ని జిల్లాల్లో మాక్ టెస్టులను మైనార్టీ సంక్షేమ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తామని వివరించారు. వచ్చేనెల రెండున పేపర్-1, పేపర్-2, మూడున పేపర్-3, పేపర్-4 నిర్వహిస్తామని తెలిపారు. అదేనెల తొమ్మిదిన పేపర్-1, పేపర్-2, పదో తేదీన పేపర్-3, పేపర్-4 పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం 040 23236112 నెంబర్ లేదా directormscc-cctelangana@gmail.com ను సంప్రదించాలని సూచించారు. వచ్చేనెల 15, 16 తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షలను ఆబ్జెక్టివ్ విధానంలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించనున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

నేడు టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం

- తాజా పరిణామాలపై చర్చ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాది కాలం పూర్తి అవుతున్న నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన గురువారం పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. తాజా రాజకీయ పరిణామాలపై సమావేశంలో చర్చించనున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకుంటున్న తరుణంలో పెద్ద ఎత్తున ఉత్సవాలను నిర్వహించనుంది. డిసెంబర్ 4 లేదా 5న భారీ బహిరంగసభ నిర్వహించాలని భావిస్తున్నది. ప్రభుత్వ పథకాలను పార్టీ పరంగా ప్రచారం నిర్వహించేలా కార్యచరణ రూపొందించనుంది. ప్రతిపక్షాల విమర్శలను ఎలా తిప్పికొట్టాలోనే అంశంపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు.సమావేశానికి రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు ఎంపీలు హాజరుకానున్నారు. టీపీసీసీ అధ్యక్షులుగా మహేష్‌కుమార్‌గౌడ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన అధ్యక్షతన జరుగుతున్న తొలి కార్యవర్గ సమావేశమవుతున్నదని పార్టీ వర్గాలు చెప్పాయి.

కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్‌ది కీలకపాత్రం

- నాయకులకు ప్రాధాన్యత ఇస్తాం : టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో సేవాదళ్ నాయకులు, కార్యకర్తలది కీలకపాత్ర అని టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. వారికి పార్టీలో తగిన ప్రాధాన్యత ఇస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అనుబంధ సంఘాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందనీ, ఇప్పటికే వారికి చైర్మెన్ పోస్టులు ఇచ్చి గౌరవించామన్నారు. సేవాదళ్ కార్యకర్తలకు, నాయకులకు, గ్రామ, మండల స్థాయి కార్యకర్తలకు ఆయా స్థాయిల్లో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వందేండ్ల సేవాదళ్ ఆవిర్భావ ఉత్సవాలను చైర్మెన్ జితేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్యకర్తల కృషి ఫలితంగా ఏర్పడిందన్నారు. కష్టానికి తప్పకుండా ఫలితాలుంటాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ప్రజలకు సేవలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ మాట్లాడుతూ సేవాదళ్ బాధ్యత చాలా గొప్పదని చెప్పారు. నెహ్రూ అధ్యక్షులుగా మొదలైన సేవదళ్ ప్రస్థానం అనేక గొప్ప కార్యక్రమాలు చేసిందన్నారు. దేశాన్ని ఐక్యం చేసేందుకు రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించారని చెప్పారు. ఆ సమయంలో సేవదళ్ ఎంతో సేవలు చేసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికి తప్పకుండా గౌరవం దక్కుతుందని భరోసా ఇచ్చారు. సేవాదళ్ జాతీయ అధ్యక్షులు లాల్ జి దేశాయ్ మాట్లాడుతూ గుజరాతీలు దేశాన్ని లూటీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రధాని మోడీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలు దేశాన్ని సర్వనాశనం చేస్తున్నారని విమర్శించారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేవరకు ప్రతి సేవాదల్ కార్యకర్త కష్టపడి పనిచేయాలని సూచించారు. మాజీ ఎంపీ వి. హనుమంతరావు మాట్లాడుతూ సేవదళ్ కార్యకర్తలు నిస్వార్థంగా ప్రజలకు సేవలు చేస్తున్నారని తెలిపారు. నెహ్రూ సేవదళ్ నాయకుడి నుంచి దేశ ప్రధాని స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీగౌడ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మెన్ కల్వ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆ రాష్ట్రాల్లో పునర్విభజన ఎందుకు జరపలేదు

కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ : నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాల్లో దీర్ఘకాలం పెండింగులో ఉన్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను ఇంకా ఎందుకు చేపట్టలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణ తేదీ నాటికి దీనిపై సమాధానం ఇవ్వాలని ంకేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, న్యాయమూర్తి పీవీ సంజయ్ కుమార్‌తో కూడిన బెంచ్ ఈ వ్యవహారంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ చట్టపరంగా పునర్విభజన జరపాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మూడు రాష్ట్రాల్లో పునర్విభజన ప్రక్రియను వాయిదా వేస్తూ గతంలో జారీ చేసిన ఆదేశాలను 2020లో అప్పటి రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ రద్దు చేసిన విషయాన్ని సుప్రీంకోర్టు ప్రస్తావిస్తూ 'కానీ ఇప్పటి వరకూ మీరు ఏం చేస్తున్నారు? ఈ నాలుగు సంవత్సరాలుగా ఏం చేశారు?' అని అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) కేఎం నటరాజన్‌ను నిలదీసింది. లనాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్ రాష్ట్రాల్లో పునర్విభజన ప్రక్రియ చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగ విధి అని, అయితే నాలుగు రాష్ట్రాల్లో గత 51 సంవత్సరాలుగా ఆ పనే జరగలేదని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. వీటిలో అస్సాంలో మాత్రమే ప్రక్రియ ప్రారంభమైంది. మిగిలిన మూడు రాష్ట్రాల్లో కూడా అలాంటి కసరత్తు ఎందుకు చేపట్టలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

ఒకసారి నోటిఫికేషన్‌ను రాష్ట్రపతి రద్దు చేస్తే చాలునని తెలిపింది. దీనిపై ఏఎస్‌జీ వివరణ ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితి సమస్యాత్మకంగా ఉన్నదని, అరుణాచల్ ప్రదేశ్‌లో స్థానికులు పునర్విభజనను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కాగా ఈ పిటిషన్‌పై వచ్చే సంవత్సరం జనవరిలో తదుపరి విచారణ జరుగుతుంది.

జర్నలిస్టులందరికీ సంక్షేమ పథకాలను అంద జేయాలి

- టీఎస్ జేయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్నలిస్టులందరికీ సంక్షేమ పథకాలను అంద జేయాలని తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జేయూ) కోరింది. ఈ మేరకు బుధవారం నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఎన్‌యుజె(ఐ) జాతీయ ఉపాధ్యక్షులు నారగౌని పురుషోత్తం, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపాని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ హరీష్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. జర్నలిస్ట్ సంక్షేమ పథకాలకు, అక్రిడేషన్ కార్డులకు లింకు పెట్టొద్దని కోరారు. రాష్ట్రంలో అన్ని జర్నలిస్ట్ యూనియన్లకు అక్రిడేషన్ కమిటీలో భాగస్వామ్యం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి విధుల్లో చేరనున్న 8,047 కానిస్టేబుళ్లు

- ఇందులో 2,338 మహిళా కానిస్టేబుళ్లు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి - హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా శిక్షణ పూర్తి చేసుకున్న 8,047 స్టైఫండరీ కానిస్టేబుళ్లు గురువారం నుంచి విధుల్లో చేరనున్నారు. ఇందులో 2,338 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరికి పోలీసు విధులతో పాటు చట్టాలపై పూర్తి అవగాహన కల్పించడం జరిగిందని రాష్ట్ర డీజీపీ జితేందర్ తెలిపారు. గత తొమ్మిది నెలలుగా వీరికి వివిధ ఆయుధాల వినియోగంతో పాటు యాంటి నక్సలైట్ మూమెంట్, గ్రేహౌండ్స్, యాంటి టెర్రరిస్టు యాక్టివిటి వంటి చర్యలలో సాయుధ శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగునంగా శాంతి భద్రతల పరిరక్షణపై కూడా వీరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణతో పాటు కొత్తగా తీసుకొచ్చిన చట్టాలపైనా అవగాహనను కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబులళ్లను ఆయన అభినందించారు. ప్రజల అభిమతానికి అనుగునంగా చట్టపరిధిలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తూ, రాష్ట్ర పోలీస్ శాఖకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకు రావాలని నూతన కానిస్టేబుళ్లకు డీజీపీ దిశా,నిర్దేశం చేశారు.

రాష్ట్రాన్ని దివాళా తీయించారు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్యారెంటీల పేరుతో గద్దెనెక్కిన కాంగ్రెస్ రాష్ట్రాన్ని దివాళా తీయించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఓ విద్యుత్తు సంస్థకు చెల్లించాల్సిన రూ.150 కోట్లను రికవరీ చేసేందుకు ఢిల్లీలోని హిమాచల్ భవన్ జప్తునకు హైకోర్టు ఆదేశాలు ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "గద్దెనెక్కడం కోసం అడ్డగోలుగా గ్యారెంటీలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి పరిపాటిగా మారింది.

చేతికందినన్ని అప్పులు చేయడం, ఆఖరికి ఉన్న ఆస్తులు జప్తు చేయించుకునే పరిస్థితికి రావడం దారుణం. ఇది ఏ జూదగాని ఇంటి కథ కాదు. సాక్షాత్తు హిమాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. అదే రీతిలో రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన సాగుతోంది. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అమలు చేయడానికి ఏమేం విక్రయిస్తారో రాహుల్ గాంధీ చెప్పాలి" అని కేటీఆర్ ప్రశ్నించారు.

అమీన్‌పూర్ భూములపై స్టేటస్‌కో : హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని 6,12 సర్వే నెంబర్లల్లోని భూములపై సర్వే చే యించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఏది ప్రభుత్వ భూమో, ఏది ప్రయివేట్ భూమో తేల్చాలంది. హద్దులు తేల్చే వరకు స్టేటస్‌కో ఆర్డర్ అమల్లో ఉంటుందని ప్రకటించింది. సర్వే డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఆదేశాలిచ్చింది. ప్రయివేట్ పట్టా భూముల్లోని ఇండ్లు, విల్లాలను హైడ్రా కూల్చివేస్తే సంబంధిత సివిల్ కోర్టులో నష్టంతోపాటు పరిహారం కూడా బాధితులు కోరవచ్చునని స్పష్టం చేసింది. పటేల్‌గూడలో సర్వే నెం.6లోని తమ ఇండ్లు, విల్లాలను చట్టవిరుద్ధంగా చేపట్టిన కూల్చివేతలపై దాఖలైన పిటిషన్లను జస్టిస్ భాస్కర్‌రెడ్డి విచారించారు. సర్వే పూర్తయి హద్దులు తేల్చే వరకు యథాతథస్థితిని కొనసాగించాలని అధికారులను ఆదేశించింది.

ముగిసిన టెట్ దరఖాస్తు గడువు

- ఇప్పటి వరకు 2.48 లక్షల దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించి దరఖాస్తు స్వీకరణ గడువు బుధవారంతో ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 2,48,174 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఈ మేరకు టెట్ కన్వీనర్ రమేష్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్మెన్ ఈవి నరసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 71,655 మంది, పేపర్-2కు 1,55,971 మంది, రెండింటికీ 20,546 మంది కలిపి మొత్తం 2,48,174 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని వివరించారు. టెట్ దరఖాస్తుల సమర్పణకు తుది గడువు బుధవారం అర్ధరాత్రి వరకే ఉన్నది. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారి దరఖాస్తుల సవరణకు శుక్రవారం వరకు గడువున్నదని తెలిపారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే 7032901383/9000756178 నెంబర్లను సంప్రదించాలి.

ఎల్లలు దాటిన పోతన పద్యాలు



ఆరు నెలల్లో పోతన స్మృతివనాన్ని ప్రారంభిస్తాం

- బమ్మెరను టూరిజం హబ్ పెండింగ్ పనులను పూర్తి చేయాలి : టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి

నవతెలంగాణ-పాలకుర్తి

పోతన రచించిన పద్యాలు ఎల్లలు దాటడంతో బమ్మెర, పాలకుర్తి ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు దక్కిందని టూరిజం, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి మండలం బమ్మెరలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అధ్యక్షతన పోతన స్మృతి వనం, అభివృద్ధి పనులపై ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టూరిజం కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ముందుగా పోతన సమాధిని, పోతన వ్యవసాయం చేసేందుకు ఉపయోగించిన బావిని, అక్షరాభ్యాస కేంద్రాలను, సరస్వతి ఆలయాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్న పోతన పుట్టు పూర్వోత్తరాలను సేకరించారని తెలిపారు. పోతన మనవాడేనని, ఇక్కడే పుట్టి, ఇక్కడే రచనలు చేయడం తెలంగాణకు గర్వకారణమన్నారు. పాలకుర్తి, బమ్మెర, వల్మిడీ చారిత్రాత్మక ప్రదేశాలని, వాటన్నింటినీ కలిపి టూరిజం హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని వివరించారు. పాలకూరి సోమనాథుడు తొలి తెలుగు కవి అని, ఆయన రచనలను స్ఫూర్తిగా తీసుకొని పోతన సహజకవిగా మారారని గుర్తు చేశారు.